RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal




సంపుటి : 12 | సంచిక : 265 | ఆదిలాబాద్ | శుక్రవారం, మార్చి 14, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12

## దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ కుట్రను

# తిప్పికొడతాం





- ♦ నియోజకవర్గాల పునర్విభజన కాదు దక్షిణాది ప్రాధాన్యతను కుదించే ప్రయత్నం...
- ♦ దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకుంటున్న బీజేపీ
- ♦ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ.ఏ.రేవంత్ రెడ్డి
- ♦ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చకు రావాలని గౌరవ ముఖ్యమంత్రికి తమిళనాడు సీఎం స్టాలిన్ ఆహ్వానం
- ♦ గౌరవ సీఎంను కలిసి ఆహ్వానించిన డీఎంకే ప్రతినిధి బృందం..

ఢిల్లీ: నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టే కార్యాచరణ చేపడతామని గౌరవ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అది నియోజకవర్గాల పునర్విభజన కాదని దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే ప్రయత్నమని (%ఒష్టఱం ఱం అశీ నవశ్రీఅఎఊఁఅశీఅ... ఓ ఱం శ్రీఅఎఊఁఅశీఅ టశీతీ ంశీబ్ష%) సీఎం అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు.. చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు చెన్నైలో ఈ నెల 22న జరిగే సమావేశానికి హాజరుకావాలంటూ గౌరవ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డిని తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానించారు. ఈ మేరకు తమిళనాడు సీఎం రాసిన లేఖను ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం ఢిల్లీలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం అందజేసింది. 2026 తర్వాత చేపట్టే జన గణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందు గానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సీఎం స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని లేఖలో వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలో (జేఏపీ) చేరేందుకు అంగీకారం తెలపాలని స్టాలిన్ లేఖలో కోరారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు జేఏసీలోకి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒక ప్రతినిధిని నియమించాలని లేఖలో సూచించారు. గౌరవ ముఖ్యమంత్రిని కలిసిన డీఎంకే ప్రతినిధి బృందంలో ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్, డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, డీఎంకే ఎంపీలు ఏ.రాజా, ఎన్.ఆర్. ఇళంగో, కళానిధి వీరస్వామి, అరుణ్ నెహ్రూ ఉన్నారు. డీఎంకే ప్రతినిధుల బృందం కలిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాన్ని ఏరకంగానూ తాము సహించబోమని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మేం (దక్షిణాది రాష్ట్రాలు) దేశానికి ఎంతో సేవ చేశామని సీఎం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేదని... దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోందని సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా ఇప్పటికే నిర్ణయించిందని సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు అన్ని పార్టీల నేతలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించాలని ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానా రెడ్డిలకు సూచించినట్లు సీఎం తెలిపారు. తాము నిర్వహించే సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామని... ఆయన సమావేశంలో పాల్గొని అక్కడ వెల్లడైన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం అన్నారు. మా హక్కుల రక్షణకు తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి పాటుపడాల్సి ఉన్నందున ఆయనను పిలుస్తామని, ఆయన దీనికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు అంతా పాటుపడాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 22న చెన్నైలో నిర్వహించే సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజనతో కలిగే నష్టాలు.. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందిస్తామని సీఎం స్పష్టం చేశారు. అన్ని పార్టీలు, పౌర సంఘాల అభిప్రాయాలు సేకరించేందుకు తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి స్టాలిన్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని సీఎం అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కీలక పాత్ర పోషిస్తున్నారని,
ఆయనను ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు

## ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు సైకిళ్ల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ కవిత






హైదరాబాద్ : కార్యకర్తల ఆనందోత్సహాలు, కోలాహలం నడుమ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి గురువారం నాడు ఉదయం పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, తెలంగాణ జాగృతి శ్రేణులు, అభిమానులు ఆమె నివాసానికి తరలివచ్చారు. హైదరాబాద్‌లోని నంది నగర్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆశిస్సులు తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు డప్పు చప్పులు, గజమాలతో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలందరినీ కలుసుకున్న ఎమ్మెల్సీ కవిత... ప్రతి ఒక్కరిని పేరుపేరున పలకరించారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.మరోవైపు, ఎమ్మెల్సీ కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని జాగృతి సీనియర్ నాయకులు పర్వతనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు సైకిళ్ల పంపిణీ జరిగింది. ఎమ్మెల్సీ కవిత చేతుల మీదుగా శ్రీధర్ రావు సైకిళ్లను పంపిణీ చేయించారు. అదే విధంగా వికలాంగుడికి ట్రై స్కూటీ కూడా పంపిణీ చేయడం జరిగింది. బిఆర్ఎస్ పార్టీ బీసీ నాయకులు బొల్ల శివ శంకర్ ఆధ్వరంలో బీసీ కుల సంఘాల నేతలు ఎమ్మెల్సీ కవిత ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు కాగా, తన నివాసంలో వేడుకల తర్వాత శాసన మండలికి వెళ్లగా... అక్కడ బీఆర్ఎస్ పార్టీ శాసన మండలి పక్షం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూధనా చారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా, శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్ష కార్యాలయంలోనూ కేక్ కట్ చేయించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఎంఎల్సీ సత్యవతి రాథోడ్, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమా, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ చైర్మన్లు దేవి ప్రసాద్ , అయాచితం శ్రీధర్, రాజీవ్ సాగర్ , దూదిమెట్ల బాల్ రాజ్, రామ్ చందర్ నాయక్ , వెంకటేశ్వర్ రెడ్డి, రజిని సాయి చంద్ , గెల్లు శ్రీను, మఠం భిక్షపతి, గజ్జెల నగేష్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్ర తనోభ, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, శుభప్రద పటేల్ , ఇంతియాజ్ ఇషాక్ , నిజామాబాద్ మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అయేషా ఫాతిమా, విజిత్ రావు, అభిలాష్ రావు, రూప్ సింగ్, రామ్ బాబు యాదవ్ , హమాలీ శ్రీను, మారయ్య, జాగృతి నాయకులు మరియు శ్రేణులు ఎమ్మెల్సీ కవిత నివాసానికి వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

వినూత్న రీతిలో కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలు బీఆర్ ఎస్ పార్టీ, తెలంగాణ జాగృతి కార్యకర్తలు వినూత్న రీతిలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శేరిలింగంపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ ఒడిశాలోని పూరీలో సముద్ర తీరంలో ఎమ్మెల్సీ కవిత సైకత శిల్పాన్ని ఏర్పాటు చేశారు. జన్మదినం సందర్భంగా ఒడిశా కళాకారుల నృత్యాలు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. పూరీ సముద్రం చెంద రూపుదిద్దిన సైకత శిల్పం చూపరులను ఆకట్టుకుంటుంది. సైకత శిల్పంలో "కవిత ది ఫేస్ బిహైండ్ బతుకమ్మ గ్లోబల్ రీచ్" అని అందులో పేర్కొన్నారు. కళాకారులతో కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.ఎమ్మెల్సీ కవితపై చిన్నూ గౌడ్, మట్టా చౌదరి లఘు చిత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్నూ గౌడ్, మట్టు చౌదరి రూపొందించిన ప్రత్యేక లఘు చిత్రం అందర్నీ ఆకట్టుకుంటోంది. నాలుగు నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రం దక్షిణ కన్నడ జిల్లాలో చిత్రీకరించారు. అక్కడ పారే సెలయేరులు, నదుల్లో పడవలపై విన్యాసాలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. "హ్యాపీ బర్త్డే కవితక్క" అని పేర్కొని బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాలను ఆహ్లాదకరమైనటువంటి ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో రెపరెపలాడించారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్





హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ నుంచి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. స్పీకర్ పట్ల వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని మంత్రి సీతక్క శాసనసభలో ప్రతిపాదించారు. శాసన వ్యవస్థను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల విషయాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని సూచించారు. బడ్జెట్ సెషన్స్ ముగిసే వరకు జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలని సభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా.. స్పీకర్ ఆమోదించారు. జగదీశ్‌రెడ్డి వెంటనే సభ నుంచి వెళ్లి పోవాలని స్పీకర్ ఆదేశించారు.జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఛాంబర్‌లో కూర్చొన్న జగదీశ్‌రెడ్డి వద్దకు చీఫ్ మార్షల్ వచ్చి అసెంబ్లీ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. సభ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని, ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో కూర్చుంటే అభ్యంతరమేంటని బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు" అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు.

## బూర్గుల రామకృష్ణారావుకు సీఎం రేవంత్ ఘన నివాళి



ఢిల్లీ: హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, ముఖ్యమంత్రిగా, రెండు రాష్ట్రాలకు గవర్నర్ గా, సాహితీవేత్తగా, బహు భాషా వేత్తగా శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారు బహుముఖ ప్రజ్ఞ కనపర్చారని సీఎం కొనియాడారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, భువనగిరి ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సుంకాలపై రణమా.. శరణమా?

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి ఎన్నికైన నాటినుండీ దూకుడుగా వ్యవహరిస్తూ వాణిజ్య భాగస్వామ్య దేశాలు దిగుమతి సుంకాలు భారీగా తగ్గించకపోతే అమెరికా కూడా దీటుగా ప్రతీకార సుంకాలు విధిస్తుందని బెదిరించడం అనేక దేశాలకు కలవరం కలిగిస్తోంది. అమెరికాను మళ్ళీ గొప్పదేశంగా, ప్రబల ఆర్థికశక్తిగా రూపొందిస్తామని ట్రంప్ చెప్పడం శ్వేత జాతీయులకు, ఎలాన్‌మస్క్ వంటి ఆయన మద్దతుదారులకు శ్రవణ పేయంగా ఉన్నా సుంకాలపోరు వాణిజ్య యుద్ధాలకు దారి తీస్తుందేమోనని పలు దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే ట్రిలియన్ డాలర్ల ద్రవ్యలోటులో ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం కూడా సమస్యలతో సతమతమవుతున్నది. అమెరికాలో ఆదాయపు పన్ను శాఖను అంతర్గత రెవెన్యూ శాఖగా వ్యవహరిస్తారు. ఇప్పుడు విదేశీ రెవెన్యూ శాఖను ఏర్పరచి విదేశీ కంపెనీలు, వాణిజ్య సంస్థలనుండి సుంకాల పెంపుద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించి అమెరికా ఆర్థిక శక్తిని పెంచుతామని ట్రంప్ అంటున్నారు. ఎగుమతులు చేస్తున్న అన్ని దేశాలకు అమెరికా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్‌గా వుంది. అయితే ఇలా ఎగుమతులు చేస్తున్న దేశాలు అమెరికా నుండి వచ్చే వస్తువులపై భారీగా దిగుమతి సుంకాలు విధిస్తూ ఆదాయం పొందుతూ, లాభపడుతూ సొంత పరిశ్రమలను కాపాడుకుంటూ అమెరికాకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని, అమెరికా ఎగుమతిదార్ల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నాయని ట్రంప్ ధ్వజమెత్తుతున్నారు. వివిధ దేశాల నుండి వచ్చే వివిధ రకాల వస్తువులపై వేర్వేరు సుంకాలు విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమే అయినా ట్రంప్ ఖాతరు చేయడం లేదు. దిగుమతి సుంకాలు పెంచడం వల్ల వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరిగినా ట్రంప్ పట్టించుకోవడం లేదు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు సంపన్న దేశాల ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకాలు విధించడం ద్వారా తమ సొంత పరిశ్రమలను రక్షించుకునే వెసులుబాటు ఉండేది. ఆదిలో ధనికదేశాలు వీటిని అంతగా పట్టించుకోలేదు. వర్ధమాన దేశాలలో విద్యుత్ చార్జీలు అధికంగా ఉండటం, మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ ఖర్చు చేయాల్సి రావడం, రుణసౌకర్యాలలేమి, వడ్డీరేట్లు అధికంగా ఉండటం, కార్మికుల ఉత్పాదక సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల వస్తూత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండి సంపన్న దేశాలతో పోటీపడలేవు. అందుకే గతంలో గాట్, ప్రపంచ వాణిజ్య సంస్థ చర్చల్లో బడుగు దేశాలకు అధిక దిగుమతి సుంకాలు విధించుకునే వెసులుబాటు కల్పించాయి. యాంత్రీకరణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల సంపన్న దేశాల వస్తూత్పత్తి వ్యయం తక్కువ గనుక ధనిక దేశాలతో పేదదేశాలు పోటీపడలేకున్నాయి. వ్యవసాయేతర వస్తువులపై దిగుమతి సుంకాలు భారీగా తగ్గించాలని, లేదంటే ఆయా దేశాలపై దీటుగా సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కే మిగులు ఉన్నందున మన దేశం అమెరికాకు అవసరమైన మరిన్ని వస్తువులను ఎగుమతి చేయడం ద్వారా ఆ లోటును భర్తీ చేయవలసి వుంది. ఎగుమతులు పెరగాలంటే అమెరికా సుంకాలు సముచితంగా ఉండాలి. భారత్ దిగుమతి సుంకాలు ఎక్కువగా విధిస్తున్నందున దానికి దీటుగా సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఇప్పుడు ఎగుమతి దిగుమతులలో ఉ భయతారకమైన రీతిలో సంస్కరణలు చేపట్టి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. 2015 నుండి నాల్గేడు శాతం, వ్యవసాయేతర ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు 15% పెరిగాయి. అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వాములు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 5.6 శాతం వాణిజ్యం పెరిగింది. ఏప్రిల్, డిసెంబర్‌లో 45 బిలియన్ల వాణిజ్యం జరిగింది. భారత్‌కు 60 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులుంది. సమాచార సాంకేతిక విజ్ఞానం, ఐటి సేవల ఎగుమతులు పెరిగాయి. భారత్ 17 శాతం దిగుమతి సుంకాలు విధిస్తుండగా, అమెరికా విధిస్తున్నది 3.3 శాతం. 60 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో అమెరికా తదితర దేశాలకు 30 బిలియన్ స్మార్ట్ ఫోన్‌లే ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. అమెరికా గనుక భారత ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు పెంచితే మందులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తుల ధరలు పెరిగి పోటీకి నిలవలేకపోవడం, దేశీయంగా ఉత్పత్తి తగ్గించవలసి రావడం, లే ఆఫ్‌లు, పాక్షిక నిరుద్యోగానికి దారితీయవచ్చు. సానబట్టిన వజ్రాలు, శుద్ధిచేసిన చమురు ఉత్పత్తులు, వాటిలో వాడేందుకు దిగుమతులు ఎక్కువ గనుక పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. అమెరికా నుండి మరింత ముడిచమురు కొనుగోలుపై చర్చలు జరుగుతున్నాయి. ఖరీదైన హార్లీ దేవిడ్సన్ మోటార్ సైకిళ్ళు, బోర్బన్ విస్కీ దిగుమతులపై ప్రధాని మోడీ పర్యటనకు ముందే మన దేశం సుంకాలు తగ్గించి అమెరికాను ప్రసన్నం చేసుకుంది. అమెరికాకు భారత్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులు ఎక్కువ గనుక వాటిపై దిగుమతి సుంకాలు పెంచితే భారత్‌కు నష్టం. అమెరికా పెద్ద సాఫ్టవేర్ కంపెనీలైన ఇవై, ఆక్సెంచర్, ఐబిఎం, గూగుల్, మైక్రోసాఫ్ట్, జైన్ ప్యాక్ట్ తదితర కంపెనీలలో వేలాది మంది భారతీయులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె నగరాల్లో, అమెరికాలోని వివిధ నగరాలలో పని చేస్తున్నారు. భారత్ ఐటి ఇంజనీర్ల సామర్థ్యంపై అమెరికా కంపెనీలకు కొండంత నమ్మకముంది. న్యూయార్క్, న్యూజెర్సీ, టెక్సాస్, వర్జీనియా సహా పలు రాష్ట్రాలు, నగరాలలో వేలాది మంది భారతీయులు పని చేస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు ఎంతో దోహదపడుతున్నారు. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు, సూపర్ అధ్యక్షుడిగా పేరొందిన అమెరికా పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ భారత్‌లో వాణిజ్య విస్తరణకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కువ వస్తువులను దిగుమతి చేసుకునే దేశాలలో 3.3 ట్రిలియన్లతో అమెరికా అగ్రస్థానంలో ఉంది. చైనా 2.6 ట్రిలియన్లు, జర్మనీ 1.5 ట్రిలియన్ల వస్తువులు దిగుమతి చేసుకుంటున్నాయి. నెదర్లాండ్స్, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, భారత్, హాంకాంగ్, దక్షిణ కొరియాలది ఆ తర్వాత స్థానం. వాటికి కస్టమ్స్ సుంకాలను పెంచే శక్తి వుంది. అమెరికా 180 దేశాల నుండి వివిధ వస్తువులను దిగుమతి చేసుకుంటోంది. అందువల్ల దిగుమతి సుంకాలు పెంచుతామని ట్రంప్ చేసే హెచ్చరికల అమలు సాధ్యం కాకపోవచ్చు. ఈలోగా బెదిరింపుల ద్వారా కొంతైనా ఫలితం సాధించాలని ట్రంప్ ఎత్తుగడ. సేవల ఎగుమతులపై ట్రంప్‌కు అంత పట్టింపులేదంటున్నారు. మన దేశం నుండి మందులు ఔషధాలు, టెలికాం, ఎలక్ట్రానిక్, జౌళి వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, కంప్యూటర్లు, ఆటో విడిభాగాలు, జౌళి వస్త్రాల తయారీ యంత్రాల ఎగుమతులు ఎక్కువ. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తి అమెరికాలో లేనందున వాటి దిగుమతులు తప్పవు. పూర్తిగా తయారైన వాహనాలపై ప్రస్తుతం భారత్ విధిస్తున్న 125 శాతం సుంకాన్ని 20 శాతానికి తగ్గించాలని అమెరికా డిమాండ్. అలా చేస్తే ఎలాన్ మస్క్ ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులకు మేలు. ట్రంప్ ప్రారంభించిన సుంకాల పోరు, వాణిజ్య యుద్ధాలకు సదా సంసిద్ధమని, వెనక్కు తగ్గేది లేదని చైనా ఇప్పటికే స్పష్టం చేసింది. మెక్సికో, కెనడా, చైనా తదితర దేశాలు కూడా ప్రతీకార సుంకాలు విధించాయి. భారత్ కూడా భారీగా సుంకాలు విధిస్తున్నందున దీటుగా చర్యలుంటాయని, మినహాయింపు లేదని ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో మన వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ హుటాహుటిన అమెరికా వెళ్లి వాణిజ్య మంత్రితో, అధికారులతో వారం రోజులపాటు చర్చలు జరిపి వచ్చారు. ప్రస్తుతం భారత పారిశ్రామిక ప్రతినిధులతో చర్చిస్తున్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, సహకారాన్ని పెంపొందించుకోవాలని సంయుక్త ప్రకటనలో ఆకాంక్షించారు. గ్రీన్‌లాండ్‌ను, గాజాను కొంటాం, పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం, కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేసుకుంటాం అని ట్రంప్ బెదిరిస్తూ, చైనాను కట్టడి చేసేందుకు యత్నిస్తూ భారత్ పై అప్పుడప్పుడూ ఉరుముతున్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని, గాజా సంఘర్షణలను ఆపాలనే ఆకాంక్ష, ప్రయత్నాలు మంచివే. చైనా, రష్యాలు ఇప్పుడు ప్రబల శక్తులు. 143 కోట్ల జనాభా గల భారత్ అమెరికాకు అతిపెద్ద మార్కెట్. అలాంటి కీలకమైన భారత్ పై అమెరికా ఆచితూచి వ్యవహరిస్తేనే ఉభయతారకం. మునుపటి అధ్యక్ష ఎన్నికలలో 'అబ్ కీ బార్.. ట్రంప్ సర్కార్' అని ఊదరగొట్టినా డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి బైడెన్ గెలిచారు. ప్రస్తుత పరిస్థితులలో సమస్యలపై రణమా?

శరణమా? లేక రాజీమార్గమా అనే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. భారత ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తూ అగ్రరాజ్యంతో ఉభయతారకంగా, ప్రపంచ శాంతికి దోహదపడేలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వుంది.

# అత్యంత ప్రాచీనమైనది హోలీ పర్వం



హిందూ దేశంలో వివిధ ప్రాంతాలలో, వివిధ రకాలుగా మంటలు వేయడం ఆచరింపబడుతున్నా, తెలుగు నేలపై భోగి పండువకు, అలాగే హోలీ పండుగకు మంటలు వేయడం సాంప్రదాయంగా ఉంది. పరమ శివుని కోపాగ్నికి కాముడు భస్మం కావడానికి సూచన మాత్రమే కాక, "హోలిక" అనే రాక్షసి మంటల్లో కాలిపోయిన సంఘటనకు భూమికగా కూడా చెపుతుతారు. కొన్ని చోట్ల హోలిక ప్రతిమను కూడా తగల బెడతారు. హోలిక, హిరణ్య కశిపుని సోదరి. హిరణ్య కశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. తండ్రి నాస్తికుడు, తనయుడు ఆస్తికుడైన విష్ణుభక్తుడు. బాలకుని విష్ణుభక్తిని మార్చడానికి రాక్షసరాజు శతవి ధాలా ప్రయత్నించాడు. అయినా ప్రహ్లాదుడు చలించలేదు. అప్పుడు హిరణ్య కశిపుడు తన సోదరి హోలికతో సంప్రదించాడు. తనకు అగ్నివల్ల నాశనము లేదని వరం పొంది ఉన్న హోలిక, తన మేనల్లుడిని ఎత్తుకుని, పెద్ద మంటలో దుమికింది. ఆమె నాశనము కోరిన ప్రహ్లాదుడు, ఆ మంటమీదే పద్మాసనుడై కూర్చుండి ఉండి, విష్ణు ధ్యానంలో లీనమై ఉన్నాడు. అలా చాలా సేపు మంటల్లో ఉండి, పూర్తిగా చల్లారిన పిదప నిర్వికారుడు ప్రహ్లాదుడు బయటకు రాగా, తనకు నాశనమే లేదని నమ్మిన హోలిక మంటల్లో దహనమైంది. హోలీ పర్వం అత్యంత ప్రాచీనమూ, అంతర్జాతీయం కూడా, డాక్టర్ క్రూక్ రచించిన "గోల్డెన్ బౌ" అనే గ్రంథంలో ఈ పర్వాన్ని గురించి పేర్కొన బడింది. "ఇది అతి పురాతనమైన పర్వం, బహుశా క్రీస్తుపూర్వం నుండే ఉండవచ్చు. కొత్త సంవత్సరం రాకను సూచించేందుకు, ఆదిమ వాసులు సలుపుతూ వచ్చిన వేడుకలను గ్రహించిన ఆర్యులు, ఈ పర్వాన్ని కొనసాగించి ఉంటారు". దుష్ట గ్రహాలను భూమి.మీద పెచ్చరిల్లనియ్య కూడదని, వాటిని పెచ్చరిల్లనిస్తే, భూమిమీద పంటలు బాగా పండవనీ, మానవ జాతి అభివృద్ధికి కష్టమని ఆదిమ వాసులు భయపడి, కేకల వల్ల, మంటల వల్ల, బూతు మాటల వల్ల దుష్ట గ్రహాలు, దయ్యాలు తొలగి పోతాయని నమ్మిన కాలం నుండి మంటలు వేయడం ఉత్సవంగా మారిందని నమ్మకం. అలాగే ఉజ్జయిని రాజైన విక్రమ శక స్థాపకుడైన విక్రమార్కుడు, ఇలాంటి మంటలను ప్రారంభించినట్లు కథనాలున్నాయి. ప్రస్తుతం విక్రమార్క శకం 2081వ సంవత్సరం నడుస్తున్నది. విక్రమ శక సంవత్సరాలను సంవత్ అంటారు. ఫాల్గుణ పూర్ణిమ ఆ సంవత్ కు అఖరు దినం. మరునాటి నుండి కొత్త సంవత్సరం, ఇలా పాత సంవత్సరాన్ని (సంవత్) తగుల బెట్టడానికి గుర్తుగా ఈ మంటను పెట్టడాన్ని పాటించారని భావిస్తారు. మంటలు వేయడం, వసంతాలాటలు ఫాల్గుణ పూర్ణిమ నాటి ముఖ్య కార్యాలు. ఫాల్గుణ పూర్ణిమ నాడు పెద్ద మంటలు పెట్టడానికి కట్టెలు మొదలైన వాటిని పక్షం రోజుల నుండి ప్రోగు చేసుకునే వారు. ఎత్తుగా వాటిని పేర్చి వినోద క్రీడలతో కాల్చేవారు. ఇందులోని అగ్నిని పరమ పవిత్రంగా భావించి, దూర గ్రామాల వారు సైతం అగ్ని కణాలను తీసుకెళ్ళి, ఫాల్గుణ పూర్ణిమ మరునాడు, ఆ వసంత కాలాన పూచిన పువ్వులు, కాయలు, పచనము చేసి, తినే ఆచారం ఉండేది. పిల్లలు, మగవారు ఈ మంటల చుట్టూ నాట్యాలు చేసి, ప్రదక్షిణలు ఆచరించి, తమ శరీరాలకు విభూతిని రాసుకునే వారు.

కొన్ని రోగాల బారిన పడిన వారు, ఈ మంటల మీదుగా దుమికితే, రోగ విముక్తులు కాగలరని ప్రగాఢ విశ్వాసం. రాక్షసి బారి నుండి పరిరక్షించ బడిన ప్రహ్లాదుని ఉదంతం ఆధారంగా హోలీ మంటలు వేయడంలో బాలురకు ఎక్కువ స్వేచ్ఛ ఇవ్వడం ఆచారమైంది. ఈ పర్వంలో పిల్లలకు బహుమానాలు ముడతాయి. పంచదారతో చేసిన ఆకుపచ్చ పూసలు, తెల్ల పూసలతో దండలు కూర్చబడగా, వాటిని పిల్లలు కొంత సేపు ధరించి, ఆనందించి, తర్వాత తినడం చేస్తారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# రుతు సంబంధమైన పర్వం 'హోళి'



పండగల ప్రాదుర్భావానికి మూడు ముఖ్య కారణాలుగా కనిపిస్తాయి. ఒకటి మహాపురుషుల జన్మదినాలు. రెండవది గొప్ప సంఘటనలకు స్మృతి చిహ్నాలుగా జరుపుకునేవి. మూడవది రుతువులను బట్టి నిర్వర్తించుకునేవి. హోళి రుతు సంబంధ పర్వం. ప్రత్యేకించి వసంత రుతువుకు సంబంధించిన పండగ. మాఘమాసపు కృష్ణపక్ష పంచమి అంటే వసంత పంచమి దినాలకే, వసంత రుతువు లక్షణాలు పొడసూపుతాయి. కాగా ఫాల్గుణ పూర్ణిమ నాటికి అవి మరింత ప్రస్ఫుటమవుతాయి. రాగి రంగుతో చిగుళ్ళ, ఆకుపచ్చ రంగుతో పత్రాలు పలు రంగులతో పూలు దర్శనమిచ్చే సమయం. తొలకరి పంటలన్నీ ఇంటికి చేరి, పునాస పంటలన్నీ పంట ముఖాల పసిమితో ఉండే కాలమిది. ఇలా వర్ణోన్మీలనం ఈనాటి రంగులీలకు ప్రాతిపదికగా మారింది. హోళి పండగను హిందూ దేశంలో వివిధ ప్రాంతాలలో, వివిధ రకాలుగా జరుపుకోవడం కద్దు. హోలీ పండుగను భారత దేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో కూడా వైభవంగా జరుపు కుంటారు. వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను 'వసంతోత్సవం' పేరిట జరుపుకునేవారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో ఇదీ ఒకటి. బృందా వనంలో శ్రీకృష్ణుడు గొల్లపడుచు లతో వినోదించిన పూజకు, ఈ పండగకు కొన్ని చోట్ల సంబంధం ఉంది. బాలకృష్ణుని ఊయలలో పరుండచేసి, బుక్కా, గులాల్, ఎర్రపాడి చల్లి పూవులు వేసి, పూజ చేస్తారు. దీనిని డోల జాతరగా పిలుస్తారు. 'డోల' అంటే 'ఊయల', ఫాల్గుణ పూర్ణిమ వసంత సంబంధం. కొందరు ఔత్తరాహికులకు ఫాల్గుణ పౌర్ణమి కడచిన మరుసటి దినం సంవత్సరాది. దక్షిణాపథ వాసులైన కర్నాటక, మహారాష్ట్ర తెలుగు జాతీయులకు మరోపక్షంలో చైత్ర మాసాది ఉగాది. సూర్యుడు మేష రాశిలో ప్రవేశించే దినం తమిళుల వత్సరాది. ఇవన్నీ వసంతరుతు ప్రారంభంలోనే కావడం గమనార్హం. ఫాల్గుణ పౌర్ణమి దినమంతా ఉత్సవ దినవే. రంగులు కలిపిన నీళ్ళు ఒకరిపై ఒకరు చల్లు కుంటారు. ఇలా నీళ్ళు చల్లుకునే క్రీడనే వసంతోత్సవం అంటారు. వసంత కాలంలో వాతావరణం మెలమెల్లగా మారతూ, వైరల్ జ్వరం, జలుబు లాంటి వ్యాధులు ప్రబలడం కారణంగా, వాటి నివారణ,. ఉపశమనానికి కొన్ని ఔషధ మొక్కల నుంచి తయారు చేసిన సహజమైన రంగులు కలిపిన, నీటిని చల్లుకోవడం వల్ల ఈ వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందని పెద్దలు చెప్పేవారు. పూర్వకాలంలో మోదుగు పువ్వులు తెచ్చి రోట్లో పోసి దంచి, నీళ్ళతో కలిపి చల్లుకునే వారని జానపద పాటల ద్వారా గ్రహింప వీలగు తున్నది. మోదుగు పువ్వును దంచి శీతల కషాయం చేసి, చల్లుకోవడం వైద్య ప్రక్రియలో భాగమై, ఆరోగ్య వర్ధక మవుతుంది. మోదుగను సంస్కృతంలో 'పలాశ' అంటారు. బ్రహ్మచర్య వ్రత దీక్షితుడైన ఉపవీతుడైన వటునకు దండధారణ, పలాశ వృక్ష ఛాయలో ఉపనయన కార్యకలాపం, పలాశ పత్రాలతో కుట్టిన విస్తట్లో భోజనం ఆచరణగా ఉంది. వసంత కాలంలో ఎటువంటి వారికైనా కామోద్దీపనం కలగడం సహజం. కామాన్ని అదుపులో ఉంచుకొనుటకు మోదుగ అమోఘ సాధనం. ఉద్రేకాన్ని అణిచే ఉచిత వైద్య ప్రకియ ఇది. ఏప్రిల్ 1వ తేదీ క్రైస్తవుల "ఆల్ ఫూల్స్ డే"కు భారత దేశ హోలీ వేడుకలకు పోలికలున్నాయి. ఇది వసంతోత్సవం, గ్రామీణ క్రీడలు, ప్రేమ కలాపాలకు సంబంధించింది. యూరోపియన్ల అల్లరి చిల్లరి చేష్టలకు, హిందువుల బుక్కా, గులాల్, రంగునీళ్ళు చల్లుకోవడం, చిమ్ముకోవడం, వేళాకోళాలు చేసు కోవడాలకు దగ్గరి పోలికలు ఉన్నాయి. వేళాకోళాలు, ఆనందంలో మునిగి తేలడాలు అతిశయంగా ప్రదర్శితం అవుతూ, యువత ఇంటింటికీ తిరిగి పండగ ఖర్చులకు మామూళ్ళు దండుకునే కార్యక్రమం ఎక్కడా చూసినా దర్శనమిస్తున్నది.

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు

అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమాలను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయ కారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీ యులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు. త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాల పై, ఉపనిషత్తులపై ఆయన కున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తిసంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్యదంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మిం చారు. అయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలు గు బ్రాహ్మణులు. త్రిలింగ వైదీకులు. అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువా రూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహా లను పూజిస్తూ, ,"ఉంఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాము నిపై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువ తిని వివాహమాడారు. పార్వతి చిరు ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడా రు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు. కానీ, మనమడు చిన్నతనంలోనే మృతి చెందడంతో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణ య్య శిష్యరికంలో 13వ ఏటనే "నమో నమో రాఘవా" అనే కీర్తనను "దేశిక తోడి రాగం"లో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజ పంచరత్న కృతులలో ఐదవది అయిన, "ఎందరో మహానుభావులు" కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్ప తనాన్ని గుర్తించిన గురువు, తంజావూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించాడు. కానీ తనకు "నిధి కన్నా రాముని సన్నిధి సేవే సుఖమ"ని భావించి, త్యాగ య్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదా రాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యచే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేకం విగ్రహాలను, కావేరీ నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయా లు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు. "రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వ గాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే" స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, ఆ సందర్భంలోనే "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించాడు. మంత్రోపదేశం తో "స్వర్ణార్ణవం, నారదీయం" అనే రెండు సంగీత రహస్యార్థ శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్టానం, అని నాలుగు విధాలుగా గుర్తిం చారు. చాలావరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. జగదానంద కారకా అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారకా (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (అరభి), ఎందరో మహాను భావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ,)", అనేవి పంచ రత్న మాలికగా, "త్యాగరాజ ఆరాధనోత్సవాలలో" ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యారు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణా న, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నాల నిర్మాణం గావించా రు. ఆయన శిష్యగణం అక్కడే సంస్మరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరు ద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువయ్యారులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధ నోత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలోనే సకల కళా నిలయమైన ధర్మపురి క్షేత్రంలో దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏటా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దేవస్థాన ఆస్థాన సంగీత విద్వాంసులు రాష్ట్ర ప్రభుత్వ సన్మానితులు సంగీత రత్న, కొరిడే నరహరి శర్మ ఆధ్వర్యంలో, మార్చి 14న ప్రారంభించ బడి, 16 వరకు రాష్ట్రంలోని లబ్ద ప్రతిష్టులు అయిన కళాకారులచే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# శాస్త్రీయ, సినిమా సంగీతాన్ని మేళవించిన మహదేవన్

శతాధిక వత్సర భారతీయ సినీ ప్రస్థానంలో సంగీత దర్శకులలో ముందు వరసలో ఉండే వారిలో కె.వి మహదేవన్ ఒకరు. ఎం.ఎస్ విశ్వనాథన్ సమకాలీకుడైన, మహదేవన్ 1942లో ఆనందన్ అనే తమిళ సినిమాతో చిత్రరంగములో అడుగుపెట్టి ఆరు వందలకు పైగా దక్షిణ భారత సినిమాలకు సంగీతం సమకూర్చారు. తెలుగు రాకున్నా అద్భుత స్వరకల్పన చేసి, సంగీతానికి భాష అనే ఎల్లలు లేవు అని నిరూపించిన వారిలో మహదేవన్ అగ్రగణ్యులు. తెలుగు ప్రేక్షకుల నోళ్లలో నిరంతరం నానే పాటలను అందించిన ఘనత ఆయనది. యాభయ్యేళ్లకి పైగా సినిమా ప్రయాణం చేసిన ఆయన దక్షిణాది ప్రేక్షకుల్ని సుస్వర సాగరంలో ముంచెత్తారు. సినీ సంగీతాన్ని పరిపుష్టం చేశారు. శాస్త్రీయ సంగీతాన్ని, సినిమా సంగీతముతో మిళితం చేసే ఒరవడికి అయన ఆద్యుడని భావిస్తారు. కె.వి.మహదేవన్, 1942లో సినీ రంగ ప్రవేశం చేశారు. తమిళ, కన్నడ, మలయాళ, తెలుగు భాషల్లో 600 పైచిలుకు చిత్రాలకి స్వరాలు సమకూర్చారు. తెలుగులో 'లవకుశ', 'శంకరాభరణం', 'సిరివెన్నెల', 'శ్రుతిలయలు', 'పెళ్ళి పుస్తకం', 'సప్తపది', 'స్వాతికిరణం' తదితర ఆణిముత్యాల్లాంటి చిత్రరాజాలకి స్వర సొబగులద్ది చరిత్రని సృష్టించారు కె.వి. లెక్కలేనన్ని రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాల తో పాటు, ఆయన రెండు జాతీయ పురస్కారాల్ని సంపాదించు కొన్నారు. ఎందరో గాయకుల్ని సినీ రంగానికి పరిచయం చేసి, వారికి జీవితాల్ని ప్రసాదించిన ఘనత వహించారు. మహదేవన్ 1917లో మార్చి 14న తమిళనాడు లోని నాగర్‌కోయిల్‌లో లక్ష్మీ అమ్మాళ్, వెంకటాచలం అయ్యర్ (భాగవతార్) లకు జన్మించారు. మహదేవన్ తండ్రి వెంకటాచలం భాగవతార్ గోటు వాద్యంలో నిష్ణాతులు. వారి కుటుంబమంతా సంగీతజ్ఞులే. నాలుగేళ్ల ప్రాయంలోనే మహదేవన్ నాదస్వర వాద్యానికి ఆకర్షితుడై నాదస్వర విద్వాన్ రాజరత్నం పిళ్లై దగ్గర శిష్యరికం చేశారు. అలాగే బూదంపాడి అరుణాచల కవిరాయర్ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకొని కొన్ని కచ్చేరీల్లో పాల్గొన్నారు. ఏడవ తరగతి వరకు మాత్రమే చదివారు. కొన్ని నాటకాలలో నటించారు. సినిమాలో చేరాలని టి.వి.చారి సహాయంతో మద్రాసులో అడుగు పెట్టారు. "తిరుమంగై ఆళ్వార్" అనే తమిళ సినిమాలో జూనియర్ ఆర్టిస్ట్‌గా నటించే అవకాశం లభించింది. టి. ఎ.కల్యాణం దగ్గర కూడా పనిచేసి వృత్తి మెలకువలు నేర్చుకున్నారు. మహదేవన్ మిత్రుడైన కొళత్తుమణి సలహాతో, కొళత్తుమణికి సంగీత దర్శకుడైన ఎస్.వి.వెంకట్రామన్‌తో మంచి పరిచయం ఉన్న కారణంగా ఆయన దగ్గర సహాయకునిగా చేరారు. అప్పటికే అక్కడ సహాయకునిగా పనిచేస్తున్న టి.ఎ.కల్యాణంతో మంచి పరిచయం ఏర్పడింది. కల్యాణం దగ్గరే సినిమా సంగీతంలోని పట్లు, మెళకువలు నేర్చుకున్నారు. 1942 వ సంవత్సరంలో "మనోన్మణి" అనే తమిళ సినిమాలో "మోహనాంగ వదనీ" అనే పాటకు సంగీతం సమకూర్చే అవకాశం లభించింది. తరువాత "దేవదాసి" అనే సినిమాకు సంగీతం సమకూర్చారు. కాని ఆ సినిమా పెద్దగా ఆడక పోవడంతో అంతగా పేరు రాలేదు. ఆ తరువాత చాలా కాలం వరకు మళ్లీ అవకాశం రాలేదు. 1952లో మలయాళీ యువకుడు పుహళేంది పరిచయం అయ్యాడు. మహదేవన్ మనసు గెలుచుకున్నాడు. ఆయన చివరి వరకు మహదేవన్ తోనే పనిచేశారు. 1958 వ సంవత్సరంలో ప్రతిభా సంస్థ నిర్మించిన "దొంగలున్నారు జాగ్రత్త" అను సినిమాకు తొలిసారిగా తెలుగులో స్వరాలు అందించారు. అదే సంవత్సరంలో విడుదలైన ముందడుగు సినిమాతో మహదేవన్ ప్రతిభ బహిర్గతం అయింది. 1962 లో విడుదలైన "మంచి మనసులు" కేవలం పాటల వల్లే సినిమా హిట్టయిది అని పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా "మావా...మావా...మావా... ఏమి ఏమే భామా" పాట అనూహ్య జనాదరణ పొందింది. అప్పటి నుంచి మహదేవన్ ను సినీ రంగంలో మామ అని పిలిచారు. 1963లో వచ్చిన "మూగ మనసులు" తిరుగులేని స్థానానికి చేర్చాయి. తెలుగు సినిమా సంగీతంలో ఓ కొత్త బాణీకి ఊపిరి పోశారు. కవి పాట రాశాకే దానికి స్వరాలను సమకూర్చే ప్రత్యేకత ఆయనది. పాటలోని సాహిత్యాన్ని అధిగమించ కుండా స్వరాలను అల్లేవారు. ఒక్కోసారి సాహిత్యం కోసం బాణీల్లో మార్పులూ చేర్పులూ చేసే వారు. తెలుగు తెలియక పోయినా... కవి రాసిన సాహిత్యం అర్థం కాకపోయినా... అడిగి మరీ దానర్థం తెలుసుకొని సందర్భానుసారం స్వరాలను అందించేవారు. లే లే లే నారాజ", "మావ మావ మామ" లాంటి ఆ తరం మాస్ పాటలకు స్వరపరిచింది కూడా ఆయనే. స్వర చక్రవర్తికి 82 ఏళ్లు దాటాక "సహస్ర చంద్రదర్శనం" వేడుక చేశారు. సంపూర్ణ రామాయణము, తిరువిళయదాల్ వంటి పౌరాణిక చిత్రాలకు పేరుమోసిన మహదేవన్ శాస్త్రీయ సంగీతాన్ని, సినిమా సంగీతముతో మిళితం చేసే ఒరవడికి ఆద్యుడని భావిస్తారు. అనేక మంది సినీ సంగీత దర్శకులకు ఆయన గురువు. సంగీతం సమకూర్చిన సినిమాలలో శంకరా భరణం, దసరా బుల్లోడు, గోరింటాకు, ఇక భక్తి చిత్రాలైన అయ్యప్ప స్వామి మహత్యం, అయ్యప్ప స్వామి జన్మ రహస్యం, భార్గవ ఆర్ట్స్ ప్రొడక్షన్ లో వచ్చిన సుమారు అన్ని చిత్రాలకు స్వరాలను అందించారు. ఆయన సంగీతము సమకూర్చిన చివరి సినిమా కబీర్ దాస్ (2003) లో చనిపోయిన తరువాత విడుదలైంది. చనిపోక ముందు చివరి సినిమా " కె. విశ్వనాథ్ తీసిన "స్వాతి కిరణం". ఆ సినిమాకు రెండు పాటలనే స్వరపరిచగా, ఆరోగ్యం సరిగా లేని కారణంగా మిగిలిన పాటలను పుహళేంది స్వరపరిచారు. అయన పేరునే టైటిల్స్ లో వేసి గురుభక్తిని చాటుకున్నారు పుహళేంది. అలాగే తమిళంలో చివరి సినిమా మురుగనే తుణై (1990). కందణ్ కరుణై చిత్రానికి జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడు (1967), శంకరాభరణంబీ సినిమాకు జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడు (1980)బీ హైదరాబాదు ఫిలిం సర్కిల్ సంగీత చక్రవర్తి (1976)బీ రాజమండ్రిలోని లలిత కళానికేతన్ స్వరబ్రహ్మ (1976) బిరుదు ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ సంగీత దర్శకునిగా పురస్కారం అందుకొన్న మొదటి వ్యక్తిగా నిలిచారు. ఆయన జీవిత చరమాంకం హృదయ విదారకంగా గడిచింది. చివర్లో నరాల బలహీనత, మాట కూడా పడి పోవడం, మతి స్థిమితం కూడా తప్పింది. అలాంటి స్థితి చూసి, చాలా మంది కంటతడి పెట్టుకున్నారు. చివరకు శ్వాసపీల్చుకోవటం కష్టమై తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో ఉండి 2001, జూన్ 22న 83 సంవత్సరాల వయసులో మద్రాసులో మరణించారు. సినీ సంగీత ప్రపంచంలో ధృవతారగా నిలిచారు.

# ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



జయశంకర్ భూపాలపల్లి మార్చి 13(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండల కేంద్రంలో భారత్ జాగృతి అధ్యక్షులు,నిజామాబాద్ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.జాగృతి జిల్లా బాధ్యులు,మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్ కవితక్క పై తమకున్న అభిమానాన్ని చాటుకునే విధంగా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం మహేష్ మాట్లాడుతూ అందరిని ప్రేమతో పలకరించే సోదరి కవితక్క దేశం గర్వించే గొప్ప ప్రజా నాయకురాలని,తెలంగాణ రాష్ట్రానికి కాబోయే తొలి మహిళా ముఖ్యమంత్రి కవితక్క నేనని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయమైన రిజర్వేషన్ వాటా కల్పించాలని పోరాడుతూ, బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో చాలా చురుకైన పాత్ర పోషిస్తున్నారని, ఉక్కు మహిళ గా కీర్తించబడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మండల నాయకులు సాజీద్ ఆలీ,జుబేర్ ఖాన్,ముఫాకర్,అబీబ్, జాహేద్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటి క్యాంపస్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన



హనుమకొండ, మార్చి 13(వుదయం జిల్లా ప్రతినిధి) : బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం లోని ప్రభుత్వ భూములను బాసర ట్రిపుల్ఐటీ ఇన్చార్జి వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్, హైదరాబాద్ జేఎన్టీయూ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్ జగత్ సింగ్, స్థానిక అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. బాసర ట్రిపుల్ఐటీ ఎక్స్టెన్షన్ క్యాంపస్ ఏర్పాటుకు స్థల పరిశీలనకు వచ్చిన ఇంచార్జ్ వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ గోవర్ధన్, విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూరు హుస్సేన్ లు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఎక్స్టెన్షన్ క్యాంపస్ స్థాపనకు కావలసిన భూమి ని గురించి వివరాలను తెలియజేశారు. బాసర ట్రిపుల్ ఐటి క్యాంపస్ ఎక్స్టెన్షన్ ఏర్పాటుకు అనువుగా తొలుతా యాభై ఎకరాల భూమి కావాలని ప్రతిపాదించగా , భవిష్యత్తు అవసరాల కోసం మరో 50 ఎకరాలు (మొత్తం 100 ఎకరాల భూమి) కేటాయించాలని బాసర ట్రిపుల్ ఐటీ ఇన్చార్జ్ వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రొఫెసర్ మంజూరు హుస్సేన్ లు ప్రాథమిక ప్రతిపాదనలను చేశారు. క్యాంపస్ ఏర్పాటు కోసం కావాల్సిన వంద ఎకరాల భూమి గురించిన వివరాలను కలెక్టర్ తో సమావేశమై వివరించారు.

# ఎమ్మెల్యే దొంతి తనయుని ఆదేశాల మేరకు వందమంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పెన్సిల్స్ పంపిణి.

*యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్.*





ఖానాపురం మార్చి 13 వుదయం ప్రతినిధి.మండలంలోని బుధరావుపేట గ్రామ హైస్కూల్లోని ఆదర్శ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు పెన్సిల్ నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు దొంతి అవియుక్త్ రెడ్డి ఆదేశానుసారం వందమంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ గ్రామంలోని హైస్కూల్లోని ఆదర్శ పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న సుమారు 100 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పెన్సిలను పంపిణీ చేసి విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు గురువులకు పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా స్కూల్ ల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందము, మరియు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పల్స ప్రశాంత్, మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొల్లం హరీష్, ఎన్ఎస్ యుఐ గ్రామ ఉపాధ్యక్షుడు కట్లోజు శివాచారి, యూత్ నాయకులు అక్రమ్, నాగరాజు, పాషా, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు...



కుత్బుల్లాపూర్, మార్చి 13,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలో మహిళ నాయకులు సుకన్య, హిమాంబి, మంజుల, కృష్ణవేణి, హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి, 31వ డివిజన్ అధ్యక్షులు తోట బిక్షపతి, కుమార్ రెడ్డి, కోమటి శ్రీనివాసులు, రమణ, పాల్గొని మహిళలను శాలువాలతో సన్మానించి ఆటల పోటీలలో గెలుపొందిన మహిళా విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సాంబ శివరెడ్డి మాట్లాడుతూ మహిళలు మహాశక్తివంతులని అన్ని రంగాలలో రాణించే శక్తి సామర్థ్యాలు మహిళలకు సంపూర్ణంగా ఉన్నాయని, అన్ని రంగాలలో మహిళలు రానించాలని కోరుతూ మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, బిఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్నుల చెల్లింపులో ఎలాంటి వడ్డీ మాఫీ లేదు

నిర్మల్, మార్చి13(వుదయం ప్రతినిధి): పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఎలాంటి పనులలో వడ్డీ మాఫీ లేదని నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన వీసీలో ఈ విషయమై రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 31 వరకు ఆయా రకాల పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

# దేశప్రగతిలో విద్యార్థులే కీలక పాత్రధారులు.



సత్తుపల్లి మార్చ్ 13 (వుదయం ప్రతినిధి )నవచైతన్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జడ్పీఎస్ఎస్ కాకర్లపల్లి లో 10 వ తరగతి విద్యార్థులకు పరిక్ష మెటీరియల్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ నేటి విద్యార్థులే దేశప్రగతిలో కీలక పాత్రధారులు అని సత్తుపల్లి మండల విద్యాశాఖాధికారి నక్కా. రాజేశ్వరరావు పేర్కొన్నారు. కల్లూరు మండలం పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన నున్న. నరేష్ – లావణ్య దంపతుల కుమారుడు తక్షిత్ రామ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని అందరూ బాగా చదువుకోవాలని 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. సత్తుపల్లి మండలంలో వివిధ పాఠశాలల 10 వ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 10 వేల రూపాయలు సాయాన్ని అందించిన నరేష్ – లావణ్య దంపతులకు మరియు వారి కుమారుడు తక్షిత్ రామ్ కు నవచైతన్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదే నరసింహారెడ్డి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పురేటి యాకూబ్ సంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

# వడదెబ్బ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్



నారాయణపేట టౌన్ మార్చ్ 13(వుదయం ప్రతినిధి) రానున్న తీవ్ర ఎండాకాలంలో వడదెబ్బ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టర్ విసి హాల్లో వాతావరణం మార్పులు వేసవికాలం ఎండ తీవ్రత వడదెబ్బ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎండాకాలంలో ప్రతి ఒక్కరు ప్రయాణాలలో త్రాగునీరు వెంట తీసుకెళ్లాలన్నారు. ఎండ తగలకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని ఐఎండి సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు మహిళలు వృద్ధులు గర్భిణీలు ఎండ పట్ల తగు జాగ్రత్త వహించాలన్నారు. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఉపయోగించాలని నిమ్మరసం మజ్జిగ పండ్ల రసాలు వంటి ఇంట్లో తయారు చేసిన పానీయాలు కొద్దిగా ఉప్పు కలిపి త్రాగాలన్నారు. పుచ్చకాయ, కర్బూజా, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు కూరగాయలు వంటి అధిక నీటి పరిమాణం గల సీజనల్ పండ్లు కూరగాయలు తినాలన్నారు. సన్నని వదులుగా లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలని తలను కప్పుకోవాలని సూర్య రష్మి తగలకుండా గొడుగు టోపీ టవల్ వాడాలన్నారు. అనారోగ్యంగా భావిస్తే విపరీతమైన వేడి సమయంలో చల్లని ప్రదేశానికి వెళ్లి ద్రవపదార్థాలు తాగాలి. వడదెబ్బ అనేది మెడికల్ ఎమర్జెన్సీ కావున అయోమయం గందరగోళం ఆందోళన చిరాకు మూర్ఛ లేదా కోమ వంటివి పెద్దలలో కలుగుతాయని, శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల వరకు ఉండి తలనొప్పి ఆందోళన, వికారం, వాంతులు, హృదయ స్పందన పెరగడం వంటివి కలుగుతాయన్నారు. కూలీలు పని ప్రదేశంలో చల్లని త్రాగునీటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్మికులు నేరుగా సూర్య రష్మికి గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్మికులకు కూలీలకు షెడ్డు ఏరియాలో ఏర్పాటు చేయాలన్నారు. మీ ఇంటిని చల్లగా ఉంచండి షెటర్లు లేదా చలువ పందిల్ల ను ఉపయోగించండి.

రాత్రివేళ కిటికీలను తెరవాలి. పగటిపూట దిగువ అంతస్తుల లో ఉండడానికి ప్రయత్నించాలని శరీరాన్ని చల్లబరచటానికి ఫ్యాన్, తడి బట్టలను ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుండి మూడు గంటల వరకు ఎండలో బయటకు రాకూడదనీ ఇలాంటి జాగ్రత్తలు వేసవిలో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం దీనికి సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ గారిమా నరుల, డి. ఎం. హచ్. ఓ. సౌభాగ్య లక్ష్మి తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి.!

## – హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




హనుమకొండ, మార్చి 13(వుదయం జిల్లా ప్రతినిధి) :ఇంటర్మీడియట్ , పదో తరగతి వార్షిక పరీక్షలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డు లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(ధర్మసాగర్)ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలా రాస్తున్నారు, నీట్, ఎంసెట్ లకు దరఖాస్తు చేశారా అని కలెక్టర్ జూనియర్ కళాశాల విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి క్లాసురూములకు వెళ్లి విద్యార్థునులతో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక పరీక్షల సన్నద్ధత గురించి విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అందులో ఉన్న వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసెట్, నీట్ పరీక్షల పుస్తకాలను కళాశాల విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. వంట గది, స్టోర్ రూమ్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజనాన్ని, కూరలను పరిశీలించారు. విద్యార్థినులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అల్పాహారం, భోజనం, అందించే మెనూ చార్ట్ ను పరిశీలించారు. విద్యార్థినులకు సంబంధించిన టాయిలెట్స్ ను పరిశీలించారు.

పరీక్షలు రాస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులతో పాటు వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థినులతో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు బాగా సన్నద్ధమై ఫలితాల్లో మంచి మార్కులు సాధించి రాష్ట్రంలో జిల్లా పేరును నిలపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కలెక్టర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. యథాస్థానానికి పాఠశాల, కళాశాలను తరలించేందుకు అక్కడ కావాల్సిన వసతి సదుపాయల గురించి ప్రతిపాదనలు సమర్పిస్తే వాటిని మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులకు కలెక్టర్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర పరీక్ష సామాగ్రి అందజేశారు. పదో తరగతి హాల్ టికెట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కామ దహనం నిర్వహించిన అర్చకులు



గద్వాల మార్చి 13 (వుదయం ప్రతినిధి) ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో హెూలీ పండుగ సందర్భంగా గురువారం కామ దహనం నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్, దీరేంద్రదాస్, శశాంక దాస్ ఆధ్వర్యంలో కాముడు భీముడు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రమేష్ మాట్లాడుతూ మానవునిలో ఉండే అరిషడ్వర్గాలను రూపుమాపడానికి కామ దహనం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర రావు, శ్రీను, కృష్ణ, ధర్మన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబ సభ్యులకు హెల్త్ చెకప్ క్యాంప్.



మధిర,మార్చి13(వుదయం ప్రతినిధి) ఫోటోగ్రాఫర్స్ తమ విధులలో భాగంగా రాత్రి పగలు తమ విధులను నిర్వహిస్తూ ఆరోగ్యం పట్ల కొంత అశ్రద్ధగా ఉంటారు ఇది గమనించిన జిల్లా కమిటీ ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ఆరోగ్యం ముఖ్యమని ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ తన యొక్క ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సాధించాలని ప్రతి ఫోటోగ్రాఫర్కు యశోద హాస్పిటల్ వారిచే ఉచిత హెల్త్ క్యాంప్ ను మధిర యాదవ్ బజార్ నందు గల షాదీ ఖానా నందు నిర్వహించినారు ఈ క్యాంపులో బిపి , షుగర్, ఈసీజీ టు డి ఎకో, ఐ చెక్ అప్, మరియు జనరల్ ఫిజీషియన్ ఆర్థోపెడిక్ , గైనకాలజీ, కార్డియాలజీ ఉచిత సేవలను అందించారు మధిర, ఎరుపాలెం ,బోనకల్ మండలాల ఫోటోగ్రాఫర్స్ అందరూ హాజరై ఈ వైద్య పరీక్షలను ఉచితంగా పొందారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ సభ్యులందరూ ఉచిత ఆరోగ్య సేవలను అందుకున్నందుకు సంతోషకరమని ముందు ఫోటోగ్రాఫర్ల అభివృద్ధి కై మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నం కనకారావు గారు,జిల్లా కోశాధికారి నీరుడు తిరుపతి రావు, జిల్లా జాయింట్ సెక్రటరీ అంగడాల గోపీనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు మురళీ,మధిర మండల అధ్యక్షులు పార్వతి , సెక్రటరీ ఎడవల్లి శ్రీధర్ , మాజీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరావు సత్తుపల్లి మండలం నుంచి తిరుమల రావు, హరి,సతీష్, మధిర గౌరవ అధ్యక్షులు శ్యామా రావు, సీనియర్ ఫోటోగ్రాఫర్ ఎడవల్లి నాగభూషణం,మూడు మండలాల ఫోటోగ్రాఫర్లు మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు...

## విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్/( వుదయం ప్రతినిధి) డోర్నకల్ ,విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం.


. పకీర తండ పరిధి తులస్యతండాకు చెందిన బోడ సుక్య(50)ఇంటి వద్ద ఆవరణంలో ఇనుప తీగపై బట్టలారేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాత్మానికి గురై మరణించినట్లు తెలిపారు. మృతుడికి కుమారుడు కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

# రబింద్రాలో ముందస్తు హెూలీ వేడుకలు



ముధోల్, మార్చ్13 (వుదయం ప్రతినిధి) ముధోల్ నియోజకవర్గ కేంద్రంలోని రబింద్రా ఉన్నత పాఠశాలలో గురువారం రోజున ముందస్తు హెూలీ వేడుకలు జరుపుకున్నారు. పాఠశాలలో వివిధ రంగులతో కూడిన మొగ్గలు వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రంగులు వేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రసాయన రంగులకు బదులుగా సహజసిద్ధంగా తయారు చేసిన రంగులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రబింద్రా ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఆసంవార్ సాయినాథ్, ప్లే స్కూల్ ఇంచార్జ్ హేమలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శిశుమందిర్ లో హెూలీ వేడుకలు





ముధోల్, మార్చ్13 (వుదయం ప్రతినిధి)ఈరోజు ముధోల్ మండల కేంద్రములోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ముందస్తు లి"హెూలీ"లి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రహ్లాదున్ని, శ్రీకృష్ణ రాధ లను పూజించి హెూలిక దహనం గావించారు. అనంతరం హెూలిక దహనం , రంగోలి పండుగల చారిత్రక నేపథ్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు విద్యార్థులు పాల్గొని ఆనందంతో గంతులేస్తూ ఒకరికి వసంతోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ రంగులను చల్లుకున్నారు.


# పదోన్నతి పొందిన పొందిన మిత్రుడికి సన్మానం



జన్నారం,మార్చ్ 13(వుదయం విలేకరి) అటవీ సెక్షన్ అధికారిగా పదోన్నతి పొందిన జన్నారం మండలంలోని కలమడుగు బీట్ అధికారి ముజీబోద్దీనన్ను టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సన్మానించారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని పీఆర్టీయూ భవన్ లో పదోన్నతి పొందిన ఎఫ్ఎస్ఓను వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మంచి సేవలు అందించే ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో టెన్త్ క్లాస్ మిత్రబృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతకపేట లో ఫీనిక్స్ ఫౌండేషన్,శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలోఈ నెల 16,న

ఉచిత కంటి వైద్యశిబిరం.




హుస్నాబాద్ (వుదయం) మార్చి :13:ఫీనిక్స్ ఫౌండేషన్ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు శంకరా కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో హైదరాబాద్,నానక్ రాం గూడ వారు ఉచితకంటి వైద్యశిబిరం ఈ నెల 16వ తేదీ ఆదివారం రోజున సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం అంతకపేట్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9గం నుండి మధ్యాహ్నం 2గం వరకు నిర్వహిస్తారు.

ఉచితంగా కంటి పరీక్షలు చేసి లోపం ఉన్న వారిని గుర్తించి కంటి చూపు మెరుగు పడేలా ఆపరేషన్ ద్వారా ఐ.ఓ.ఎల్ అమర్చనున్నట్లు,ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా. కంటిశుక్లం ఉన్న వారికి ఉచితంగా సర్జరీ చేస్తామని,అదే రోజున హైదరాబాద్ వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని,కంటి పరీక్షలకు హాజరయ్యే పేషెంట్ ఆదార్ కార్డు జిరాక్స్,ఫోన్ మరియు ఏమైనా రోజు వాడే మందులు వారి వెంట తెచ్చుకోవాలని,తలంటు స్నానం చేసి రావాలని విషయాన్ని సంబంధిత బంధు మిత్రులందరికి తెలియచేయలని కామాద్రి శంకర్ తెలిపారు

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మెదక్, ( 2025 మార్చ్ 13 వుదయం ప్రతినిధి : విద్యార్థి దశలో ఉపాధ్యాయ వృత్తిని అనుభవించడం గొప్ప అవకాశమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి అనుభూతినీ పొందారు. ఇందులో భాగంగా పిట్ల మనస్విని ప్రధానోపాధ్యాయురాలుగా హరిత, యశస్విని, అక్షిత, తేజ, అలేఖ్య, అనుశ్రీ, లాస్య, భవ్య లు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, దశరథం, సౌమ్య, పాఠశాల చైర్మెన్ వడ్ల నర్మద లు ఉన్నారు.

## విద్యుత్ దీపాల సమస్య గురించి జనరల్ మేనేజర్ కు వినతి



భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 13 (వుదయం ప్రతినిధి)భద్రాద్రి కొత్తగూడెం జిల్లాసమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ ఆర్ టి ఐ కమిటీ అధ్యక్షులు బండ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రుద్రంపూర్ ప్రగతి మైదానం నుండి త్రీ ఇంక్లైన్ రెస్క్యూస్టేషన్ వరకు విద్యుత్ దీపాల సమస్య గురించి సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ హైవే విద్యుత్ దీపాలు సింగరేణి పరిధిలోకి రాకపోయినా ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకి ఇబ్బంది కలగకుండా మా వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురళీ మోహన్,జితేందర్ రెడ్డి, రేవంత్ చౌదరి, అంజాద్ పాషా లు పాల్గొన్నారు.

## అఖిలపక్షం ఆధ్వర్యంలో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్న రైతులు.

యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 13 వుదయం ప్రతినిధి: రాజపేట మండలం రేణిగుంట బేగంపేట గ్రామాల పరిధిలోని వాగు నుండి అక్రమ ఇసుక తరలింపు అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు రైతులు చెప్పారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొందరు ఆగాన లేకుండా అనాలోచితంగా అక్రమ ఇసుక తరలింపు లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారం ఉందని ప్రకటించడం సబబు కాదన్నారు.

అక్రమ ఇసుక తరలింపు విషయంలో బీర్ల ఐలయ్య కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పినట్లు వారు గుర్తు చేశారు. కేవలం రైతులు అఖిలపక్షం ఆధ్వర్యంలో అక్రమ ఇసుక రవాణా అడ్డుకుంటున్నట్లు మరోసారి గుర్తు చేశారు.

# సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 13(వుదయం ప్రతినిధి) సరస్వతి పుష్కరాల పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కాళేశ్వరం ఈ ఓ కార్యాలయంలో ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి పుష్కరాలు సందర్భంగా చేపడుతున్న పనులపై పంచాయతి రాజ్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్, వైద్య, దేవస్థానం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 25 వరకు పుష్కరాల అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో జాప్యం తగదని, వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్లు, రోడ్లు, శానిటేషన్, తాగునీటి సదుపాయాల పనులను గడువులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో సంబంధిత శాఖల సమన్వయం ఎంతో ముఖ్యమని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వివఐపీ ఘాటును సందర్శించి వివిఐపీ ఘాట్ నుంచి స్నాన ఘట్టాల వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం, సరస్వతి తల్లి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ వాచ్ టవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలాలు గుర్తించి నివేదిక అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, డిపిఓ నారాయణరావు, విద్యుత్ శాఖ డీఈ రామిరెడ్డి, దేవస్థానం ఈవో మహేష్, ఆర్కి టెక్చర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు చేసి ఉద్యమాన్ని ఆపలేరు



మార్చి 13 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్యక్రమం వాయిదా పడినప్పటికీ సిపిఐ నాయకులను రైతు సంఘం నాయకులను అరెస్టు చేసి నిర్బంధించటం చాలా ఘోరమని ఆయన అన్నారు అదేవిధంగా ఈ దేశంలో ఈ రాష్ట్రంలో రైతే రాజు రైతే వెన్నెముక అని చెప్తున్న ఈ ప్రభుత్వాలు రైతులు పడుతున్నటువంటి ఇబ్బందులు రైతులు పండిస్తున్నటువంటి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి మాత్రం ఈ ప్రభుత్వాలు ముందుకు రావు, రైతుల గురించి రైతాంగ సమస్యల గురించి రైతు సంఘం నాయకులు ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు లాఠీచార్జి చేస్తారు ఇప్పటికైనా ఈ ప్రభుత్వాలు కళ్ళు తెరిచి రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే ( ఎస్ కే యం ) సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు పరిష్కరించే వరకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బత్తుల సాయి, ఎస్.కె జాన్ బి, రైతు సంఘం నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# హోలీ సంబరాలు నిర్వహించాలి :కల్లు గీత కార్మికులు



నకిరేకల్ మార్చి 13(వుదయం ప్రతినిధి ):బుధవారం జరిగిన సమావేశంలో 14వ తారీఖున హోలీ సందర్భంగా నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని కల్లుగీత కార్మికులు మరియు మన మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత-శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మన కంఠమహేశ్వర స్వామి దేవాలయం నుండి ర్యాలీ గా బయలుదేరి ఇందిరాగాంధీ విగ్రహం వరకు హోలీ సంబరాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండ వెంకన్న గౌడ్, చౌగోని నాగయ్య గౌడ్, చౌగోని వెంకన్న గౌడ్, భూపతి శ్రీనివాస్ గౌడ్, భూపతి సత్యనారాయణ గౌడ్, చౌగోని కర్ణాకర్ గౌడ్, చౌగోని సంతోష్ గౌడ్, చౌగోని గిరి గౌడ్, సమ్మెటి రమేష్ గౌడ్, సమ్మెటి అఖిల్ గౌడ్, గోపగోని నాగరాజు గౌడ్, గోపగోని కృష్ణ గౌడ్, తండు వెంకన్న గౌడ్, తండు సైదులు గౌడ్, ఉయ్యాల సైదులు గౌడ్, మల్లెబోయిన పాపులు, మెరుగు నాగరాజు, గురిజ శివ గౌడ్, చిట్లి వీరాస్వామి గౌడ్, చౌగోని శివ గౌడ్, తదితరులు పాల్గొనడం జరిగింది. దయచేసి ప్రతి గీత కార్మికులు సోదరులు అందరూ కలిసి ఈ హోలీ సంబరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఓసి నీరే సాగునీరు... ఆపేస్తే ఎలా

- నీటిని విడుదల చేయాలని వేడుకుంటున్న రైతులు
- నీటిని నిలిపేస్తే ఎండేను పంట అంతా...



భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 13 (వుదయం ప్రతినిధి)చుంచుపల్లి మండలంలోని పెనగడప, రాంపురం రైతుల పంటలకు సాగునీరులేక. ఆర్థిక పరిస్థితి బాగున్న రైతులు బోర్ల ద్వారా వ్యవసాయం చేస్తుండగా.. బోర్లు వేసుకొని స్తోమత లేక సమీపంలోని ఎర్రచెరువు, పెద్ద చెరువు, క్రిష్ణారాయుడు చెరువులపైనే ఆధారపడి పంటలు వేసుకుంటున్నారు ఈ ఏడాది అనుకున్నంత వర్షాలు లేకపోవడంతో చెరువులన్నీ నీళ్లు లేక ఎండిపోయాయి. సింగరేణి ఏరియా పరిధి లోని జీకే (గౌతమ్ ఖని) ఓసీ నీటిని నుంచి బయటికిపంపిస్తున్న నీటినే సాగునీరుగా వాడుకొని వరి రెండు పంటలు పండిం చుకుంటున్నారు. అయితే ఓపెన్ కాస్ట్ నీటిలో పీహెచ్(పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) లెవల్స్ ఓసీలో నీటిని విడుదలతక్కువగా 3 శాతమే ఉండడంతో పంటలకు అందడం ఇబ్బందిగా మారుతున్నది. జీకే ఓసిమూసివేయడంతో అందులోని నీటిని పంపుల ద్వారా అధికారులు బయటికి పంపిస్తుంటారు. ఆ నీటిని సమీపంలోని ఎర్ర చెరువు, పెద్దచెరువు, క్రిష్ణారాయుడు చెరువుల్లోకి వెళ్తాయి . అ నీరు నిల్వ ఉండడంతో ఐరన్ పైరటీస్ చేరి చిలుము నీరుగా మారడమే కాకుండా ఆ నీటిలో పీహెచ్ లెవల్స్ సైతం తక్కువగా ఉన్నప్పటికీ రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేక పోవడంతో ఈ నీటిని వాడడంతో పంట దిగుబడి తగ్గుతుంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓసీ నుంచి వచ్చే నీరు సాగునీరుకు ఉపయోగపడే విధంగా ఉండాలని గతంలో కలెక్టర్, ఎన్విరాల్మెంట్ధికారులకు కొంతమంది రైతులు ఫిర్యాదులు చేశారు. కొన్ని వందల ఎకరాలకు నీరుఅందిస్తున్న సింగరేణి యాజమాన్యం పీహెచ్‌లెవల్ను పెంచే పరికరాలు, తీసుకువచ్చే రైతులకు నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పిఎస్ లెవల్ పెరగకపోవడంతో సింగరేణి అధికారులు ఆ నీటిని మరలించకుండా ఆపడంతో ఓసి నుండి వచ్చే నీటి నమ్ముకొని పంట వేసుకున్నామని పంట చేతికి వచ్చే సమయంలో సింగరేణి అధికారులు నీటిని నిలిపివేయడం తో వరి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు సింగరేణి జనరల్ మేనేజర్ ,అధికారులు స్పందించి పొలాలకు నీళ్లు మరలించే విధంగా కృషి చేయాలని పెనగడప రాంపురం అంబేద్కర్ నగర్ లో కోరుతున్న రైతులు, మన్నె వెంకన్న ,సుధాకర్, భాస్కర్, కుంచం శ్రీను, రాజు, మాన్నె రవి ,ఎల్లయ్య లక్ష్మణరావు ,వెంకటేశ్వర్లు, చింత రమేష్ ,నాగేశ్వరరావు, నరసింహారావు, శ్రీను, నగేష్, నీటిని విడుదల చేయాలని కోరుతున్న రైతులు.

# హోలీ పండుగను ఆనందంగా జరుపుకోవాలి.

## రోడ్లపై గుమి గుడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన, పరిచయంలేని వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లిన, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవు.

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్.,**



రాజన్న సిరిసిల్ల జిల్లా 13మార్చ్ 2025(వుదయం ప్రతి నిది) హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో సురక్షితంగా జరుపుకోవాలని రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం,పరిచయం లేని వ్యక్తులపై రంగులు జల్లడం,బలవంతంగా రంగులు చల్లిన, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూహోలీ వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని. యువకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేసిన , చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. హోలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అదిక నీటి ప్రవాహం,లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని సూచించారు. పండుగ వేళ ఇతరులపై బలవంతంగా రంగులు వేసిన,గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా,ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని,తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పి విజ్ఞప్తి చేసినారు.

# మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



జన్నారం,మార్చ్ 13(వుదయం విలేఖరి) జన్నారం మండలంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు నిండు అసెంబ్లీ సాక్షిగా మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పైన చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలకు గానూ క్షమాపణలు కోరి, వారి వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలి లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జగదీశ్వర్ రెడ్డిని ఎమ్మెల్యేగా బర్త్ రఫ్ చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



ముధోల్, మార్చ్13 (వుదయం ప్రతినిధి) ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సంజీవ్ కుమార్ అన్నారు. ముధోల్ మండలంలోని తానుర్ వెళ్లే దారిలో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. వాహనదారులు చెల్లుబాటైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి, వాహనంపైన చలాన్ లు లేకుండా చూసుకోవాలి అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఇందులో ట్రైనీ ఎస్సై శ్రావణి, కానిస్టేబుల్ లు ఉన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఘనంగా హోలీ వేడుకలు



బెల్లంపల్లి, మార్చి13 (వుదయం ప్రతినిధి) తాండూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హోలీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు తమ స్నేహితులు, ఉపాధ్యాయులకు రంగులను చల్లుతూ ఒకరికి ఒకరు హోలి శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ స్వచ్ఛమైన మనస్సుతో ఆనంద తన్మయత్వం చెందారు. చిరునవ్వులను చిందిస్తూ రంగేళిని ఎంతో ఉత్సాహంగా కేరింతల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఓ కవిత మాట్లాడుతూ హోలీ పండుగను కాముని దహనం అని కూడా అంటారని, హోలి పండుగ దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగలలో ఇది ఒకటి అన్నారు. ఈ పండుగ సత్యయుగం నాటి నుంచి జరుపుకుంటున్నారంటూ, హిందు పురాణాల ప్రకారం హోలీ అనగా అగ్నితో పునీతమైనదంటూ మనలోని చెడు కోరికలను దహింప చేసుకొని, సమాజ హితాన్ని కోరుతూ మతసామరస్యాన్ని పెంపొందింప జేసుకోవాలంటూ, అందరికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గం ప్రజలకు హోళీ శుభాకాంక్షలు ప్రియదర్శిని మేడి



నకిరేకల్ మార్చి 13(వుదయం ప్రతినిధి ):హోలీ పండుగను పురస్కరించుకుని రిషారియా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని మేడి నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు హోలీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోలీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాలతో హోలీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హోలీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.

## హోలీ, రంజాన్ ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపు

నారాయణఖేడ్, మార్చి13(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎస్ఐ కార్యాలయంలో గురువారం ఖేడ్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శ్రీశైలం ఆధ్వర్యంలో పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. పీస్ కమిటీ సమావేశంలోఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అనంతరం డిఎస్పీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో హోలీ, పవిత్ర రంజాన్ పండుగలు జరుపుకోవాలన్నారు. సంబంధంలేని వారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

# హోలీ సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు




నర్సంపేట వుదయం ప్రతినిధి మార్చి 13 నర్సంపేట పట్టణంలోని అక్షర ధ ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ నందు గురువారం రోజునా హోలీ సంబరాలు స్కూల్ ప్రిన్సిపాల్ సమక్షంలో విద్యార్థిని విద్యార్థులు రంగులు చల్లుతూ హోలీ వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు బాలాజీ విద్య సంస్థల చైర్మన్ డాక్టర్ వనజ రాజేంద్రప్రసాద్ పాల్గొని విద్యార్థులతో సరదాగా హోలీ సంబరాలను కొనసాగించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన రంగులతో ఆరోగ్యమైన పద్ధతిలో ఆనందంగా హోలీ పండుగలు జరుపుకోవాలని అన్నారు. తదుపరి స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియపరుస్తూ హోలీ వేడుకలను మనకు హాని కలిగించే చైనా కలర్, సిల్వర్ కలర్ పదార్థాలతో హోలీ ఆటని ఆడవద్దని అలాంటి హాని కలిగించే పదార్థాలతో చర్మవ్యాధులు, కంటి చూపు పోయే అవకాశం ఉందని తెలియజేస్తూ పకృతి సిద్ధమైన వనరుల పదార్థాలతో తయారైనటువంటి సహజ రంగులను వాడుతూ హోలీ సంబరాలు జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ తో పాటు ట్రెజరర్ వనజ, సెక్రటరీ రాజేశ్వర్ రెడ్డి, సీఏవో సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు



మెదక్, ( 2025 మార్చ్ 13 వుదయం ప్రతినిధి : గురువారం, హైదరాబాద్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్(దృశ్య మాధ్యమం) ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కలెక్టర్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, మెదక్ ఆర్డిఓ రమాదేవి, ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకోసారి పకడ్బందీగా నవీకరించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాల నిర్వహణను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని, అందుకు గాను ప్రత్యేక రిజిస్టర్ లలో నమోదు చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలకు సంబంధించిన వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్ ల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలను నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ల వివరాల తొలగింపు, ఫార్మ్ 6, 7, 8 లలో వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎన్నికల సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో నిరుపేద మృతి

ఆర్థిక సహాయం చేసిన చత్రపతి శివాజీ యూత్ సభ్యులు



కొండపాక మార్చి13(వుదయం ప్రతినిధి): మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రాసుల యాదంరావు వయస్సు 49 సంవత్సరాలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు, తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కూలీ పనులకు కూడా వెళ్లేవాడు, పంటలు సరిగా పండగ, కూలీ డబ్బులు సరిపోక ఆర్థిక ఇబ్బందుల పాలవుతూ కూడా మూడేళ్ల క్రితం కూతురు పెళ్లికి చేసిన అప్పులు తోడయ్యాయి. దాంతో అప్పుల బాధలు పెరగడమే కాక అనారోగ్య సమస్యలవల్ల బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ చత్రపతి శివాజీ యూత్ సభ్యులు 20వేల రూపాయలు, అదే గ్రామానికి చెందిన రాసుల అనిల్ కుమార్ 20వేలు రూపాయలు కలిపి మృతుని అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ అధ్యక్షులు రంజిత్ కుమార్, ఎర్వాడి శ్రీనివాస్, మధు సుదన్ , రాసుల నరేందర్ , రాసుల శ్రీనివాస్, కుసుంబా శ్రీనివాస్, రాసుల కిషన్ రావు, నవీన్ తో కులస్తులు పాల్గొన్నారు

# డాక్టర్ సుధాకర్ రావు ఆశయాలను కొనసాగించాలి



పెద్దవంగర, మార్చి 13 (వుదయం ప్రతినిధి):మాజీ ఎమ్మెల్యే, పేదల వైద్యుడిగా పేరుగాంచిన స్వర్గీయ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్ రావు ఆశయాలను కొనసాగించాలి, ఆయన మన మధ్యలో లేకపోవడం బాధాకరమని కొడకండ్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ముత్తినేని రమ శ్రీనివాస్, చిట్యాల మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం వడ్డెకొత్తపల్లి గ్రామంలో సుధాకర్ రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గా, డాక్టర్ సాబ్ గా సుధాకర్ రావు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన లేరని విషయం జీర్ణించుకోలేక పోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. సుధాకర్ రావు ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు కో-ఆర్డినేటర్ తంగళ్ళపెల్లి మల్లికార్జున చారి, కేశబోయిన కుమార స్వామి, బొల్లు ఉషయ్య, మొర్రిగాడుదుల శ్రీనివాస్, ఎర్రగొల్ల రమేష్, దంతాలపల్లి శ్రీనివాస్, కేశబోయిన రామరాజు, దంతాలపల్లి జనార్ధన్, దండుగల ఎల్లయ్య, కేశబోయిన యాకన్న, కేశబోయిన సుభాష్, చట్టు యాకన్న, పాక అనిల్, దూదేకుల సైదులు, పల్లె కొరమల్లు, పల్లె మల్లేష్, బొల్లు వెంకన్న, బొల్లు గణేష్, బొల్లు సతీష్, బొల్లు కుమార్, శ్రీరాం నవీన్, మల్లేష్, దండుగల శ్రీకాంత్, పల్లె యాకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అంతర్గత నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి

## సైకాలజిస్ట్ బొల్లంపల్లి సత్య ప్రకాష్



లక్షెట్టిపేట, మార్చి 13 (వుదయం ప్రతినిధి): విద్యార్థులందరూ తమ అంతర్గత నైపుణ్యాలను మెరుగుపరచుకొని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని..” ప్రముఖ సైకాలజిస్ట్, గ్రాఫాలజిస్టు, మోటివేషనల్ స్పీకర్, సాఫ్ట్ స్కిల్స్ అనలిస్ట్ బొల్లంపల్లి సత్య ప్రకాష్ అన్నారు. గురువారం పిఎం శ్రీ స్కీములో భాగంగా స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో, విద్యార్థులకు ఏర్పాటు చేసిన మనో విశ్లేషణాత్మక ప్రేరణ - శిక్షణ లో ముఖ్యఅతిథిగా బొల్లంపల్లి సత్య ప్రకాష్ మెంటార్, టీచర్ గా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లంపల్లి సత్య ప్రకాష్ మాట్లాడుతూ....ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన సైకాలజీ మోటివేషన్ క్లాసులో,పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించడం జరిగిందని అన్నారు. గ్రాఫాలజీ గురించి సాఫ్ట్ స్కిల్స్ గురించి.. విద్యార్థులకు అవగాహన కలిగించడం జరిగిందని తెలిపారు.అనంతరం విద్యార్థులందరూ ఉత్సాహంగా సైకాలజిస్టును పలు ప్రశ్నలు వేస్తూ, జవాబులు రాబడుతూ.. ఎన్నెన్నో కొత్త విషయాలు నేర్చుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కె. రమా కళ్యాణి మాట్లాడుతూ... మనో విజ్ఞాన శాస్త్ర పర్యవేక్షకుల శిక్షణలో నిర్వహించిన ప్రేరణాత్మక సదస్సుల ద్వారా విద్యార్థులు ఎన్నెన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె మహేశ్వర రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కె శ్రీ లత, ఉపాధ్యాయులు ఉమాదేవి, సరస్వతి, పుప్పాల రజిత తదితరులు పాల్గొన్నారు.

# హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి



బెల్లంపల్లి, మార్చి13 (వుదయం ప్రతినిధి) తాండూరు మండల ప్రజలందరూ హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయాల నడుమ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలని ఎస్ఐ కిరణ్ కుమార్ సూచించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలను నడపడం చేయడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. ప్రజలు సహజ సిద్ధమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్లు చల్లకూడదు, బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదు,యువత హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని సూచించారు. ముఖ్యంగా యువత తల్లిదండ్రులు పిల్లల కార్యక్రమాలను గమనిస్తూ వారికి సరైన పద్ధతినీ తెలియజేయాలని సూచించారు. వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, రేష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, లాంటి కార్యక్రమాలను యువత మానుకోవాలని సూచించారు.

# జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మెదక్, ( 2025 మార్చ్ 13 వుదయం ప్రతినిధి : అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా సందర్భముగా గురువారం జిల్లా పోలీసు కార్యలయంలో ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఐపిఎస్ జిల్లాలో ఉన్న మహిళ పోలీస్ అధికారులు, సిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు మన ఇంట్లోనుండే మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా చూడాలని అన్నారు. తల్లిదండ్రులు మగ పిల్లలకు ఇచ్చే స్వేచ్ఛను ఆడపిల్లలు ఇనస్తా మంచి విద్యను అందించాలన్నారు. సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమన్నారు. మాహిళలు ఈ రోజులలో తాము ఎందులోనూ తక్కువ కాదన్నా విషయాన్ని నిరుపించుకుంటున్నాం ని తెలిపారు. మహిళలు వంటింటికీ పరిమితము అనేది అనాటి పద్ధతి, కానీ మహిళల్లో అపారమైన శక్తి సంపద ఉంది, అశక్తిని సమాజం ముందు అవిష్కరించాల్సిన భాధ్యత మహిళల పైనే ఉంటుందన్నారు. మహిళా సాధికారతకు చదువు చాలా ముఖ్యం, పురుషులతో పాటు మహిళలను సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. మహిళా ఉద్యోగులు ఉద్యోగ బాధ్యతలతో పాటు సంసార బాధ్యతలు కూడా ఈ రెండింటినీ సమానంగా పెనవేసుకుని ముందుకు వెళుతున్న మహిళలు అభినందనీయమని కొనియాడారు. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి మహిళ వారి కుటుంబానికి వెన్నుముక వంటి వారని అన్నారు. మాహిళలు సామజిక, అర్థిక, రాజకీయ, క్రీడారంగాల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. మాహిళలు నిర్భయంగా వుండాలన్నారు. సమాన అవకాశాలు, స్వేచ్ఛ అందించగలిగినప్పుడే మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తారు. మహిళ ఆత్మగౌరవం కోసం మరియు అభ్యున్నతి కోసం ప్రతీ ఒక్కరు పని చేయడమే నిజమైన నాగరికతగా భావించాలన్నారు. మహిళలు అన్ని రంగాలలో పురోగమించడమే అసలైన అభివృద్ధి అన్నారు. మగ పిల్లలకు మహిళలను గౌరవించే విధంగా విలువలు క్రమశిక్షణ నేర్పవలసిన బాధ్యత తల్లిదండ్రులపై గురువులపై ఉందన్నారు. మహిళలు ఆపద సమయాల్లో అధైర్యపడకుండా, వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని, ఆడపిల్లలు మహిళలు ఎల్లపుడూ అప్రమత్తంగా వుండాలని అన్నారు. ఎల్లవేళలా పోలీసువారు అందుబాటులో వుంటారని ఇట్టి విషయంలో ఆడపిల్లలు మహిళలు భయపడనవసరం లేదని అన్నారు. మెదక్ జిల్లా పోలీస్ యంత్రాగం మహిళల భద్రత గురించి ప్రత్యేకమైన చర్యలు చేబడుతున్నట్లు జిల్లా ఎస్.పి. తెలిపారు. చివరగా వీధి నిర్వహణ లో ఉత్తమ కనబర్చిన మహిళలకు ప్రశంస పత్రాలు జిల్లా ఎస్పీ అందజేశారు.

# నిరక్షరాస్య వయోజనుల పాఠ్యపుస్తకాన్ని విడుదల చేసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.



బెల్లంపల్లి, మార్చి13 (వుదయం ప్రతినిధి) మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని 22 గ్రామపంచాయతీలో 100 రోజుల్లో 100% అక్షరాస్యత సాధించడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వయోజన విద్యాశాఖ విద్య శాఖ రూపొందించిన కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరక్షరాస్యలకు ఉపయోగపడే వయోజనుల పాఠ్య పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ అధికారి ఏ పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని కాసిపేట మండలంలో 3500 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని ఇదివరకే వారికి పలకలు, నోట్ పుస్తకాలు అందజేయడం జరిగిందని అన్నారు.అలాగే వయోజనులకు ఉపయోగపడే విధంగా పుస్తకాన్ని విడుదల చేయడం జరిగిందని తెలిపారు. వాచకము మరియు నోటు పుస్తకాల ద్వారా నిరక్షరాసులందరూ 100 రోజుల్లో అక్షరాసులుగా తయారు కావాలని మండలాన్ని 100% అక్షరాస్యత మండలం గా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్షరాస్యత కార్యక్రమానికి చేయూతనిస్తున్న ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజర్ కులకర్ణి,డిఆర్పీలు సుమన్, కొండ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పెద్దవంగర, మార్చి 13 (వుదయం ప్రతినిధి):మండలంలోని పోచారం ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి, తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ఆకట్టుకున్నారు. ఎంఈవో గా రక్షిత్, ప్రధానోపాధ్యాయురాలుగా వైష్ణవి, ఉపాధ్యాయులుగా రిషిత, సిరివెన్నల, మాధురి, మహేష్, వైష్ణవి లు వ్యవహరించి అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితయడానికి ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏఏపీసీ చైర్మన్ బానోత్ సునీత, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ తో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోట మురళి, అంగన్వాడీ టీచర్ ఝాన్సీ, విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## విద్యార్థినిలకు పరీక్షల సామాగ్రి పంపిణీ

దేవరకొండ, మార్చి13(వుదయం ప్రతినిధి): జ్ఞానాన్ని ఎవరు దొంగలించలేరని చదివే కొద్ది పెరిగేది జ్ఞానమని, జ్ఞానం పెంపొందించుకుంటూ ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. డిండి కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినిలకు లయన్ దాచేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా గురువారం పరీక్ష సామాగ్రిని అందించారు.

## సీఐ మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌చార్జ్

మిర్యాలగూడ, మార్చి13(వుదయం ప్రతినిధి): మిర్యాలగూడ పట్టణం టూ టౌన్ సీఐ పి. నాగార్జున సార్ బదిలీపై వెళుతున్న శుభ సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు స్టేషన్లో మర్యాదపూర్వక కలిసి చేసిన సేవలను కొనియాడారు ప్రకాష్ నగర్ 8వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆంగోతు చక్రీ నాయక్. అనంతరం శాలువాతో సత్కరించి చిరు బహుమానాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ టూ టౌన్ ఎస్ఐ రాంబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ప్రయోజనాల కోసం యు.డి.ఐ.డి కార్డు. కార్డులపై దివ్యాంగులకు అవగాహన కల్పించాలి కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, మార్చి13(వుదయం ప్రతినిధి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే వివిధ రకాల ప్రయోజనాలు పొందేందుకు యు.డి.ఐ.డి కార్డు ఉపకరిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో యుడిఐడి కార్డులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకే సదరం సర్టిఫికెట్ ఉన్నవాళ్లు తిరిగి యు డి ఐ డి లో దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని అన్నారు. వారికి ఆన్లైన్ నందు యు డి ఐ డి కార్డు జనరేట్ చేయబడి పోస్టులో నేరుగా వస్తుందని తెలిపారు. కొత్తగా సదరం కోసం నమోదు చేసుకోవాలనుకునే వారు మాత్రమే యూ డి ఐ డి పోర్టల్ నందు ఆన్లైన్ దరఖాస్తు చేయాలని తెలిపారు. www.swavlambancrad.gov.in పోర్టల్ నందు దరఖాస్తు చేయాలని తెలిపారు. మొత్తం 21 రకాల అంగవైకల్యం ఉన్నవారికి కార్డు జారీ అవుతుందని అన్నారు. ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తును అధికారులు పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్డు పోస్టులో దరఖాస్తుదారు ఇంటికి నేరుగా వస్తుందని అన్నారు. కార్డు కోసం వ్యక్తిగతంగా ఎవరైనా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్లైన్ పై అవగాహన లేని వాళ్ళు మీ సేవ సెంటర్ లోనూ దరఖాస్తు సమర్పించవచ్చని సూచించారు. యూ డి ఐ డి కార్డు మంజూరు కోసం ఎవరికీ సొమ్ము చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. కార్డు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే హెల్ప్ లైన్ నెంబర్ 9490881098 కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. యూ డి ఐ డి కార్డుల పట్ల దివ్యాంగ సంఘాల నాయకులు ప్రతి దివ్యాంగుడికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డి ఆర్ డి ఓ శ్రీధర్, డీఈవో జనార్దన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, మీసేవ సెంటర్ల నిర్వాహకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# విద్యాధరి పాఠశాలలో ఘనంగా హోలీ సెలబ్రేషన్స్..





వరంగల్ పశ్చిమ, మార్చి-13 (వుదయం ప్రతినిధి): హనుమకొండ జిల్లా గోపాల్పూర్ విద్యాధరి పాఠశాలలో హోలీ సెలబ్రేషన్స్ వై.వి రావు అపర్ణలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడుతూ.. పాఠశాల పక్షాన అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల ను బోధించడంలో విద్యాలయాలు ముందంజలో ఉంటాయని ఆమె అన్నారు. పాఠశాల లో ప్రతి పండుగను ఘనంగా నిర్వహించి పండుగల యొక్క ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించడం జరుగుతుందని ఆమె అన్నారు ..ఈ సందర్భంగా కరస్పాండెంట్ వై.వి రావు మాట్లాడుతూ..హోలీ పండుగను ఫిబ్రవరి లేదా మార్చి చివరి వారాల్లో పౌర్ణమి రోజున జరుపుకుంటారని ఆయన అన్నారు. ఈ హోలీ పండుగ రోజున ప్రజలు పలు రకాల రంగుల పొడిని, రంగు నీళ్లను ఒకరిపై ఒకరు జల్లుకుంటూ ఘనంగా జరుపుకుంటారని అన్నారు... హోలీ పండుగ కు ముందు రోజున హిరణ్యకశ్యపుని చెల్లెలైన హోలిక అనే రాక్షసి బొమ్మకు నిప్పంటిస్తారు అని ఆయన అన్నారు. హిరణ్యకశిపుని చెల్లెలైన హోలిక అనే రాక్షసి ప్రహ్లాదుడిని మంటలలో వేసినప్పుడు దైవలీలతో తప్పించుకుంటాడు అందుకే భోగి మంటలు అంటిస్తారు అనిఈసందర్భంగా ఆయన అన్నారు. హోలిక ఈ మంటలలో దహనమయ్యింది కానీ విష్ణువుకు పరమ భక్తుడైన ప్రహ్లాదుడు, అతని అపార భక్తితో ఎటువంటి గాయాలు లేకుండా తప్పించుకుంటాడు. ఈ పండుగ ను తెలుగు రాష్ట్రాల్లో హోలిక దహన్‌ను కామ దహనం అని అంటారని ఆయన అన్నాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారని ఆయన అన్నారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని.

**బిజెపి ఎంపీ డీకే అరుణ పార్లమెంట్లో మాట్లాడిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాము.**
**తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్.**



మార్చి 13 భూపాలపల్లి (వుదయం ప్రతినిధి) : వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బిజెపి ఎంపీ డీకే అరుణ మాట్లాడిన మాటలను తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ తీవ్రంగా ఖండించారు. పార్లమెంటు సమావేశంలో బిజెపి ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ వాల్మీకి బోయలు విద్య ఉద్యోగ పరంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారిని షెడ్యూలు తెగల జాబితాలో చేర్చాలని మాట్లాడడం జరిగిందని అన్నారు, వారి మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన తరగతులను చేర్చాలని మాట్లాడే బిజెపి ఎంపీ డీకే అరుణ, ఫిబ్రవరి నెలలో పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్లో గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కేటాయింపులు చేయనప్పుడు ఎస్టీలకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు మాట్లాడలేదని అన్నారు, బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా మోసం చేస్తావుంటే పెదవి ఎందుకు విప్పడం లేదన్నారు, ప్రభుత్వ రంగ సంస్థలను మొత్తం ప్రైవేటుకరిస్తూ ఉంటే రిజర్వేషన్లు ఎలా అమలు జరుగుతాయి అని ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటం లేదని, బిజెపికి వెనుకబడిన తరగతుల అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఇది బిజెపి ద్వంద వైఖరుకు నిదర్శనమని ప్రశ్నించారు, ఏ తరగతులలో ఉన్న అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే వారికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయవచ్చని అంతేకానీ మరొక జాబితాలో కలపడం అంటే గొడవలకు ఆద్యం పోయడమే అని అది బిజెపికి వెన్నతో పెట్టిన విద్య అని ఆయన మండిపడ్డారు, ఎస్టీ జాబితాలో చేర్చుతే అభివృద్ధి చెందుతామనే పోబియాలో ఉండకూడదని వెనుకబడిన తరగతులకు ఆయన విజ్ఞప్తి చేశారు, కేవలం ఓట్ల కోసం ఆడే రాజకీయ క్రీడలో ఎవరు పావులు కావద్దని అన్నారు, ఎస్టీ జాబితాలో చేర్చడం వలన అభివృద్ధి చెందుతారనే అనుకుంటే ఎస్టీ జాబితాలో ఇదివరకు ఉన్న ఎస్టీలు 78 సంవత్సరాల స్వతంత్ర భారతంలో దుర్భరమైన జీవితాలు ఎందుకు గడుపుతున్నారో విజ్ఞతతో ఆలోచించాలని అన్నారు. ఎస్టీ జాబితాలో ఇతర తెగలను ప్రభుత్వాలు పాలకులు కలపాలనే ఆలోచనను విరమించుకోవాలని లేకపోతే తీవ్రమైన ఆందోళన పోరాటాలు నిరసన సెగలు ముందు కస్తాయని ఆయన హెచ్చరించారు.

## సైబర్ స్కాంలపై విద్యార్థులకు అవగాహన



జయశంకర్ భూపాలపల్లి మార్చి 13(వుదయం ప్రతినిధి): మహదేవపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పోలీస్ శాఖ వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, సైబర్ స్కాముల నుండి తప్పించుకోవాల్సిన అవసరం ప్రస్తుత సమాజానికి చాలా ముఖ్యమైన విజ్ఞానమని ట్రైనీ ఎస్ ఐ టీ.శశాంక్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మాట్లాడుతూ.విద్యార్థులు సామాజిక మాధ్యమాల వాడకం తగ్గించుకొని చదువుపట్ల శ్రద్ధ వహించి ఉన్నతంగా ఎదిగి సమాజానికి దేశానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ మధ్య టీనేజ్ యువత మత్తు పదార్థాల వాడకం క్రేజీ గా ఫీలవుతున్నారు అని గంజాయి, గుట్కా, పాన్ పరాగ్ మరియు మద్యం తాగడం లాంటి దుర్వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాన్ని బుగ్గి పాలు చేసుకుంటున్నారని తెలిపారు విద్యార్థులు అలాంటి వాటికి దూరంగా ఉంటూ భవిష్యత్తును బంగారంగా మార్చుకోవచ్చునని తెలియజేసారు.నమాజంలో ఎక్కడ ఇలాంటి తప్పుడుపోకడలు కనిపించినా 100 కాల్ చేసి చెప్పాలని, సైబర్ ఫ్రాడ్స్ వస్తే 1930 కి కాల్ చేసి ఆర్థిక నష్టం జరగకుండా నివారించుకోవచ్చునని అవగాహన కల్పించి, విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రమేష్, అనిల్, లచ్చయ్య, సమ్మయ్య, కవిత తోపాటు పోలీస్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయపోలు సుబ్బారావు జయంతి వేడుక!



హనుమకొండ, మార్చి 13(వుదయం జిల్లా ప్రతినిధి) : కవి విమర్శకుడు, జాతీయవాది ఆర్ట్స్ కళాశాల మొట్టమొదటి ప్రిన్సిపల్ ఆచార్య రాయపోలు సుబ్బారావు జయంతి వేడుకను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని రాయపోలు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ రాయపోలు సుబ్బారావు 1948లో ఆర్ట్స్ కళాశాల మొట్టమొదటి ప్రిన్సిపల్ , గొప్ప కవి విమర్శకుడు జాతీయవాది అని అతని ఆదర్శాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలన్నారు. సమాజంలో నెలకొన్న అధర్మాలను ముఖ్యంగా అనురాగం ఆప్యాయత పై తన రచనలు చేశారన్నారు. గొప్ప కవి నే కాకుండా మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి రాయపోలు సుబ్బారావు అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ సదాశివ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజు మాట్లాడుతూ భార్యాభర్తల ప్రేమనే కాకుండా తల్లి బిడ్డ ప్రేమను గొప్పగా చూపిస్తూ రచనలు చేసిన గొప్ప వ్యక్తి రాయపోలు సుబ్బారావు అని వారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ హరికుమార్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలకు ఒక్కపూట సెలవులు కావాలి.

**మే నెలలో హాలిడేస్ ఇవ్వాలి.**
**బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి.**



నర్సంపేట మార్చి 13 (వుదయం ప్రతినిధి) : అంగన్వాడీ కేంద్రాలకు ఒక పూట సెలవు తో పాటు మే నెలలో సెలవులు ఇచ్చి టి హెచ్ ఆర్ కు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ %& హెల్పర్స్ యూనియన్ (బి ఆర్ టి యు ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి నేతృత్వంలో ప్రతినిధి బృందం మహిళాభివృద్ధి స్త్రీ శిషు సంక్షేమ శాఖా ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రాంచంద్రన్, కమీషనర్ కాంతి వెస్లీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా నల్లా భారతి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా నడుస్తున్నాయి అని, ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు ఒక పూట బడి నిర్వహించాలని, ప్రతి సంవత్సరం మే నెలలో అంగన్వాడీ టీచర్ కు 15 రోజులు ఆయాకు 15 రోజులు సెలవులు ఇస్తారని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా మే నెల మొత్తం సెలవులు ఇచ్చి టి హెచ్ ఆర్ కు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 65 సంవత్సరాలు పైబడిన అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ 2024 జులై నెల నుండి విధులకు హాజరు కాకుండా ఉన్నారని, జూలై నెలలో మంత్రి ఇచ్చిన మాట ప్రకారం టీచర్కు రెండు లక్షలు ఆయాకు లక్ష రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉద్యోగం చేయలేని పరిస్థితిలో ఉన్న వారికి కూడా రిటైర్మెంట్ కి అవకాశం ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు వేతన పెంపుకు సంబంధించి బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో పోషణ్ ట్రాకర్, ఎస్ హెచ్ టి ఎస్ రెండు యాప్ ల ద్వారా ఒకే రకమైన సేవలను ఆన్లైన్ చేయాల్సి వస్తుందని, ఒకే ఆపు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని, ఈవెంట్స్ డబ్బులు, పెండింగ్ ఇంటి అద్దెలు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాలు మహిళా అభివృద్ధి స్త్రీ సంక్షేమ శాఖ మాత్యులు సీతక్క పేషీలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తో పాటు ప్రధాన కార్యదర్శి రమాతార, కోశాధికారి వేదవతి, రాష్ట్ర నాయకులు ఎల్లమ్మ, రేణుక, రజిత పాల్గొన్నారు.

## శ్రీ అక్షరలో ఘనంగా ముందస్తు హెూలీ సంబురాలు....







ముధోల్, మార్చ్13 (వుదయం ప్రతినిధి) మండల కేంద్రమైన మూడో లోని శ్రీ అక్షర పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఘనంగా ముందస్తు హెూలీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శ్రీకృష్ణుడు, రాధా మాత విగ్రహాలను పూజించి రంగులతో కలిపిన కుండలను అలంకరించి సంప్రదాయ సిద్ధమైన రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ హెూలీ వేడుకల పండుగను కొనసాగించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఒకరికి ఒకరు ఇంద్రధనస్సులో కలిగిన రంగు లాంటి రంగులను పూసుకుని పండుగ వాతావరణం తలపించేలా వేదికను ఏర్పాటు చేశారు. వేదికపై కేరింతలు కొడుతూ ఉత్సాహంగా ముందస్తు వేడుకలను కొనసాగిస్తూ ఉపాధ్యాయ బృందానికి హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల కేరింతలతో పాఠశాల వాతావరణమంతా పండుగ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుభాష్, ప్రిన్సిపల్ సాయికుమార్, అకాడమీకి ఇంచార్జ్ స్వప్న శర్మ, ఇన్చార్జి సిందే మాధవ్, ఉపాధ్యాయులు సంతోష్ మహేందర్, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లాస్మేట్ కుటుంబానికి 50 వేల ఆర్థిక సహాయం.





ఖానాపురం మార్చి 13 (వుదయం ప్రతినిధి): మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన పదవ తరగతి 1998 1999 క్లాస్ మెంట్ మానేపల్లి విజయ్ కుమార్ ఇటీవలే గుండెపోటుతో మృతిచెందగా మృతిని చిత్రపటానికి పూలమాలవేసి మృతుని కుటుంబాన్ని తోటి మిత్రులందరూ పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి మృతుని కుటుంబానికి 50 వేల రూపాయలను అందజేశారు. అలాగే మృతుని కుటుంబానికి ఎల్లవేళలా మిత్రులందరం అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు గంగా, యమునా, విజయ, ఉపేందర్, భిక్షపతి, వెంకటేశ్వర్లు, భాస్కర్, లింగన్న, శ్రీను, యాకుబ్, వెంకన్న, దయాకర్, శుభోదన్ తోపాటు 56 మంది క్లాస్మేట్స్ పాల్గొన్నారు.

## కలుగొట్లలో చేతివృత్తులపై మహిళలకు శిక్షణ



అలంపూర్ మార్చి 13 (వుదయం ప్రతినిధి) : ఉండవెల్లి మండలం కలుగొట్ల గ్రామంలో గురువారం రాజ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. 45 రోజులపాటు రెండు బ్యాచులు నిర్వహించి ఒక్కో బ్యాచ్ లో 50 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ నిర్వాహకురాలు రత్నకుమారి తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ, చేతివృత్తుల ద్వారా శిక్షణ పొందాలన్నారు. నిరుపేద మహిళలకు రాజకుమార్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనుంజయ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, ట్రైనర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## హెూలీ ఫ్యామిలీ పాఠశాలలో ముందస్తుగా హెూలీ పండుగ సంబురాలు





కోదాడ మార్చి 13(వుదయం): స్థానిక హెూలీ ఫ్యామిలీ పాఠశాలలో ముందస్తుగా హెూలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు హెూలీ ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ముందస్తు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ జి.నంద కిషోర్, కె.చంద్రశేఖర్, టి.అంజయ్య, ప్రిన్సిపల్ డి. సైదులు యాదవ్ పాల్గొని హెూలీ పండుగకు భారతీయ సంస్కృతిలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉందని ఇది కేవలం రంగుల పండుగ మాత్రమే కాదని అనేక పురాణ గాథలతో ముడిపడి ఉందని, చెడుపై మంచి సాధించిన విజయంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలి

**– రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



వరంగల్ పశ్చిమ, మార్చి–13(వుదయం ప్రతినిధి) : మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాల పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటర్ జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మార్చి 19 లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహించే సమయంలో మీటింగ్ మినిట్స్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను ప్రత్యేకమైన రిజిస్టర్ లో తీసుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎం.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు.

## పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు 40వేలరూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి డిమాండ్ లి**



యాదాద్రి భువనగిరి మార్చ్ 13 (వుదయం ప్రతినిధి): బీడులను ఎండిపోయిన రైతులకు ఎకరాకు 40,000రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు అసెంబ్లీ పరిధిలోని యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం మాసాయిపేట మల్లాపురం గ్రామాలలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమంలో ఎండిపోయిన పంటలను వాటి రైతులని పరామర్శించారు. నాలుగు ఎకరాలు 5 ఎకరాలు మూడు ఎకరాలు చిన్న కారు సన్నకారు రైతులు పంటలకు నీరందిస్తామని స్థానిక ఎమ్మెల్యే హామీ మేరకు పంటలు వేసుకున్నారని తెలిపారు.కానీ బోర్లు పూర్తిగా ఎండిపోయాయని,చెరువులలో నీరు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని జగన్ మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నింపకుండా స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెరువులు నింపుతామని ఇచ్చిన హామీ గంగలో కలిసిందని విమర్శించారు. కాని ఈరోజు వరకు ఏ చెరువు నింపకుండా గంధ మల్ల రిజర్వాయర్ చెరువు అలానే ఉన్నదన్నారు. కరువు విలయతాండం చేస్తున్నదని,పశువులకు మేత లేక అల్లాడిపోయే పరిస్థితి ఏర్పడ్డదన్నారు పంటలు ఎండిపోయిన రైతులు ఎకరానికి 40,000 ఎక్స్ గ్రేషియా చెల్లించాలని పడమటి జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు, గుంటిపల్లి మహేశ్వరి, సత్యం, కిసాన్ మోర్చా మండలాధ్యక్షులు నర్సింలు, రచ్చ శ్రీనివాస్,యాదగిరి గుట్ట పట్టణ అధ్యక్షులు ప్రవీణ్,అచ్చయ్య, చంద్రమోహన్,ప్రవీణ్ రెడ్డి, మంగు నర్సింగ్ రావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## శిక్షణకొరకు రిసోర్స్ పర్సన్స్ వాలంటీర్లను గుర్తించాలి : కలెక్టర్



మెదక్, ( 2025 మార్చ్ 13 వుదయం ప్రతినిధి : గురువారం కలెక్టరేట్ కార్యాలయ కలెక్టర్ ఛాంబర్ లో ఆపదమిత్ర పథకం అమలుపై వివిధ శాఖల ద్వారా వాలంటీర్లు, రిసోర్స్ పర్సన్స్ గుర్తింపు పై, జిల్లా యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో డి ఆర్ డి ఓ, మెప్మా, హెల్త్, రెవిన్యూ, ఫైర్, మత్స్య శాఖ, ఇండస్ట్రీస్, అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ భుజంగరావు కలిసి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం విపత్తు ప్రమాద తగ్గింపు విపత్తు నిర్వహణ వ్యవస్థ పై దృష్టి పెట్టడం, విద్యా సామర్థ్యాన్ని బలోపేతం చేయడం , సాంకేతిక పురోగతిని ఉపయోగించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తులను మరింత ఆచరణాత్మక రీతిలో ఎదుర్కొనటానికి.ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యే అన్ని జిల్లాలను కవర్ చేస్తూ దీనిని ముందుకు తీసుకు వచ్చిందని చెప్పారు, జిల్లాలోని 18 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఆసక్తి గల యువతీయువకులు, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, విద్యార్థులు, ఎక్స్ సర్వీస్ మెన్ , సివిల్ డిఫెన్సు ఉద్యోగులు, మహిళా సంఘాల వయస్సు గల రిసోర్స్ పర్సన్స్, ఉత్సాహవంతులైన, శక్తివంతమైన వాలంటీర్లను ఎంపిక చేయాలన్నారు. ఈ శిక్షణ రెండు బ్యాచ్ లుగా ఏర్పాటు చేసి మెదక్ టీఎన్జీవోస్ భవనం, మహిళా డిగ్రీ కళాశాల మెదక్ లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అన్నారు, శిక్షణ సమయంలో వాలంటీర్లకు ఉచితంగా భోజన సదుపాయం, వసతి సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.ఈ శిక్షణలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అనగా వరదలు, భూకంపాలు, సునామీలు మరియు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా ఎదురుకోవాలి, వాటి నుండి ప్రజల ప్రాణాలను, వారి యొక్క ఆస్తులను ఎలా కాపాడాలి అనే వాటి పైన శిక్షణను ఇవ్వడం మరియు ప్రభుత్వ శాఖల విధుల పైన కూడా అవగాహన కల్పించడం జరుగుతుంది. తెలిపారు. ఆపదమిత్ర పథకం ఈనెల 20 నుండి ప్రారంభమై 31 వరకు 12 రోజులు ప్రతిరోజు పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు స్థానిక అగ్నిమాపక కేంద్రాలు వారి అధికార పరిధిలోని సాధారణ అత్యవసర పరిస్థితులలో సమన్వయం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఇందిరా, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, మత్స్య శాఖ అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి యాజమాన్య పద్ధతులు పాటించండి : ఏవో



మెదక్, ( 2025 మార్చ్ 13 వుదయం ప్రతినిధి : గురువారం నిజాంపేట మండల కేంద్రంలోని కొందరి రైతులకు సంబంధించిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు నీటి యాజమాన్య పద్ధతులను పాటించి వరి పంటను రక్షించుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు పైపుల ద్వారా నీటిని అందించాలని సూచించారు.

## నారాయణపేట కీర్తిని వ్యాపింప చేయాలి భీష్మ రాజ్ ఫౌండేషన్ అధినేత రాజ్ కుమార్ రెడ్డి




నారాయణపేట టౌన్ మార్చ్ 13(వుదయం ప్రతినిధి): సమ్మర్ క్రికెట్ టోర్నీ(ఎస్.ఎస్.సీ.టీ.) ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని ఐటీఐ కాలేజ్ మైదానంలో ఈనెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో 5 జట్లు హోరాహోరీగా తలపడగా, అందులో ఎస్.ఆర్.జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్ లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.12222 బహుమతిని అందజేశారు. పల్ల బురుజు హనుమాన్ దేవాలయ చౌరస్తాలో ఏర్పాటు చేసిన క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి భీష్మరాజ్ ఫౌండేషన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.12222 నగదును భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచి నారాయణపేట కీర్తిని దశదిశలా వ్యాపింపజేయాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాళ్లను వెలికి తీసేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. నారాయణపేట పట్టణానికి చెందిన కరాటే, కుంగ్ ఫూ తదితర క్రీడాకారులకు ఆర్థిక సహాయం స్వెటర్లను తమ ఫౌండేషన్ ద్వారా అందజేశామని పేర్కొన్నారు. అంతకుముందు టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు రాజ్ కుమార్ రెడ్డిని శాలువలతో ఘనంగా సత్కరించి షీల్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పి.ప్రభాకర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, అశోక్ కుమార్, కె.రమేష్, బి.శ్రీనివాస్, ధరణిధర్ దీక్షిత్, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, హన్మంత్, మన్నె గోపాల్, సుదర్శన్ రెడ్డి, రుద్రారెడ్డి, నర్సింహులు, శివరాజ్, ఎం.సంతోష్, కృష్ణ, నగరి నాగురావు, మేంగ్జీ నందుకుమార్, బసుదే అశోక్ కుమార్, అధిక సంఖ్యలో క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

## విద్యాధరి పాఠశాలలో ఘనంగా హోలీ సెలబ్రేషన్స్..!



హన్మకొండ, వుదయం (జిల్లాప్రతినిధి): 13 మార్చ్ 2025. హనుమకొండ జిల్లా గోపాల్పూర్ విద్యాధరి పాఠశాలలో హోలీ సెలబ్రేషన్స్ వై.వి రావు అపర్ణలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడుతూ.. పాఠశాల పక్షాన అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల ను బోధించడంలో విద్యాలయాలు ముందంజలో ఉంటాయని ఆమె అన్నారు. పాఠశాల లో ప్రతి పండుగను ఘనంగా నిర్వహించి పండుగల యొక్క ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించడం జరుగుతుందని ఆమె అన్నారు ..ఈ సందర్భంగా కరస్పాండెంట్ వై.వి రావు మాట్లాడుతూ.. హోలీ పండుగను ఫిబ్రవరి లేదా మార్చి చివరి వారాల్లో పౌర్ణమి రోజున జరుపుకుంటారని ఆయన అన్నారు. ఈ హోలీ పండుగ రోజున ప్రజలు పలు రకాల రంగుల పొడిని, రంగు నీళ్లను ఒకరిపై ఒకరు జల్లుకుంటూ ఘనంగా జరుపుకుంటారని అన్నారు... హోలీ పండుగ కు ముందు రోజున హిరణ్యకశ్యపుని చెల్లెలైన హోలిక అనే రాక్షసి బొమ్మకు నిప్పంటిస్తారు అని ఆయన అన్నారు. హిరణ్యకశిపుని చెల్లెలైన హోలిక అనే రాక్షసి ప్రహ్లాదుడిని మంటలలో వేసినప్పుడు దైవలీలతో తప్పించుకుంటాడు అందుకే భోగి మంటలు అంటిస్తారు అనిఈసందర్భంగా ఆయన అన్నారు. హోలిక ఈ మంటలలో దహనమయ్యింది కానీ విష్ణువుకు పరమ భక్తుడైన ప్రహ్లాదుడు, అతని అపార భక్తితో ఎటువంటి గాయాలు లేకుండా తప్పించుకుంటాడు. ఈ పండుగ ను తెలుగు రాష్ట్రాల్లో హోలిక దహన్‌ను కామ దహనం అని అంటారని ఆయన అన్నాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారని ఆయన అన్నారు.

## మత్స్య శాఖలో మహిళా సొసైటీల ఏర్పాటుకు కృషి చేయండి



నారాయణపేట టౌన్ మార్చ్ 13(వుదయం ప్రతినిధి) : జిల్లా మత్స్య సహకార సంఘం లో మహిళా సొసైటీలను ఏర్పాటు చేసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని నారాయణపేట మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షులు ఏ కాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా మత్స్య శాఖ కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏ కాంత కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజులలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు ఇందులో భాగంగా మహిళా సొసైటీలను సైతం ఏర్పాటు చేసి మహిళలను సైతం ఏకం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్నటువంటి ప్రాథమిక సహకార సంఘాల సభ్యులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ఫారం అనే మెంబర్షిప్ ను ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నరసింహనాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్ ఏ రహ్మాన్,డైరెక్టర్స్ పెద్ద విజయ్ కుమార్ ,హనుమంతు,ఆంజనేయులు,వెంకటేష్, శ్రీనివాస,సరోజ,ఆనంద్, ఉషనప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 13(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారంలోని ఎస్ ఎస్ వి ఎం ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూల్లో గురువారం సెల్ఫ్ గవర్నమెంట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యార్థిని విద్యార్థులకు పాఠాలు చెప్పారు. తమ తోటి విద్యార్థులే టీచర్గా వచ్చి పాఠాలు చెప్పడం తో పిల్లలు ఆనందంతో కేరింతలు కొట్టారు. బుద్ధిగా పాఠాలు విని ఆనందించారు. పాఠశాల హెచ్ఎం గా వ్యవహరించిన వడ్లకొండ ప్రణోజ్ఞ ప్రతి క్లాస్ను పర్యవేక్షించి విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సెల్ఫ్ గవర్నమెంట్ డే నిర్వహణ వల్ల విద్యార్థులలో కాన్ఫిడెంట్ లెవెల్స్ పెరుగుతాయని అన్నారు. విద్యార్థులకు టీచర్స్ పాఠాలు బోధించే సమయంలో ఎదురయ్యే సమస్యలు టీచర్స్ గా వ్యవహరించిన విద్యార్థులు నేర్చుకున్నారని అన్నారు. కార్యక్రమానంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు టీచర్స్ బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత, టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి....



అన్నపురెడ్డిపల్లి, మార్చి 13 : (వుదయం ప్రతినిధి) రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండలంలో విషాదఛాయలు అమ్ములుకున్నాయి. వివరాల్లోకెళ్తే... ఎర్రగుంట గ్రామానికి చెందిన పద్దం అగ్గి రవి మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భీమునిగూడెం ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత పనుల విషయంపై సత్తుపల్లి వెళ్లి వస్తూ ఉండగా కిష్టారం గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురై ఖమ్మం ఆస్పత్రిలో గురువారం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి, బంధువులు, స్నేహితులు ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు..

## మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన హైకోర్టు అడ్వకేట్



మల్హర్ (వుదయం) ప్రతినిధి ఖమ్మంపల్లి నుంచి వయా తాడిచెర్ల మీదుగా భూపాలపల్లి కి డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో తాడిచెర్ల గ్రామానికి చెందిన , హైకోర్టు అడ్వకేట్ పులి గంటి సురేష్ కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు డేంజర్ జోన్ లో నివసిస్తున్న భూ నిర్వాసితుల గృహాలను సేకరించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు వారి వెంట తాడిచర్ల కాపురం గ్రామాల జెన్కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షులు కేసారపు రవి పాల్గొన్నారు

## అసెంబ్లీ సమావేశాలలో మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ద్వారా 11 శాతం కేటాయించి చట్ట బద్ధత కల్పించాలి.



పరకాల మార్చి 13 (వుదయం ప్రతినిధి: పరకాల పట్టణ కేంద్రంలో నాలుగవరోజు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తూ మందకృష్ణ మాదిగ కి ఇచ్చిన పిలుపుమేరకు నాలుగో రోజు దీక్షను కొనసాగిస్తూమాదిగ మాదిగ ఉప కులాలకు ఈరోజు నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కేటాయించి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకుశంకర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెండల మహేందర్ మాదిగ పెండల రవీందర్ మాదిగ ఏకు రమేష్ మాదిగ పెండెల ఉదయ్ మాదిగ పెండల రవికుమార్ మాదిగ కేతపాక శంకర్ మాదిగ కొమ్ముల చిరంజీవి మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుకొయ్యడ కుమార మాదిగ ఎంఆర్పిఎస్ పరకాల మండలం ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు..

## శ్రీ వేద స్కూల్లో ముందస్తు హోలీ సంబరాలు..



పరకాల మార్చి 13 (వుదయం ప్రతినిధి): శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో గురువారం ముందస్తుగా హోలీ సంబరాలు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు జాజిరి ఆటలు ఆడి హోలీ సంబరాల్లో రంగురంగుల కలర్లు చల్లుకొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాల గురించి వివరించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేద, ప్రియాంక, కీర్తి రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కళా సాంస్కృతిక రంగాల అభివృద్ధికి భట్టి విక్రమార్క ప్రోత్సాహం ఉంది



మధిర,మార్చి13(వుదయం ప్రతినిధి) : మధిర రైల్వే కోదండ రామాలయం లో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు నాటకాలు, హరికథలు, బుర్రకథలు, నృత్యాలు కరోనా సమయం నుంచి నిలిపివేశారు. మరల వాటిని పునరుద్ధరించాలని రైల్వే కోదండ రామాలయం చైర్మన్ పి.డబ్ల్యూ.ఐ మల్లేష్ గుప్తా ను మధిర ప్రముఖులు కళాకారులు కలిసి వివరించాము. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రోత్సాహం కళాకారులకు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మధిర పురప్రముఖులు మాధవరపు నాగేశ్వరరావు రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ సముద్రాల లక్ష్మీపతి రావు,సీనియర్ కళాకారులు కంచి దయానంద భూషణం,చిలువేరు బుచ్చిరామయ్య, ఆర్ బాబ్లా, డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరులో ఎడ్లు బండలాగుడు పోటీ కార్యక్రమమును ప్రారంభించిన మట్టా



సత్తుపల్లి / వేంసూరు మార్చ్ 13 (వుదయం ప్రతినిధి) :వేంసూరు మండలం-కందుకూరు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా గొర్ల సత్యనారాయణ రెడ్డి(బుల్లిబాబు) జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బండ లాగుడు కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వి ఎల్ వి వెంకట్రావు సిబ్బంది మధు కర్ణ వెంకట్ సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్ప రెడ్డి,వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి గడిపర్తి శ్రీనివాసరావు కొప్పుల వెంకటేశ్వర రెడ్డి చిల్లపల్లి రామకృష్ణ చంటి బండి లక్ష్మారెడ్డి కే రాము టీ చెన్నారావు ఎస్.కె మౌలాలి బి విజయకుమార్ కే భీమయ్య ఎస్ పుల్లయ్య కే లక్ష్మయ్య టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఘనంగా కామ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావు 60వ జయంతి వేడుకలు



మార్చి 13 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు కీర్తిశేషులు కామ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావు 60వ జయంతిని దమ్మపేట మండలంలో ఆయన కుమారుడు సిపిఐ మండల సహాయ కార్యదర్శి యార్లగడ్డ మణికంత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావు స్థూపానికి చిత్రపటానికి సిపిఐ పార్టీ నాయకులు యార్లగడ్డ మణికంత, తంగేళ్లమూడి శివకృష్ణ, బెజవాడ రాము, రాపోలు శ్రీమన్నారాయణ పారేపల్లి ప్రసాద్ ఆయన అభిమానులు గంటా వెంకటేశ్వరరావు, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి జోహార్ కామ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావు అంటూ నినాదాలు చేసి బాణాసంచా కాల్చారు.ఆయన స్తూపం వద్ద వక్తలుగా మాట్లాడుతూ నిస్వార్థ ప్రజానాయకుడు సిపిఐ పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా ఆయన తుది శ్వాస వరకు 30 సంవత్సరాలు పైగా రైతులు వ్యవసాయ కార్మికులు కార్మికులు అట్టడుగు పేద వర్గాల కోసం పోరాడిన మహా గొప్ప నాయకుడు కామ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావు అని యువకుడిగా ఎర్ర జండా చేతబట్టి తుది శ్వాస విడిచే వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి భారత కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని వారు తెలియజేశారు . దమ్మపేట మండలంలో సిపిఐ పార్టీ తరపున ప్రముఖ పాత్ర వహించి క్రమశిక్షణ కలిగిన నాయకుడని మండలంలో పార్టీ నిర్మాణంలో ఎనలేని కృషి చేశారని. కొత్త ప్రాంతాలలో పార్టీలు నిర్మించాలని తహతహలాడే వారిని కార్యకర్తలకు ఎటువంటి ఆర్థిక ఇబ్బంది వచ్చిన తను వంతు సహాయం చేసే వారిని సమయపాలన పాటించే వారిని పార్టీ నిర్మాణ విషయంలో చాలా నిక్కచ్చిగా నిబద్ధతిగా ఉండే వారని ఆదర్శనీయుడని మహానుభావుడని అమరజీవి అని కొనియాడారు. ఈ వేడుకలలో సిపిఐ పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయాలని ఎం ఆర్ పి ఎస్ రిలే నిరాహార దీక్ష



చుంద్రుగొండ మార్చి 13 :(వుదయం ప్రతినిధి) ఎస్సీ వర్గీకరణ అంశం పూర్తి అయిన తర్వాతనే ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టాలని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు చాపల మడుగు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. గురువారం మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షల్ని టిడిపి మండల అధ్యక్షులు వారాది సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా నాయకులు చాపలమడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్షల్ని ఈనెల 19 వరకు చేపడతామన్నారు. ఎస్సీ వర్గీకరణ జీవో రూపంలో వచ్చేవరకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయవద్దన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశానికి ముగింపు ఇవ్వాలన్నాడు. కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ ఎస్ నాయకులు నారపోగు మధు, చాపలమడుగు రామరాజు, కాంపాటి పుల్లయ్య, కాకటి నరేష్, తదితరులు పాల్గొన్నారు...

## మానవ అక్రమ రవాణా నియంత్రణ అందరి బాధ్యత ఎస్సై నరేష్



సంగెం మార్చి 13 (వుదయం ప్రతినిధి): మనవ అక్రమరవాణా అరికట్టడానికి సమజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సంగెం ఎస్సై నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య ఆఫీసులో వివోఏ లకు,వివో అధ్యక్షులకు మానవ అక్రమ రవాణా పై ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా ఎస్సై పాల్గొని మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చేయడం ఘోరమైన నేరమని దీనిని అరికట్టడానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. మన చుట్టూ ఉండే మోసపూరిత మనుషులే అమాయక ప్రజలను టార్గెట్ చేసి బాండెడ్ లేబర్ గా, సెక్స్ వర్కర్ గా మారుస్తున్నారని తెలిపారు. ప్రజల పేదరికాన్ని ఆసరా చేసుకొని, అమాయకపు నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలను, బాలబాలికలకు ఉద్యోగ అవకాశాల పేరుతో డబ్బు ఆశ చూపి సెక్స్ వర్కర్లుగా,బాండెడ్ లేబర్లుగా వివిధ మెట్రోపాలిటన్ నగరాలలో అమ్ముచున్నారని తెలిపారు. అభంశుభం తెలియని చిన్నారులను సైతం కిడ్నాప్ చేసి భిక్షాటన కోసం అవయవాల మార్పిడి కోసం లైంగిక వాంఛ తీర్చుకోవడం కోసం మానవ అక్రమ రవాణా కు పాల్పడుతున్నారని తెలిపారు. కావున స్వయం సహాయక సంఘాలలోని మహిళలు వారి నెలవారి మీటింగ్లలో ప్రత్యేక ఎజెండాగా మానవ అక్రమ రవాణా ను చేర్చుకొని గ్రామీణ ప్రాంతంలోని ప్రజలను అవగాహన కల్పించుటకు వివోఏలు నడుంబిగించాలని తెలిపారు. వివోఏలకు ప్రతి కుటుంబంతో మంచి సంబంధాలు కలిగి ఉంటారు, కావున అన్ని కుటుంబాలలో ఈ మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించుటలో ముఖ్యపాత్ర పోషించాలని తెలిపారు. మానవ అక్రమ రవాణా ఆధునిక బానిసత్వంగా పేర్కొనవచ్చు అని తెలిపారు. లైంగిక వ్యాపారం కూడా ఒక పరిశ్రమలాగా అభివృద్ధి చెందుతుంది, కావున దీని పట్ల ప్రజలు చైతన్యంతో మెదలాలని తెలిపారు. ఇట్టి విషయంలో స్వయం సహాయక సంఘాల లీడర్లకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం దుంపేటి కిషన్, మండల సమైక్య అధ్యక్షురాలు కళ్యాణి, కార్యదర్శి రాజమణి, సీసీలు కుమారస్వామి, రాజయ్య, కృష్ణమూర్తి, బొజ్జ సురేష్, ఏలియా, ఆఫీస్ సిబ్బంది కృష్ణ, సుజాత, శివరాజ్, వివో ఏలు కృష్ణవేణి, విజయ, మంజుల, రాణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు

## అరుణాచల క్షేత్రంలో చల్లా దంపతులు..



పరకాల మార్చి 13 (వుదయం ప్రతినిధి): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్రంలో అగ్నిలింగ రూపంలో అవతరించిన ఆ పరమేశ్వరుడిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి - జ్యోతి దంపతులు దర్శించుకున్నారు.మొదటగా గిరి ప్రదక్షణ చేసి అనంతరం స్వామీ వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యేమాట్లాడుతూ.పంచభూతలింగ క్షేత్రాలలో ఒకటిగా అరుణాచలంలో అగ్నిలింగ రూపంలో వెలసిన ఆ పరమేశ్వరుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఆ పరమశివుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



# బిజినెస్



## పాత కారు అమ్మేస్తున్నారా? మంచి ధర రావాలంటే..



ఎవరైనా పాత కారును అమ్ముతున్నారంటే మంచి ధర రావాలనే చూస్తారు. అలాగే కొనేవారు కూడా తక్కువ ధరల్లో సెకండ్ హ్యాండ్ కారు దొరలని కోరుకుంటారు. అయితే మీరు మీ పాత కారును అమ్ముతుంటే.. అదికూడా మంచి ధర రావాలంటే కొన్ని ట్రిక్స్ ఉన్నాయి. మీరు కొత్త కారును కొనుగోలు చేయాలనే ఉత్సాహంలో ఉంటే, మీ పాత కారును విక్రయించాలనుకుంటే, మీ పాత కారుకు మంచి ధర రావాలంటే కొన్ని ట్రిక్స్ ఉన్నాయి. వాటిని పాటిస్తే మంచి ధర పొందవచ్చంటున్నారు టెక్ నిపుణులు. మీరు మీ పాత కారును ఎవరికైనా విక్రయించినప్పుడు అది పాతదని, ఇంజిన్ పనిచేయడం లేదని, సమస్యలున్నాయని చెప్పడం తరచుగా వింటుంటాము. మీడియా నివేదికల ప్రకారం.. దేశంలో సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ వేగంగా పెరుగుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పెట్రో ధరలు నిరంతరం పెరగడమే ఇందుకు కారణం. మీరు కూడా మీ కారును విక్రయించాలనుకుంటే, కొన్ని విషయాలను గుర్తుంచుకోండి. తద్వారా మీరు కారుకు మంచి ధరను పొందవచ్చు.

మీ కారును కండీషన్‌గా ఉంచుకుంటే ఎవరికైనా విక్రయించవచ్చు. డీలర్‌కు విక్రయించవచ్చు లేదా డీలర్‌షిప్‌కు తిరిగి ఇవ్వవచ్చు. కారు రూపురేఖలతోనే ఫస్ట్ ఇంప్రెషన్ ఏర్పడింది. కారు రూపాన్ని చూడటం ద్వారా ఒక నమ్మకం ఏర్పడుతుంది. దాని ఆధారంగా అతను దానిని కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంటాడు. అందువల్ల మీరు మీ కారు లోపలి, వెలుపలి భాగాన్ని నిర్వహించడం చాలా ముఖ్యం. దీనితో మీరు మీ కారును అమ్మడం ద్వారా మంచి డబ్బు పొందవచ్చు.కారును ఎప్పటికప్పుడు సర్వీస్ చేయాలి. ఇంజన్ ఆయిల్, కూలెంట్ టాప్-అప్, ఫ్యూయల్ ఫిల్టర్‌ని క్రమం తప్పకుండా మార్చాలి.

## ఆందోళనలో ఇండస్ ఇండ్ ఖాతాదారులు..

### డబ్బు సురక్షితమేనా..?




ఆర్‌బీఐ చర్యలతో ఇండస్ ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు సంబంధించి చాలా గందరగోళం నెలకొంది. ఆర్‌బీఐ తన సీఈఓ పదవీకాలాన్ని ఒక సంవత్సరం మాత్రమే ఆమోదించగా, బ్యాంక్ దానిని 3 సంవత్సరాలకు ఆమోదించింది. అయితే తాజాగా బ్యాంకుకు సంబంధించిన డెరివేటివ్‌లకు సంబంధించిన ఇటీవలి అకౌంటింగ్ అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. డెరివేటివ్‌లకు అవకతవకల కారణంగా ఇండస్ ఇండ్ పన్ను అనంతర నికర విలువ 2.35 శాతం తగ్గింది. మార్చి 10న దాని షేర్లు కుప్పకూలి, రికార్డు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. మార్చి 11న కూడా స్టాక్ క్రాష్ అయ్యింది. దీంతో పాటు బ్రోకరేజ్ సంస్థ బ్యాంకు రేటింగ్, లక్ష్య ధరను తగ్గించింది. మొత్తం మీద ఇండస్ ఇండ్ బ్యాంకు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ బ్యాంకులో రూ.4 లక్షల కోట్లకు పైగా డిపాజిట్ చేసిన కోట్లాది మంది కస్టమర్లు ఉన్నారు. మరి ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో డబ్బు సురక్షితంగా ఉందా? అనే ఆందోళనలో ఖాతాదారులు ఉన్నారు. ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇండస్‌ఇండ్ బ్యాంక్‌పై ఎటువంటి నిషేధం విధించలేదు లేదా ఎటువంటి పెద్ద చర్య తీసుకోలేదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇండస్ ఇండ్ బ్యాంకు నుంచి ఉపసంహరణను ఆపడానికి ఆర్‌బీఐ ఎటువంటి చర్య తీసుకోలేదు. అయితే, బ్యాంకులో అవకతవకలు పెరిగినప్పుడు ఆర్‌బీఐ ఉపసంహరణపై నిషేధం విధించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నిషేధం కనీసం 6 నెలలు ఉంటుంది. ఈ కాలంలో ఎవరూ బ్యాంకు నుంచి డబ్బు తీసుకోలేరు.

దీని తరువాత బ్యాంకు పరిస్థితిని మెరుగుపరచడానికి ఆర్‌బీఐ ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఒక నిర్దిష్ట పరిమితి వరకు డబ్బును ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇస్తారు. యస్ బ్యాంక్, న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ విషయంలో కూడా అదే జరిగింది. కానీ ప్రస్తుతం ఇండస్‌ఇండ్ విషయంలో అలాంటిదేమీ జరగడం లేదు.

## గోల్డ్ లవర్స్‌కు బ్యాడ్ న్యూస్..

### మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు..

బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. మనం కనీవినీ ఎరుగని రీతిలో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గత ఏడాదికాలంలో గోల్డ్ ధర 38 శాతం పెరిగినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది. బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. మనం కనీవినీ ఎరుగని రీతిలో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గత ఏడాదికాలంలో గోల్డ్ ధర 38 శాతం పెరిగినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉ



ంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. ధరలు ఒక్కోసారి పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతుంటాయి.. తాజాగా గోల్డ్ ధర స్వల్పంగా పెరగగా.. సిల్వర్ ధర భారీగా పెరిగి లక్షమార్కును దాటింది.. గురువారం (13 మార్చి 2025) ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.80,660, 24 క్యారెట్ల పదిగ్రాముల గోల్డ్ ధర రూ.87,990 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,00,100 గా ఉంది. కాగా.. దేశీయంగా బంగారం 10 గ్రాములపై రూ.10, వెండి కిలోపై రూ.100 మేర ధర తగ్గింది. అయితే..

ఈ ధరలు ప్రాంతాల ప్రకారం మారుతుంటాయి. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.80,660, 24 క్యారెట్ల ధర రూ.87,990 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.80,660, 24 క్యారెట్ల ధర రూ.87,990 గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.80,810, 24 క్యారెట్ల ధర రూ.88,140 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.80,660, 24 క్యారెట్ల ధర రూ.87,990 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.80,660, 24 క్యారెట్ల రేటు రూ.87,990 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.80,660, 24 క్యారెట్ల ధర రూ.87,990 గా ఉంది.

## క్రెడిట్ కార్డు బిల్లు సరిగ్గా కట్టినా క్రెడిట్ స్కోర్ తగ్గుతుందా?




చాలా సార్లు, బిల్లులు సకాలంలో చెల్లించినప్పటి, క్రెడిట్ స్కోరు పడిపోతుంది. ఇది ఎందుకు జరుగుతుందో అర్థం కాదు. సకాలంలో చెల్లింపులు చేసినప్పటికీ మీ క్రెడిట్ స్కోరు పడిపోవడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉంటాయి. మీ క్రెడిట్ స్కోరు తరచుగా క్రెడిట్ వినియోగ నిష్పత్తి ద్వారా ప్రభావితమవుతుంది. మీరు సకాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ పడిపోతుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందన్న అనుమానం కూడా వస్తుంటుంది. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఈ క్రెడిట్ వినియోగ నిష్పత్తి మీకు అందుబాటులో ఉన్న మొత్తం క్రెడిట్‌లో మీరు ఎంత ఉపయోగిస్తున్నారో చూపిస్తుంది. దీనిని 30% లోపు ఉంచాలి. మీరు మీ క్రెడిట్ కార్డ్ లిమిట్ మొత్తాన్ని ఉపయోగిస్తున్నా లేదా భారీ బకాయిలను మోస్తున్నా, మీరు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని బ్యాంకులకు తెలిసిపోతుంది.

తద్వారా మీ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మీ క్రెడిట్ స్కోరు తరచుగా క్రెడిట్ వినియోగ నిష్పత్తి ద్వారా ప్రభావితమవుతుంది. మీరు సకాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ పడిపోతుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందన్న అనుమానం కూడా వస్తుంటుంది. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఈ క్రెడిట్ వినియోగ నిష్పత్తి మీకు అందుబాటులో ఉన్న మొత్తం క్రెడిట్‌లో మీరు ఎంత ఉపయోగిస్తున్నారో చూపిస్తుంది. దీనిని 30% లోపు ఉంచాలి.

మీరు మీ క్రెడిట్ కార్డ్ లిమిట్ మొత్తాన్ని ఉపయోగిస్తున్నా లేదా భారీ బకాయిలను మోస్తున్నా, మీరు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని బ్యాంకులకు తెలిసిపోతుంది. తద్వారా మీ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మీరు క్రెడిట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడల్లా అది మీ క్రెడిట్ నివేదికపై ప్రభావం పడుతుంది. పదేపదే దరఖాస్తు చేసుకున్నప్పుడు అది రిజెక్ట్ అయితే కూడా స్కోర్ తగ్గుతుంది. ఇది మీ స్కోర్‌ను తాత్కాలికంగా తగ్గిస్తుంది. మీరు మరిన్ని అప్పులు తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారని మరిన్ని దరఖాస్తులు సూచిస్తున్నాయి. దీని వలన బ్యాంకులు మిమ్మల్ని ప్రమాదకర రుణగ్రహీతగా పరిగణించవచ్చు. కొన్ని బిల్లులు సకాలంలో చెల్లించినప్పటికీ, మీరు ఇతర క్రెడిట్ కార్డులు లేదా రుణాలపై చెల్లింపులను మిస్ అయితే మీ మంచి చెల్లింపు చరిత్ర వృధా కావచ్చు. క్రెడిట్ స్కోరింగ్ మోడల్ మీ మొత్తం క్రెడిట్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది. అందుకే ఒక్క ఆలస్య చెల్లింపు కూడా స్కోరులో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తుంది. పాత ఖాతాలను మూసివేయడం వల్ల మీ ఖాతా సగటు వయస్సు తగ్గడమే కాకుండా మీ మొత్తం క్రెడిట్‌ను కూడా తగ్గిస్తుంది. మీ స్కోర్‌ను మరింత దెబ్బతీస్తుంది. మంచి క్రెడిట్ ఖాతాలను ఉంచడం, పాత ఖాతాలను తెరిచి ఉంచడం వల్ల బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌ను నిర్మించడంలో సహాయపడుతుందని గుర్తించుకోండి. మీరు మీ క్రెడిట్ నివేదికను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అలాగే ఏదైనా తప్పు జరిగితే మీరు వెంటనే క్రెడిట్ బ్యూరోను సంప్రదించి దాన్ని సరిదిద్దుకోవాలి.

## ఎల్ఐసిలో మళ్లీ వాటాల విక్రయం..!

ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)లో 2-3 శాతం వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ యోచిస్తోంది. 2022లో ఐపిఒకు వచ్చిన సమయంలో 3.5 శాతం వాటాకు సమానమైన 22.13 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో రూ.21,000 కోట్ల నిధులను తమ ఖజానాలో వేసుకుంది. ప్రభుత్వానికి ప్రస్తుతం ఎల్ఐసిలో 96.5 శాతం వాటా ఉంది. కాగా.. 2027 నాటికి ఇందులో కనీసం 10 శాతం వాటాను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. మార్కెట్ పరిస్థితులకు అనుకూలంగా క్రమంగా వాటాలను విక్రయించాలనేది ప్రభుత్వ వ్యూహమని మింట్ ఓ కథనంలో వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 2-3 శాతం వాటా విక్రయం ద్వారా




రూ.9,500 కోట్ల నుంచి రూ.14,500 కోట్ల వరకు నిధుల్ని సమకూర్చుకొనే అవకాశం ఉంది. 2027 మే నాటికి ఎల్ఐసిలో కనీసం 10 శాతం వాటాలను విక్రయించాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆదేశించింది. ఈ వాటాలను చిన్న విడతలుగా ఉపసంహరించుకోవాలని కేంద్రం యోచన. ప్రపంచంలోనే బీమా రంగంలో ఎల్ఐసి మూడో అత్యంత బలమైన కంపెనీగా గుర్తింపును పొందింది. బ్రాండ్ స్ట్రెంత్ ఇండెక్స్ (బిఎస్ఐ)లో 100కు గాను 88 స్కోర్ పొందినట్లు బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100 రిపోర్ట్-2025లో ఇటీవల వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9,444.42 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

### 79 శాతం తగ్గిన ఎంఎఫ్ పెట్టుబడులు

ప్రస్తుత ఏడాది జనవరితో పోల్చితే గడిచిన ఫిబ్రవరిలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో ఏకంగా 79 శాతం పతనం చోటు చేసుకుంది. ఈక్విటీ ఎంఎఫ్‌లు 26 శాతం తగ్గి రూ.29,303 కోట్లకు పరిమితమయ్యాయి. జనవరిలో ఈ మొత్తం రూ.39,687 కోట్లుగా నమోదయ్యిందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్ఐ) వెల్లడించింది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో జనవరిలో అత్యధికంగా రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు నమోదు కాగా.. ఫిబ్రవరిలో రూ.6,525 కోట్ల మేర పెట్టుబడులు తరలిపోయాయి. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు 35 శాతం తగ్గాయి. జనవరిలో రూ.5,720 కోట్లుగా ఉన్న ఈ మొత్తం ఫిబ్రవరిలో రూ.3,722 కోట్లకు చేరింది. మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోనూ 34 శాతం క్షీణతతో రూ.3,406 కోట్లకు తగ్గాయి. ఇంతక్రితం నెలలో రూ.5,147 కోట్ల పెట్టుబడులు చోటు చేసుకున్నాయి. మ్యూచుఫల్ ఫండ్స్ ఇండిస్టీ పరిధిలో ఉన్న నికర ఆస్తుల నిర్వహణ 4 శాతం క్షీణించి రూ.64.26 లక్షల కోట్లకు చేరింది. గడిచిన ఫిబ్రవరి సిప్‌ల్లోనూ పెట్టుబడులు 2 శాతం తగ్గి రూ.26,400 కోట్లుగా చోటు చేసుకున్నాయి.

# జాతీయం – అంతర్జాతీయం

## డబ్ల్యుఎఫ్ఐ సస్పెన్షన్ రద్దుపై స్పందించిన వినేష్ ఫోగట్



న్యూఢిల్లీ : క్రీడాశాఖ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) సస్పెన్షన్‌ను రద్దు చేయడంపై మాజీ రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేష్ ఫోగట్ స్పందించారు. సస్పెన్షన్ రద్దు తనను ఆందోళనకు గురిచేసిందని అన్నారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ ఒక డమ్మీ అని, బ్రిజ్ భూషణ్ వెనుక ఉండి రెజ్లింగ్‌ను నడిపిస్తున్నారని అన్నారు. హర్యానా అసెంబ్లీలో గురువారం గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా ఇటీవల జులానా నియోజకవర్గం నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వినేష్ ఫోగట్ మాట్లాడారు.ప్రస్తుతం తాను గర్వంతో, బాధతో ఇక్కడ ఉన్నానని అన్నారు. తమ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం ఎంతో చేసిందని పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు చెబుతున్నారని అన్నారు. రెండు సంవత్సరాలుగా వీధుల్లో ఆందోళనలు చేపట్టామని, ఇప్పటికీ రెజ్లింగ్ క్రీడను కాపాడుకునేందుకు పోరాడుతున్నామని బాధతో చెబుతున్నానని అన్నారు. కానీ రెండు రోజుల క్రితం మీ పార్టీ (బిజెపి) రెజ్లింగ్‌ను తిరిగి అతని చేతుల్లో పెట్టిందని బ్రిజ్‌భూషణ్ పేరు ప్రస్తావించకుండా అన్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినప్పటికీ.. బ్రిజ్‌భూషణ్‌కి వ్యతిరేకంగా ఏ పార్టీ ప్రతినిధులుగా తాము ఆందోళనను ప్రారంభించలేదని, క్రీడాకారులుగానే తమ గొంతుకను వినిపించామని అన్నారు. ఒక క్రీడాకారుడు ఎప్పటికీ క్రీడాకారుడిగానే ఉంటారని స్పష్టం చేశారు. వర్ధమాన క్రీడాకారుల భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

## చారిత్రిక క్యాథలిక్ చర్చి ట్రస్టీగా తొలిసారి మహిళ నియామకం



అలప్పుజా : ప్రగతిశీల, అభ్యుదయ భావాలకు నిలయమైన కేరళలో మరో ఘటన చోటు చేసుకుంది. రాష్ట్రంలోని 165 ఏళ్ల చరిత్ర కలిగిన క్యాథలిక్ చర్చిలో ట్రస్టీగా తొలిసారి ఒక మహిళను నియమించారు. సాధారణంగా చర్చిలో ఈ ట్రస్టీ బాధ్యతలను పురుషులే నిర్వహించడం ఇప్పటి వరకూ అనవాయితీగా వస్తోంది. దీనికి భిన్నంగా అలప్పుజా పట్టణ శివారుల్లో ఉన్న అవర్ లేడీ ఆఫ్ అజంప్షన్ చర్చి ట్రస్టీగా 39 ఏళ్ల సుజా అనిల్‌ను నియమించారు. దీంతో ఈ వారం ప్రారంభంలో జరిగిన కార్యక్రమంలో మరో ఇద్దరు పురుష ట్రస్టీలతో పాటు సుజా అనిల్ కూడా బాధ్యతలు స్వీకరించారు. కేరళలోని క్యాథలిక్ చర్చిల్లో ట్రస్టీగా ఒక మహిళను నియమించడం ఇదే మొదటిసారని ఫాదర్ జేవియర్ చెప్పారు. ట్రస్టీగా ఒక మహిళా నియామకాన్ని పరిగణించాలని పారిస్ పాస్టోరల్ కౌన్సిల్‌ను ఫాదర్ జేవియర్ గతంలో కోరారు. దీనికి అనుగుణంగా కొన్ని వారాల క్రితం కౌన్సిల్ చేసిన సిఫార్సుకు కొచ్చిన్ డియోసెస్ ఆమోదం తెలిపింది.

## ఆల్కహాల్, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ అధిక పన్నులు వేస్తోంది



వాషింగ్టన్ : భారత్ తన ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేస్తోందని అమెరికా మరోసారి ఆరోపించింది. అమెరికా ఆల్కహాల్, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ ఎక్కువ సుంకాన్ని విధిస్తోందని శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి కరోలిన్ లీవెట్ చెప్పారు. కెనడాపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'కెనడా కొన్ని దశాబ్దాలుగా అమెరికాను, అమెరికా ప్రజలను నానా ఇబ్బందులు పెడుతోంది. ఇక్కడి అమెరికా ప్రజలు, కార్మికులపై కెనడా వారు విధిస్తున్న సుంకాలను చూస్తుంటే అవి ఎంత విపరీతంగా ఉన్నాయో తెలుస్తుంది. కేవలం కెనడా విధించే సుంకాలే కాదు.. అనేక దేశాలు విధిస్తున్న సుంకాల జాబితా కూడా నా వద్ద ఉంది. అమెరికా వెన్న, జున్నుపై కెనడా సుమారు 300 శాతం సుంకాన్ని విధిస్తోంది' అని ఆమె మండిపడ్డారు. కాగా కెనడాపై డబుల్ సుంకాల వేసే విషయంలో అగ్రరాజ్యం అధినేత యూటర్న్ తీసుకున్నట్టు సమాచారం. 'ఇక భారత్ విషయానికి వస్తే అమెరికా ఆల్కహాల్‌పై 150 శాతం సుంకాన్ని వసూలు చేస్తోంది. మన కెంటుకీ బర్బన్ విస్కీని భారత్‌కు ఎగుమతి చేయడానికి ఇది దోహదపడుతుందని మీరు భావిస్తున్నారా? నేను అలా అనుకోవడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులపై కూడా భారత్ 100 శాతం సుంకం వేస్తోంది.

బియ్యం రవాణాపై జపాన్ ఏకంగా 700 శాతం సుంకాన్ని వసూలు చేస్తోంది' అని కరోలినా లీవెట్ తెలిపారు. లీవెట్ వద్ద ఉన్న ఛార్టులో కెనడా, భారత్, జపాన్ విధిస్తున్న సుంకాల సమాచారం ఉంది. ప్రతీకార సుంకాలు విధించాలని ట్రంప్ భావిస్తున్నారని ఆమె చెప్పారు. అమెరికా వ్యాపారులు, కార్మికుల ప్రయోజనాల గురించే ఆయన ఆలోచిస్తున్నారని అన్నారు.

## గాంధీ హత్యపై పాఠ్యాంశం అనవసరం



న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ హత్యపై పాఠ్యాంశం అవసరం లేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. గాంధీ ఎలా చనిపోయారో దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసునని, దానిని మళ్లీ మళ్లీ బోధించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. "గాంధీ హత్యను సిలబస్ నుంచి తొలగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ సంఘటనను 2005లో సిలబస్‌లో చేర్చారు. మీరు దాని గురించి ఆలోచిస్తే, వారు ఎందుకు అలా చేశారో మీకు అర్థమవుతుంది. గాంధీజీ ఎలా హత్యకు గురయ్యారో అందరికీ తెలుసు. దాన్ని మళ్ళీ ఒక సబ్జెక్ట్‌గా చేయడం సరైనదేనా?" అని అన్నారు. రాజ్యసభలో విద్యా మంత్రిత్వ శాఖ పని గురించి జరిగిన చర్చలకు ప్రతిస్పందనగా విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి ఈ వింతైన వివరణ వచ్చింది. దేశ సమగ్రతకు లేదా పాలక ప్రభుత్వానికి విరుద్ధమైనదేదీ సిలబస్‌లో ఉండదని విద్యా మంత్రి అన్నారు. హిందీ భాషను రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పటికీ ప్రయత్నించదని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. "భాషా వైవిధ్యాన్ని తిరస్కరించే వారు ఇటువంటి ఆరోపణలు చేస్తారు. ప్రభుత్వం షెడ్యూల్ చేయబడిన 22 భాషలనూ సమానంగా చూస్తుంది. భారత్ పుస్తక యోజన కింద 22 భాషల్లో 1,000 పాఠ్యపుస్తకాలను ప్రచురించాలని ప్రణాళిక చేశాం. దీన్ని ఏ భాషపైనా ఎలా రుద్దవచ్చో నాకు అర్థం కావడం లేదు. నేను భాష ఆధారంగా ఏర్పడిన మొదటి స్థితి నుండి వచ్చిన వ్యక్తిని. తన తల్లి తమిళనాడుకు చెందినది. నాకు కేరళ అంటే చాలా గౌరవం ఉంది. "నేను ఏ భాషను విస్మరించలేను" అని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. చర్చలో పాల్గొన్న సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విద్యారంగంతో సహా మితిమీరిన కేంద్రీకరణను అంతం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను గౌరవించడానికి సిద్ధంగా ఉండాలని, రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి వైవిధ్యాన్ని అంగీకరించాలని సూచించారు.

## 30 రోజుల కాల్పుల విరమణ!

### రష్యాతో తక్షణమే చర్చలు



జెడ్డా : రష్యాతో తక్షణమే చర్చలు జరిపేందుకు, అలాగే 30 రోజుల పాటు కాల్పుల విరమణకు అమెరికా చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ అంగీకరించింది. జెడ్డాలో మంగళవారం ఉక్రెయిన్, అమెరికా మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. వైట్‌హౌస్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ ఘర్షణ పడిన అనంతరం జరిగిన మొట్టమొదటి ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కీవ్‌కు మిలటరీ సాయాన్ని పునరుద్ధరించేందుకు అమెరికా అంగీకారం తెలిపింది. సాధ్యమైనంత త్వరలో ఉక్రెయిన్ ఖనిజాలపై కూడా ఒప్పందం కుదుర్చుకుందామని వారు భావించారు. ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తాము చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ అంగీకరించిందని, ఈ విషయాన్ని రష్యాకు కూడా తెలియచేస్తామని, వారు కూడా శాంతి స్థాపనకు అంగీకరిస్తారని భావిస్తున్నామని అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో చెప్పారు. అమెరికా ప్రతిపాదనను వెంటనే అమల్లోకి తీసుకురావడానికి ఉక్రెయిన్ సంసిద్ధతను వ్యక్తం చేసిందని ఆ ప్రకటన పేర్కొంది. కాల్పుల విరమణ అనేది రష్యా సమాఖ్య ఆమోదానికి, అమలుకు లోబడి వుంటుందని ప్రకటన పేర్కొంది. రష్యా స్పందనే ఇప్పుడు కీలకమని పేర్కొంది. జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ మాట్లాడుతూ, ఈ ప్రతిపాదనపై రష్యాతో తాను మాట్లాడనున్నట్లు చెప్పారు. యుద్ధాన్ని ఎలా ముగించాలన్నదే ఇప్పుడు ప్రశ్న అని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి నెలకొల్పేందుకు చేయగలిగినదంతా చేయడానికి తాము సిద్ధంగా వున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆండ్రీ యార్మార్క్ మంగళవారం సమావేశానికి ముందు విలేకర్లతో వ్యాఖ్యానించారు.

## మణిపూర్ రాష్ట్రపతి పాలనపై ప్రతిపక్షాల విమర్శలు

మణిపూర్‌ను రాష్ట్రపతి పాలన కిందకు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించాయి. మణిపూర్ అల్లకల్లోలంగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించలేదని, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రపతి పాలనను ప్రకటించిందని విమర్శించాయి. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించలేని ప్రభుత్వానికి ఆ రాష్ట్రాన్ని పరిపాలించే హక్కు లేదని మణిపూర్ ఎంపీ ఆల్ఫ్రెడ్ కంగామ్ స్పష్టం చేశారు. మణిపూర్‌ను కేంద్రం, రాష్ట్రం కలిసి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నాశనం చేసిందని టీఎంసీ ఎంపీ సయోని ఘోష్ ఆరోపించారు. మణిపూర్‌ను తుపాకీతో పట్టుకుని శాంతిని పునరుద్ధరించవచ్చనే భ్రమకు వ్యతిరేకంగా అస్సాంకు చెందిన గౌరవ్ గొగోరు హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కనీసం ఒక్కసారైనా రాష్ట్రాన్ని సందర్శిస్తారని మణిపూర్ ప్రజలు ఇప్పటికీ ఆశిస్తున్నారని అన్నారు. పార్లమెంటులో ఏవైనా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడల్లా 'అదృశ్యం' కావడం అలవాటుగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. ప్రధానమంత్రి పట్ల తనకు అత్యంత గౌరవం ఉందని, అయితే ట్రెజరీ బెంచ్‌లు మాజీ ప్రధానులను పదే పదే 'అవమానించడం' అలవాటు చేసుకున్నాయని, అయినప్పటికీ వారి ప్రకటనలు ఎల్లప్పుడూ పార్లమెంటరీ రికార్డులో భాగంగానే ఉన్నాయని గొగోరు విమర్శించారు. గొగోరు కొన్ని "చాలా లోతైన" వ్యాఖ్యలు చేశారని కేంద్ర మంత్రి సీతారామన్ అన్నారు. ప్రధాని మోడీని సభలో మాట్లాడటానికి కూడా అనుమతించని సందర్భాలు చాలా ఉన్నాయని అన్నారు. అంతేకాకా చాలా సార్లు ప్రధాని మోడీని దుర్భాషలాడారని అన్నారు. దీనికి గొగోరు స్పందిస్తూ గత సమావేశంలో ప్రధానమంత్రి ప్రసంగాన్ని చదవమని గొగోరు ఆర్థిక మంత్రిని కోరారు. "ఆయన ప్రసంగం మొత్తం మాజీ ప్రధానులను దుర్భాషలాడుతూ ఉంది. ఎదుటవారివైపు వేలు చూపించే ముందు, మూడు వేళ్లు మనవైపు ఉంటాయని చూసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోండి" అని ధ్వజమెత్తారు.



## మమత బెనర్జీ యుకె పర్యటనకు కేంద్రం సమ్మతి

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఒక ఉపన్యాసం ఇవ్వడానికి ఈ నెల మూడవ వారంలో లండన్‌కు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రతిపాదిత పర్యటనను కేంద్రం బుధవారం ఆమోదించిందని రాష్ట్ర సచివాలయం నబన్నలో ఒక ప్రతినిధి వెల్లడించారు. మమతా బెనర్జీ ఈ నెల 21న లండన్‌కు బయలుదేరవలసి ఉందని, ఆమె 27న ఉపన్యాసం ఇవ్వవలసి ఉందని ఆ ప్రతినిధి తెలియజేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రొ వైస్ చాన్సలర్ జోనాథన్ మిచీ 2023 నవంబర్‌లో బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ కోసం కోల్‌కతాలో ఉన్నప్పుడు మమతను ఆహ్వానించారు. లండన్‌కు మమత విమానం 21న దుబాయి మీదుగా వెళ్లనున్నది. కాగా, మమతా బెనర్జీ యుకెను సందర్శించడం ఇది రెండవ సారి. 2017 నవంబర్‌లో ఆమె ఎడిన్‌బరోలో ఆసియా స్కాట్లాండ్ ఇన్‌స్టిట్యూట్, ఎడింబరో వాణిజ్య మండలి మద్దతుతో స్కాటిష్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ నిర్వహించిన వాణిజ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. మమత 29న కోల్‌కతాకు తిరిగిరావలసి ఉంది.

## సునీతా విలియమ్స్ రాక ఆలస్యం

ఫ్లోరిడా : మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లను భూమిపైకి తిరిగి తీసుకొచ్చేందుకు నాసా–స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ 10 మిషన్ వాయిదా పడింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో అమెరికాలోని ఫ్లోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరేందుకు క్రూ 10 మిషన్ ప్రయోగం నిలిచిపోయింది

. హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య ఉత్పన్నం కావడంతో దీన్ని ఆపేసినట్లు నాసా పేర్కొంది. సమస్యను పరిష్కరించి ఈ వారంలో మరో ప్రయోగం చేయనున్నట్లు తెలిపింది. దీంతో వ్యోమగాముల రాక మరికొన్ని రోజులు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది.



కాగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు దాదాపు తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయిన విషయం తెలిసిందే.

## కాల్పుల విరమణకు జెలెన్‌స్కీ అంగీకారం ..

రష్యా–ఉక్రెయిన్ మధ్య మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి ఉక్రెయిన్ అంగీకరించింది. జెడ్డాలోని ఒర్నాట్ హొటల్‌లో దాదాపు 9 గంటలపాటు జరిగిన చర్చల అనంతరం ఈ ప్రతిపాదనకు కీవ్ ఆమోదం తెలిపింది. ఉక్రెయిన్‌కు మిలటరీ సాయం నిలిపివేస్తున్నట్లు ఇటీవల ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా దానిని పునరుద్ధరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కాల్పుల విరమణకు కీవ్‌పై ట్రంప్ తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చిన నేపథ్యంలో ఉక్రెయిన్ దిగొచ్చింది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అధికారులు సౌదీ అరేబియాలో చర్చలకు మొగ్గు చూపడం ద్వారా రాజీకి ఆసక్తి కనబరిచారు. వైమానిక, సముద్ర దాడులపై పాక్షిక సంధిని ప్రతిపాదించారు. వేలాదిమందిని బలిగొన్న యుద్ధానికి నెల రోజుల పాటు ఫుల్ స్టాప్ పెట్టాలన్న ప్రతిపాదనకు కీవ్ అంగీకరించినట్లు ట్రంప్ యంత్రాంగం తెలిపింది. మేమొక ఆఫర్‌ను తీసుకొచ్చాం. ఉక్రెయిన్ అందుకు అంగీకరించింది. కాల్పుల విరమణ పాటించడంతోపాటు తక్షణ చర్యలకు ముందుకొచ్చింది అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. చర్చలకు ఉక్రెయిన్ దిగొచ్చిన నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా దీనికి అంగీకరిస్తారని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## 33 మంది హైజాకర్లను మట్టుబెట్టిన ఆర్మీ..

పాకిస్థాన్ రైలు హైజాక్ ఘటనలో ఆర్మీ ఆపరేషన్ విజయవంతమైంది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 33 మంది బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) మిలిటెంట్లు హతమయ్యారు. అలాగే, 21 మంది ప్రయాణికులు, నలుగురు పారామిలిటరీ సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారనిఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు బలూచిస్థాన్ ప్రావిన్సులోని క్వెట్టా నుంచి ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు వెళ్తుండగా మొన్న బీఎల్‌ఏ మిలిటెంట్లు హైజాక్ చేశారు. రైలులోని 9 బోగీల్లో ఉన్న 440 మందిని వారు బందీలుగా చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ విజయవంతంగా ఆపరేషన్‌ను ముగించి రైలును తిరిగి తమ నియంత్రణలోకి తెచ్చుకుంది. మంగళవారం సాయంత్రానికి 100 మంది ప్రయాణికులను రక్షించిన భద్రతా బలగాలు, నిన్న మిగతా ప్రయాణికులను రక్షించినట్లు తెలిపారు.

## నేపాల్‌లో రాచరికానికి మద్దతుగా ర్యాలీ

నేపాల్‌లో రాచరికానికి మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చిత్రాలను ప్రదర్శించారు. యోగి నేపాల్‌లో రాచరికానికి బలమైన మద్దతుదారు కావడమే ఇందుకు కారణం. నేపాల్ మాజీ రాజు జ్ఞానేంద్ర షాతో యోగికి మంచి సంబంధాలు ఉన్నాయి. ఇటీవల భారత్‌లో పర్యటించి జ్ఞానేంద్ర షా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. నేపాల్‌లో రాచరికానికి మద్దతు ఇచ్చే రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ భారీ ర్యాలీ నిర్వహించింది. నేపాల్‌లో రాచరిక పాలను పునరుద్ధరించాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమయంలో జ్ఞానేంద్ర షాతో పాటు యోగి ఆదిత్యనాథ్ చిత్రాలను ప్రదర్శించారు. ఇతర దేశాల నేతల చిత్రపటాలను ప్రదర్శించడంపై విమర్శలు రావడంతో రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ ప్రతినిధి వివరణ ఇచ్చారు. తమ ఉద్యమానికి చెడ్డ పేరు తీసుకురావడానికి ప్రధాని కెపి ఓలి వర్గం ఈ ర్యాలీలో యోగి ఆదిత్యనాథ్ ఫోటోలను ప్రదర్శించిందని ఆయన ఆరోపించారు. ప్రధాని ఓలి ముఖ్య సలహాదారు సూచనల మేరకు యోగి చిత్రాన్ని ప్రదర్శించారని ఆ ప్రతినిధి తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను ప్రధాని ఓలి ముఖ్య సలహాదారు బిష్ణు రిమాల్ ఖండించారు.

# చక్కని ఆరోగ్యం



## నేరేడు పండ్లు వీరికి డేంజర్..

చాలా మంది నేరేడు పండు యొక్క ప్రయోజనాల గురించి తెలుసుకునే ఉంటారు. అందుకే మార్కెట్లో ఎక్కడ కనిపించినా వీటిని సీజనల్ ఫ్రూట్ కాబట్టి కొని తెచ్చుకుంటారు. అయితే దీనిని మితంగా తింటే ఎంత ఆరోగ్యమో అతిగా తింటే అంత ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆయుర్వేదం ప్రకారం, ఏదైనా ఔషధ రూపంలో మాత్రమే తీసుకోవాలి. అంటే పరిమిత పరిమాణంలో. కొన్నిసార్లు అధిక వినియోగం అనేక ఇతర వ్యాధులకు కారణమవుతుంది. ఇండియన్ బ్లాక్‌బెర్రీ, నేరేడు పండు లేదా జామున్ అనే ఈ పండు వేసవి కాలంలో ఎక్కువగా లభిస్తుంది. దీన్నే జావా ప్లం అని కూడా పిలుస్తారు. ఇది ఔషధ గుణాలతో సమృద్ధిగా ఉంటుంది మరియు అనేక వ్యాధులను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతో పాటు, ఈ పండు తినడం వల్ల లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఇది శరీరంలో రక్త లోపాన్ని నయం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి కూడా ఉత్తమ ఔషధం. నేరేడే పండ్లు, ఆకులతోపాటు దీని గుజ్జు అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. అవి ఆరోగ్యానికి మంచివి అయినప్పటికీ, కొన్నిసార్లు వీటిని తినడం హానికరం అని రుజువైంది. సాధారణంగా, ఆయుర్వేదం ప్రకారం, అధిక రక్తపోటు ఉన్న రోగులకు నేరేడు పండు వినియోగం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జామున్ పండు లేదా గుజ్జు పొడిని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా దీనిని సులభంగా నియంత్రించవచ్చు. కానీ చాలా మంది దీనిని నియంత్రించడానికి ఎక్కువగా తినడం ప్రారంభిస్తారు, దీనివల్ల తక్కువ లోబీపీ సమస్య ఏర్పడవచ్చు. నేరేడు పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు దానిని అధికంగా తీసుకుంటే, మీకు మలబద్ధకం సమస్య ఉండవచ్చు. నేరేడు పండ్లు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే శక్తిని కలిగి ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు వీటిని అధికంగా తినకూడదు. ఇవి ఎక్కువగా తింటే రక్తంలో షుగర్ లెవెల్స్ ప్రమాదకరంగా తగ్గిపోవచ్చు. మీరు బెర్రీలు ఎక్కువగా తీసుకుంటే అది మీ చర్మానికి సమస్యలను కలిగిస్తుంది. మొటిమలు మరింత ఎక్కువకావచ్చు. నేరేడు పండ్లు తిన్న తర్వాత చాలా మందికి వాంతులు అవుతాయి. మీకు కూడా అలాంటి సమస్య ఉంటే, దానిని తినకపోవడమే మంచిది.

## ఆ రోగులకు శుభవార్త చెప్పిన సైంటిస్టులు..



హెచ్ఐవి నుండి రక్షించడానికి వార్షిక ఇంజెక్షన్ సురక్షితమైనది మరియు దీర్ఘకాలిక ప్రభావాలతో నివారణ పద్ధతిగా ఆశాజనకంగా ఉందని ది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించబడిన క్లినికల్ ట్రయల్ ఫలితాల ప్రకారం. 'లెనాకాపావిర్' ను యూఎస్ లోని పరిశోధన-ఆధారిత బయోఫార్మాస్యూటికల్ కంపెనీ గిలియడ్ సైన్సెస్ అభివృద్ధి చేసింది, హెచ్ఐవి కి గురయ్యే ప్రమాదం ఉన్న వ్యక్తులలో ఇన్ఫెక్షన్‌ను నివారించడానికి ప్రీ-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఆర్ఈపీ) ఔషధంగా దీనిని అభివృద్ధి చేసింది. దీనిని కండరాల కణజాలంలోకి ఇంజెక్షన్‌గా ఇస్తారు. మానవ కణాలలోకి హెచ్ఐవి ప్రవేశించకుండా, పెరగకుండా నిరోధించడం ద్వారా ఈ ఔషధం పనిచేస్తుంది. ఫేజ్ 1 యాదృచ్ఛిక నియంత్రిత ట్రయల్ ప్రకారం, కనీసం 56 వారాల పాటు శరీరంలో ఉంటుంది. ఫేజ్ 1 ట్రయల్స్ 20-100 మంది ఆరోగ్యకరమైన వాలంటీర్ల సమూహంలో కొత్త ఔషధం ఎలా పనిచేస్తుంది అనేవిషయాన్ని అంచనా వేశారు. హెచ్ఐవి లేదా హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్, తెల్ల రక్త కణాలను లక్ష్యంగా చేసుకుని ఒక వ్యక్తి యొక్క రోగనిరోధక వ్యవస్థను దాడి చేసి బలహీనపరుస్తుంది. అక్వైర్డ్ ఇమ్యునో డెఫిషియెన్సీ సిండ్రోమ్ (ఎయిడ్స్) హెచ్ఐవి సంక్రమణ యొక్క అత్యంత అధునాతన దశలో సంభవిస్తుంది. ప్రస్తుతం, హెచ్ఐవి/ఎయిడ్స్ కు ఆమోదించబడిన చికిత్స లేదా వ్యాక్సిన్ ఇప్పటివరకు లేదు. ఈ విచారణలో 18-55 సంవత్సరాల వయస్సు గల 40 మంది పాల్గొన్నారు, వీరికి హెచ్ఐవి లేదు. ఈ ఔషధం రెండు డోసులు తయారు చేశారు. ఒకటి 5 శాతం ఇథనాల్ మరియు మరొకటి 10 శాతంతో. పాల్గొన్న వారిలో సగం మందికి మొదటి డోసు, మిగిలిన సగం మందికి రెండవది ఇచ్చారు. ఈ ఔషధాన్ని 5000 మిల్లీగ్రాముల మోతాదులో ఒకే మోతాదులో ఇచ్చారు. 56 వారాల వరకు సేకరించిన నమూనాలను భద్రత మరియు ఔషధ ప్రవర్తనను అంచనా వేయడానికి విశ్లేషించారు.

రెండు సూత్రీకరణలు "సురక్షితమైనవి మరియు బాగా తట్టుకోగలవి" అని కనుగొనబడ్డాయి. ఇంజెక్షన్ సైట్ వద్ద నొప్పి అత్యంత సాధారణ ప్రతికూల సంఘటన, ఇది సాధారణంగా తేలికపాటిది, ఒక వారంలోనే పరిష్కరించబడుతుంది మరియు మంచుతో ముందస్తు చికిత్స ద్వారా గణనీయంగా తగ్గిందని రచయితలు నివేదించారు. ఇంకా, 56 వారాల వ్యవధి తర్వాత, పాల్గొనేవారిలో లెనాకాపావిర్ స్థాయిలు వేరే లెనాకాపావిర్ ఇంజెక్షన్ యొక్క దశ 3 ట్రయల్స్‌లో ఉన్న స్థాయిలను మించిపోయాయి, ఇది సంవత్సరానికి రెండుసార్లు చర్మం కింద మరియు కండరాల కణజాలం పైన ఇస్తారు. జూలై 2024లో ది న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించబడిన దశ 3 ట్రయల్స్ ఫలితాలు, సంవత్సరానికి రెండుసార్లు సబ్కటానియస్ ఇంజెక్షన్ సురక్షితమైనదని మరియు అత్యంత ప్రభావవంతమైనదని చూపించాయి. అయితే, దీనిపై మరింత డేటా అవసరమని అధ్యయనాలు తెలిపాయి.

## టూత్ బ్రష్ విషయంలో ఈ తప్పులు చేయకండి..!

టూత్ బ్రష్ ప్రతి ఒక్కరి దంతాల శుభ్రతలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. కానీ దీన్ని ఉపయోగించిన తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనేక ఆరోగ్య సమస్యలు రావచ్చు. ముఖ్యంగా టూత్ బ్రష్‌ను బాత్రూంలో ఉంచడం వల్ల ఇది హానికరమైన క్రిములతో నిండిపోతుంది. టూత్ బ్రష్‌ను ఎలా ఉపయోగించాలి..? దాన్ని ఎలా శుభ్రం చేయాలి..? ఇవన్నీ తెలుసుకుంటే అనారోగ్య సమస్యలను



దూరంగా ఉంచుకోవచ్చు. చాలా మంది టూత్ బ్రష్‌ను బ్రష్ చేసిన తర్వాత బాత్రూంలోనే ఉంచేస్తుంటారు. కానీ అక్కడ తేమ అధికంగా ఉండటం వల్ల బ్యాక్టీరియా, ఫంగస్, ఇతర సూక్ష్మజీవులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బాత్రూంలో గాలిచలనం తక్కువగా ఉండడం కూడా దీనిని మరింత ప్రమాదకరంగా మారుస్తుంది. ఇలా కలుషితమైన టూత్ బ్రష్‌ను ఉపయోగించడం వల్ల నోటిలో హానికరమైన క్రిములు చేరి పలు ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. దంత వైద్యుల సూచనల ప్రకారం టూత్ బ్రష్‌ను సరైన రీతిలో శుభ్రం చేయకపోతే నోటిలో క్రిములు పెరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి. టూత్ బ్రష్‌ను ఎక్కువ రోజులు వాడటం కూడా దంతాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒక టూత్ బ్రష్‌ను 3-4 నెలలకు మించకుండా మార్చాలి. అలాగే దీన్ని తేమలేని ప్రదేశంలో, గాలిచలనం ఉండే విధంగా ఉంచాలి. ఒకే టూత్ బ్రష్‌ను ఎక్కువ రోజుల పాటు ఉపయోగించడం వల్ల నోటిలో హానికరమైన బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. ఇది గమ్ ఇన్ఫెక్షన్, దంతక్షయం, దుర్వాసన వంటి సమస్యలకు దారి తీస్తుంది. నోటికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు బ్లడ్‌స్ట్రీమ్‌లోకి వెళ్లి ఇతర ఆరోగ్య సమస్యలను కూడా కలిగించవచ్చు. టూత్ బ్రష్‌ను శుభ్రంగా ఉంచడానికి కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ టూత్ బ్రష్‌ను బాగా నీటితో శుభ్రం చేసి గాలికి ఆరనివ్వాలి. అలాగే టూత్ బ్రష్‌ను గాలి చొరబడే ప్రదేశంలో ఉంచాలి. బ్రష్‌ను ఇతర కుటుంబ సభ్యుల టూత్ బ్రష్‌లకు దగ్గరగా పెట్టకుండా చూడాలి. ప్రతి 3-4 నెలలకు టూత్ బ్రష్‌ను మార్చడం ద్వారా క్రిములను దూరంగా ఉంచుకోవచ్చు. మౌత్ వాష్‌లో టూత్ బ్రష్‌ను కొన్ని నిమిషాలు నానబెట్టి శుభ్రం చేయడం మంచిది. ఎక్కువగా తేమ ఉన్న ప్రదేశాల్లో టూత్ బ్రష్‌ను ఉంచితే బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. టూత్ బ్రష్‌ను శుభ్రం చేయడానికి కొన్ని శాస్త్రీయ పద్ధతులు ఉన్నాయి. UV లైట్ శానిటైజర్‌ను ఉపయోగించడం వల్ల టూత్ బ్రష్‌లోని బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్‌లను పూర్తిగా తొలగించవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపితమైన అత్యుత్తమ శుభ్రతా విధానం. మరొక సాధారణమైన పద్ధతి యాంటీ బాక్టీరియల్ మౌత్ వాష్‌లో టూత్ బ్రష్‌ను కొన్ని నిమిషాలు నానబెట్టడం. ఇది టూత్ బ్రష్‌లో ఉన్న సూక్ష్మజీవులను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇంకొక సాధారణ శుభ్రపరిచే విధానం మరిగిన నీటిలో టూత్ బ్రష్‌ను కొన్ని నిమిషాలు ఉంచడం. ఇది బ్యాక్టీరియాను నాశనం చేయడంలో సహాయపడుతుంది. అయితే పదే పదే ఇలా చేయడం వల్ల టూత్ బ్రష్ బ్రిస్టల్స్ త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. బేకింగ్ సోడా లేదా హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉపయోగించి టూత్ బ్రష్‌ను శుభ్రం చేయడం కూడా సమర్థవంతమైన పరిష్కారం.

## కార్లలో వాటర్ బాటిల్స్ ఉంచే అలవాటు ఉందా?

శరీరానికి సరైన మొత్తంలో నీరు అందకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. చాలా మంది ప్రయాణాల్లో, ఇతర బిజీగా ఉండే రోజుల్లో నీరు తాగడం మర్చిపోతుంటారు. కానీ ఇది మంచి పద్ధతి కాదు. కార్లు ఉన్నవారు కూడా ప్రయాణంలో దాహం వేసినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లలోని నీళ్లు తాగుతుంటారు. కొంతమందికి కారులో నీళ్లను ఎంత కాలం క్రితం పెట్టారో కూడా గుర్తు ఉండదు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారం ఎంత ముఖ్యమో, నీరు కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా ఈ వేసవి వేడి వాతావరణంలో నీరు ఎంత త్రాగినా సరిపోదు. శరీరానికి సరైన మొత్తంలో నీరు అందకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. చాలా మంది ప్రయాణాల్లో, ఇతర బిజీగా ఉండే రోజుల్లో నీరు



తాగడం మర్చిపోతుంటారు. కానీ ఇది మంచి పద్ధతి కాదు. కార్లు ఉన్నవారు కూడా ప్రయాణంలో దాహం వేసినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లలోని నీళ్లు తాగుతుంటారు. కొంతమందికి కారులో నీళ్లను ఎంత కాలం క్రితం పెట్టారో కూడా గుర్తు ఉండదు. అయితే ఇలా కార్లలో ఉంచిన నీటిని తాగడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ నీటిలో ఏముంది? అది ఏమిటి? ఆహారం లాగే నీరు కూడా చెడిపోతుందా అనే ప్రశ్నలు మీకు తలెత్తవచ్చు. ఇది అంత పెద్ద విషయంగా అనిపించకపోయినా ఈ అలవాటును కొనసాగిస్తే మాత్రం మీ ఆరోగ్యం త్వరలోనే ప్రమాదంలో పడుతుంది. కారులో నీళ్లు ఉంచితే వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ 24 గంటల తర్వాత తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో ఇలాంటి తప్పులు చేయకూడదు. వాతావరణంలోని వేడి కారణంగా కారులో ప్లాస్టిక్ బాటిల్‌ను ఎక్కువసేపు ఉంచితే, రసాయనాలు నీటిలోకి లీకీ అవుతాయి. ఇది నీటిని కలుషితం చేస్తుంది. కాబట్టి దాహం వేసినప్పుడు తాగడం మన ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా పాత ప్లాస్టిక్ బాటిళ్లు అధిక ఉష్ణోగ్రతల వద్ద థాలేట్స్, బిస్ఫినాల్-ఎ వంటి రసాయనాలను విడుదల చేసే అవకాశం ఉంది. కాబట్టి కారులో ఎక్కువసేపు రోజులు నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. టెక్సాస్ విశ్వవిద్యాలయంలోని టైలర్‌లో నిర్వహించిన మరో అధ్యయనంలో వేడి వాతావరణంలో ఒకటి లేదా రెండు రోజులు కారులో ఉంచిన నీరు తాగడం వల్ల ప్రమాదం పెరుగుతుందని నిర్ధారించారు. ఈ ప్రమాదాలను నివారించడానికి ప్లాస్టిక్ బాటిల్ వాటర్‌ను వేడి వాతావరణంలో ఎక్కువసేపు నిల్వ చేయకూడదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ రకమైన అలవాటు జీర్ణ సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, రుగ్మతలు, క్యాన్సర్ ప్రమాదం వంటి వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఆపిల్ సైడర్ వెనిగర్ వాడుతున్నారా..?

ఆపిల్ సైడర్ వెనిగర్ ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు కలిగి ఉంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు దీన్ని బ్లడ్ షుగర్ నియంత్రణ కోసం ఉపయోగించాలనుకుంటారు. అయితే మధుమేహం మందులతో కలిపి వాడినప్పుడు కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం ఉంది. ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించే ముందు దాని ప్రయోజనాలు, దుష్ప్రభావాలు, సరైన మోతాదు గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఆపిల్ సైడర్ వెనిగర్ అనేది యాపిల్ పండ్ల నుండి తయారు చేసిన ఒక రకమైన వెనిగర్.

ఆపిల్ సైడర్ వెనిగర్ అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్నప్పటికీ.. మధుమేహాన్ని పూర్తిగా నియంత్రించడానికి సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, డాక్టర్ పర్యవేక్షణ చాలా అవసరం. ఆపిల్ సైడర్ వెనిగర్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. దీని వల్ల మధుమేహం ఉన్నవారు ఆపిల్ సైడర్ వెనిగర్ వాడటానికి ఆసక్తి చూపుతారు. కానీ మధుమేహం మందులతో కలిపి వాడితే సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్తగా వాడాలి. ఆపిల్ రసాన్ని పులియబెట్టి ఆపిల్ సైడర్ వెనిగర్ తయారు చేస్తారు. పులియబెట్టడం వల్ల ఆపిల్ రసంలోని చక్కెర ఆల్కహాల్ గా మారుతుంది. తర్వాత ఆల్కహాల్ ఎసిటిక్ యాసిడ్ గా మారుతుంది. ఎసిటిక్ యాసిడ్ వెనిగర్ లో ముఖ్యమైన భాగం. ఆపిల్ సైడర్ వెనిగర్ లో ఖనిజాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.

ఆపిల్ సైడర్ వెనిగర్ ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుందని, భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరగకుండా చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ ఇన్సులిన్ లేదా మధుమేహం మందులతో కలిపి ఆపిల్ సైడర్ వెనిగర్ వాడితే రక్తంలో చక్కెర స్థాయిలు బాగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల తల తిరగడం, మూర్ఛ వంటి సమస్యలు వస్తాయి. ఎక్కువ ఆపిల్ సైడర్ వెనిగర్ తీసుకుంటే వికారం, జీర్ణ సమస్యలు వస్తాయి. ఆపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించే విధానాన్ని ప్రభావితం చేయొచ్చు.

## మూత్రం మూత్రపిండాల ఆరోగ్యాన్ని చెబుతుందని తెలుసా..!




సాధారణం మనకు జ్వరం వచ్చినప్పుడు లేదా ఏదైనా ఆరోగ్య సమస్యకు రకరకాల మెడిసిన్స్ తీసుకునే సమయంలో మూత్రం పసుపు రంగులోకి మారుతుంది. కొన్నిసార్లు మనం తినే ఆహారాన్ని బట్టి రంగు కూడా మారుతుంది. ఇది ఒక సాధారణ విషయం. అయితే కొన్ని సందర్భాల్లో మూత్రం ఎరుపు, తెలుపు, ముదురు పసుపు రంగులలో కనిపిస్తుంది. ఇలా మూత్రం రంగు మారడానికి బలమైన కారణాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. మరి మంచి మూత్రం ఏ రంగులో ఉంటుంది? మన ఆరోగ్యం ఎలా ఉందో మనం అనేక విధాలుగా తెలుసుకోవచ్చు. మన శారీరక ఆరోగ్య సమస్య గురించి మనకు తెలియజేసేందుకు శరీరం మనకు అనేక రకాల హెచ్చరికలను జారీ చేస్తుంది. వాటిలో మూత్రం ఒకటి. సాధారణంగా మన శరీరం పనితీరు అనేక ఆరోగ్య సమస్యల గురించి వెల్లడిస్తుంది. నోటి ద్వారా తినే ఆహారంలో ఉండే విషాన్ని తొలగించే పనిని మూత్రపిండాలు చేస్తాయి. అందుకే మూత్రపిండాల ఆరోగ్యాన్ని సరిగ్గా ఉంచుకోవాలి. మూత్రపిండాలు దెబ్బతిన్నట్లయితే.. ఈ సమస్య నుంచి బయటపడటం అంత సులభం కాదు. సాధారణంగా లేత పసుపు రంగులో మూత్రం ఉంటుంది.. అయితే కొన్ని సందర్భాల్లో, మూత్రం ఎరుపు, తెలుపు, ముదురు పసుపు రంగులలో కనిపిస్తుంది. ఇలా మూత్రం రంగు మరెందుకు బలమైన కారణాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. కొన్నిసార్లు.. బీట్‌రూట్ వంటి ఆహార పదార్థాలను తినేటప్పుడు మూత్రం ఎర్రగా మారుతుంది. అయితే కొన్ని సందర్భాల్లో మూత్రం ఎరుపు రంగులో ఉంటే.. అది మీ మూత్రపిండాల వ్యాధిని గురించి హెచ్చరిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు లేదా ఇతర సమస్యలు ఉన్నప్పుడు మాత్రమే మూత్రం రక్తం రంగులోకి మారుతుంది. అందుకే ఈ లక్షణాలు కనిపించినప్పుడు.. నిర్లక్ష్యం చేయకుండా వాటిని తీవ్రమైన ఆరోగ్య సమస్యగా పరిగణించి వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

మూత్రం సహజ రంగు లేత పసుపు. అయితే ముదురు పసుపు, నారింజ రంగు మూత్రం మీ శరీరానికి ఎక్కువ నీరు అవసరమని సూచిస్తుంది. అధిక పని ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, వేడి ప్రదేశాల్లో ఎక్కువ సమయం గడపడం వల్ల డీహైడ్రేషన్ వస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి.



# సినిమా



## ఊహించనంత వేగంగా అఖిల్ సినిమా

ఏడాదిన్నర పాటు అభిమానులను వెయిటింగ్‌లో ఉంచిన అఖిల్ కొత్త సినిమా కొన్ని వారాల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. వినరో భాగ్యము విష్ణు కథ ఫేమ్ మురళికిషోర్ అబ్బురు దర్శకత్వంలో రూపొందే ఈ ప్యాన్ ఇండియా మూవీకి లెనిన్ పేరుని ఖరారు చేశారు. అయితే ఫ్యాన్స్ భావించినట్టు ఇది వచ్చే సంవత్సరం దాకా ఎదురు చూసే అవసరం లేని ఇన్ సైడ్ టాక్. ఎల్లుండి నుంచి మొదలుపెట్టబోయే షెడ్యూల్ ని ఏకధాటిగా 20 రోజుల పాటు కొనసాగించి 50 శాతం షూటింగ్ పూర్తి చేస్తారని తెలిసింది. విదేశాలకు వెళ్లే అవసరం లేకుండా వీలైనంత అధిక శాతం తెలుగు రాష్ట్రాల్లోనే చిత్రీకరణ జరపనున్నారట. ఇప్పుడు వేసుకున్న ప్లానింగ్ ప్రకారం అయితే లెనిన్ 2025 దసరా బరిలో దింపొచ్చు. ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వనప్పటికీ ఆ దిశగానే ప్రణాళిక వేసుకున్నట్టు తెలిసింది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ యాక్షన్ డ్రామా రాయలసీమ నేపథ్యంలో ఉంటుందనే టాక్ ఉంది కానీ ఇంకా నిర్ధారణగా తెలియాల్సి ఉంది. ఇందులో విలన్ గా స్కామ్ 1992 ఫేమ్ ప్రతీక్ గాంధీ నటిస్తారనే ప్రచారం ఉన్నా ఇంకా కన్ఫర్మ్ కాలేదు. తమిళ నటుడు విక్రాంత్ కూడా లిస్టులో ఉన్నాడు. మంచి ఎమోషన్ తో కూడిన లవ్ స్టోరీ ఇందులో ఉంటుందని, అఖిల్ ఇప్పటిదాకా టచ్ చేయని విభిన్నమైన జానరని అంటున్నారు. వినడానికి బాగానే ఉంది కానీ దసరాకి పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో లెనిన్ ఎంత మేరకు రాగలడనేది వెంటనే చెప్పలేం. ఎందుకంటే సెప్టెంబర్ చివరి వారంలో అఖండ 2 తాండవం, సంబరాల ఏటిగట్టు ఒకేరోజు వస్తాయి. అక్టోబర్ 2 కాంతార చాప్టర్ 1 ఆల్రెడీ లాక్ చేసుకుంది.







## మనసు దోచేసిన కిరణ్

ఇవ్వటంలో ఉండే ఆనందం అందరికి అర్థం కాదు. నలుగురికి సాయం చేసే ఛాన్సు దొరికితే కొందరు మాత్రమే ఆ దిశగా ఆలోచిస్తారు. ఇప్పుడు అలాంటి ఆలోచనను బయటపెట్టిన వర్ధమాన నటుడు కిరణ్ అబ్బవరం అందరి మనసు దోచేశారని చెప్పాలి. తనకు పేరు ప్రఖ్యాతుల్ని ఇచ్చిన ఇండస్ట్రీకి తన వంతుగా ఏమైనా చేయాలన్న తపనకు నిలువెత్తు రూపంగా నిలుస్తుంది తాజాగా ఆయన చెప్పిన మాట.'క' మూవీతో సక్సెస్ కొట్టేసిన కిరణ్ అబ్బరం తాజా మూవీ 'దిల్ రూబా'. ఈ శుక్రవారం విడుదలయ్యే ఈ మూవీని ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్ తాజాగా జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన వ్యాఖ్యలు ఆయన మీద అందరి చూపు పడేలా చేసిందని చెప్పాలి.సినిమాలలో ఛాన్సు రావటం చాలా కష్టమని..ఇండస్ట్రీకి వెళ్తానంటే ఇంట్లో వాళ్లు కూడా ఒప్పుకోరని చెప్పారు. సినిమాల మీద ఎవరికి నమ్మకం ఉండదని.. ఇండస్ట్రీకి వచ్చి స్థిరపడాలని వచ్చి.. అవకాశాల్లేక తిరిగి వెళ్లే ఎందరినో తాను చూసినట్లు చెప్పారు. తాను పరిశ్రమలో స్థిరపడితే.. అవకాశాల కోసం వచ్చే వారికి సాయం చేయాలని తాను ఎప్పటి నుంచో అనుకున్నట్లు చెప్పిన కిరణ్ అబ్బవరం.. 'ఈ రోజు అభిమానుల దయతో నాకంటూ ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అందుకే సినిమా మీద ప్రేమతో ఇండస్ట్రీకి వచ్చి ఆర్థికంగా ఇబ్బందులు పడే 10 మందికి సాయం చేయాలని డిసైడ్ అయ్యా. ప్రతి ఏటా అలాంటి పది మందికి అన్ని వసతులు సమకూరేలా చేస్తా. ఫ్యూచర్ లో మరింత ఎదిగితే 100 మందిని అయినా చూసుకోవటానికి సిద్ధంగా ఉన్నా. ఇది నా బాధ్యతగా భావిస్తున్నా' అని వ్యాఖ్యానించారు.

## ప్యాన్ ఇండియా మూవీకి ఇన్ని చిక్కులా

సలార్ విలన్ పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా నిర్మించిన ఎల్2 ఎంపురాన్ (లూసిఫర్ సీక్వెల్) కు సంబంధించి ఇప్పటిదాకా ప్రమోషన్లు ఊపందుకోకపోవడం అభిమానులను టెన్షన్ కు గురి చేస్తోంది. ఇతర భాషల సంగతేమోవా కానీ మళయాలంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండటం చూసి ఖంగారు పడుతున్నారు. ఎస్ఎస్ఎంబి 29 షూటింగ్ కోసం మహేష్ బాబు, రాజమౌళితో బిజీగా ఉన్న పృథ్విరాజ్ వీటిని పట్టించుకునే స్టేజిలో లేకపోవడంతో నిర్మాణ సంస్థ మీదే ఒత్తిడి ఉంది. మల్లువుడ్ టాక్ ప్రకారం ఎల్2 పబ్లిసిటీ ఇంకా మొదలుకాకపోవడానికి కారణం బిజినెస్ డీల్సేనట. ఇప్పటిదాకా ఓటిటి




ఒప్పందం జరగలేదని, నిర్మాత అడుగుతున్న దానికి డిజిటల్ కంపెనీలు ఆఫర్ చేస్తున్న మొత్తానికి చాలా వ్యత్యాసం ఉండటం వల్లే పెండింగ్ లో ఉంచారని అంటున్నారు. పైగా లైకా ప్రొడక్షన్ కావడంతో లాల్ సలామ్, ఇండియన్ 2, విడాముయార్చికి సంబంధించిన నష్టాల లావాదేవీలు పెండింగ్ లో ఉన్నాయట. దీంతో బయ్యర్ల నుంచి సహకారం సరిగా లేకపోవడంతో థియేటర్ అగ్రిమెంట్లలో ఆలస్యమవుతోందని తెలిసింది. ఈ జాప్యం వల్ల తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణలో అధిక శాతం స్క్రీన్లు పోటీలో ఉన్న రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, వీరధీర శూర పార్ట్ 2 లాక్ చేసుకుంటున్నాయి. ఇంతకీ ఎల్2 ఎంపురాన్ మార్చి 27 వస్తుందా అంటే అందులో డౌట్ అక్కర్లేదని కేరళ మీడియా చెబుతోంది. కానీ క్రమంగా అనుమానాలైతే పెరుగుతున్నాయి. లూసిఫర్ లాంటి వంద కోట్ల సినిమా సీక్వెల్ కి ఇలాంటి పరిస్థితి రావడం విచిత్రం. చాలా క్రేజీ క్యాస్టింగ్ తో భారీ బడ్జెట్ తో నిర్మించిన ఎల్2 మీద మోహన్ లాల్ మాములు ఆశలు పెట్టుకోలేదు.

## కన్నప్ప వ్యూహాన్ని మారుస్తున్న విష్ణు

కన్నప్ప విడుదలకు ఇంకో నలభై మూడు రోజులు ఉంది. మంచు విష్ణు చాలా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ఆధ్యాత్మిక ప్యాన్ ఇండియా మూవీ నుంచి ఇప్పటి దాకా వచ్చిన రెండు పాటలు పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సి మనకు కొత్తే అయినప్పటికీ మ్యూజిక్ లవర్స్ కు వేగంగా కనెక్టయిపోయాడు. మిగిలినవి కూడా ఇంతకన్నా పెద్ద స్థాయిలో ఉంటాయని ఇన్ సైడ్ టాక్. అయితే కన్నప్ప గురించి ఒక ఆసక్తికరమైన టాక్ ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. థియేట్రికల్ బిజినెస్, ఓటిటి, శాటిలైట్ ఇంకా క్లోజ్ చేయలేదట. కారణం విష్ణు వీటి ద్వారా భారీ మొత్తాన్ని ఆశించడమే అంటున్నారు. తన వ్యక్తిగత ఇమేజ్ మీద కాకుండా కంటెంట్ మీద నమ్మకం, మల్టీస్టారర్ క్యాస్టింగ్, పోస్ట్ ప్రొడక్షన్ లో చూసుకున్న రషెస్ ఇవన్నీ విష్ణుకి బోలెడు నమ్మకం కలిగించాయట. అందుకే తొందరపడి తక్కువ రేట్లకు అమ్మడం కన్నా ట్రైలర్ రిలీజయ్యాక వచ్చే హైప్ ని బట్టి బయ్యర్లు వాళ్లే అధిక ధరలు ఆఫర్ చేస్తారనే కాన్ఫిడెన్స్ ఆయనలో ఉందట. మొన్నటి దాకా ట్రోలింగ్ కు టార్గెట్ గా ఉన్న కన్నప్ప మీద క్రమంగా ఆ ముద్ర పక్కకెళ్లింది. క్రమంగా పాజిటివ్ బజ్ ఏర్పడుతోంది. టీజర్ లో ప్రభాస్ తో సహా క్యాస్టింగ్ మొత్తాన్ని రివీల్ చేయడం సోషల్ మీడియాలో హైప్ తీసుకొచ్చింది. ఇదంతా శుభ శకునాలే. కాకపోతే అసలైన సవాల్ ఇక ముందుంది. ఈ వేడిని ఇలాగే కొనసాగించేలా పబ్లిసిటీ ప్లాన్ చేసుకోవాలి. శ్రీకాళహస్తిలో ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం విష్ణు ప్రయత్నాలు చేస్తున్నట్టు టాక్. టీమ్ మొత్తాన్ని ఈ వేడుక కోసం తీసుకురావాలని చూస్తున్నాడట. అయితే ప్రభాస్ డేట్ తో పాటు మిగిలిన ఆర్టిస్టుల డేట్లు సింక్ అవ్వాలి. అప్పుడే అందరి హాజరు కుదురుతుంది.



## సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్..

రుషి కిరణ్, శ్వేత, రూప, శివ యాదవ్, రజిత, ఏ కెన్ ప్రసాద్, మృణాల్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'ది సస్పెక్ట్'. టెంపుల్ టౌన్ టాకీస్ సమర్పణలో ప్రొడ్యూసర్ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీగా దర్శకుడు రాధాకృష్ణ రూపొందించారు. ఈ సినిమా ఈ నెల 21న ఎస్ కె ఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. దర్శకుడు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్రొడ్యూసర్ కిరణ్ నాకు ఎప్పటినుంచో స్నేహితులు. ఆయన ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడమే కాదు, మంచి క్యారెక్టర్‌లో నటించారు. పెద్ద సినిమాలు జీరో కలెక్షన్స్ చేసినవి ఉన్నాయి. చిన్న చిత్రాలు అద్భుతంగా ఆదరణ పొందినవీ ఉన్నాయి. ఈ సినిమా చిన్న చిత్రాల్లో పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'సినిమా రంగంలోకి రావాలనేది నా కల. ఈ సినిమాతో ఆ కల నెరవేరింది. నా స్నేహితుడు వీఎన్ ఆదిత్య ట్రైలర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. రాధాకృష్ణ చేసిన ఒక షార్ట్ ఫిలిం చూసి నచ్చి, ఈ సినిమాకు దర్శకత్వం చేయమని అడిగాను. ఈ సినిమాకు అన్నీ తానై రూపొందించాడు. యాక్టింగ్‌లో ట్రైనింగ్ తీసుకుని ఈ చిత్రంలో ఒక రోల్ చేశాను. ఈ మూవీలో అంతా కొత్తవాళ్లే. వాళ్లంతా బాగా నటించారు.

# విడాకులకు కారణాలేమిటి

## మెడ పై నల్లటి గీతలు ఆరోగ్యం డేంజర్ లో పడ్డట్టే...

చాలామందికి శరీరంపై కొన్ని ప్రదేశాలలో నల్లటి వలయాలు ఏర్పడుతూ ఉంటాయి. అదేవిధంగా కళ్ళకింద కనిపించే నల్లటి గీతల గురించి మనం ఎప్పుడు వింటూనే ఉంటాం. ఇవి ఒత్తిడి, నిద్ర లేకపోవడం మూలంగా వస్తూ ఉంటాయి. అయితే మెడ పై కనిపించే నల్లటి గీతలు గురించి ఎప్పుడైనా తెలుసుకున్నారా.? ఈ వలయాలు మురికి పేరుకుపోవడం వలన వస్తాయని అందరూ అనుకుంటూ ఉంటారు. అయితే దీనికి అంతర్గత ఇబ్బందుల వలన ఎలా జరుగుతుందని ఎవరికి తెలియదు.. ఈ సమస్యని మీరు కూడా ఎదుర్కొంటే కనుక అది మీ ఆరోగ్యాన్ని డేంజర్ లో పడేసినట్లే అని తెలుసుకోవడం మంచిది. అయితే దీని గురించి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మెడపై కనిపించే నల్లటి వలయాల గురించి అప్రమత్తంగా ఉండడం చాలా ముఖ్యం. అవి మీకు ఏదైనా ఇబ్బంది తెచ్చి పెట్టవచ్చు అని ఆరోగ్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఇవి ప్రీ డయాబెటిస్ గుణాలు, అంటే మీ శరీరం ప్రస్తుతం షుగర్ వ్యాధికి సంకేతాలను తెలుపుతున్నట్లు దీనిని ఎలా తగ్గించుకోవాలో ఎప్పుడు చూద్దాం. అయితే నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులను చేసుకోవాలి. ఎనిమిది గంటలు ప్రశాంతమైన నిద్ర కావాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి. బీడీలు, సిగరెట్లు, మద్యం లాంటివాటికి దూరంగా ఉండాలి. లేకపోతే ఇవి ఊపిరితిత్తులకి చెడుని కలిగిస్తాయి. అదేవిధంగా వీటివలన మెడ పై నల్లటి గీతలు వస్తూ ఉంటాయి. లైఫ్ స్టైల్ లో మార్పుల గుండా ప్రీ షుగర్ వ్యాధి లక్షణాలను నివారించుకోవచ్చు. స్కిన్ పై గోధుమ, పసుపు లేదా ఎరుపు రంగు మచ్చలు కనిపించడం మొదలైతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. తర్వాత కొన్ని పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. అదేవిధంగా భుజాలపై నడుముపై వెల్విట్ చర్మం కనిపిస్తే జాగ్రత్తగా ఉండడం ముఖ్యం. ఎందుకలాగా ఇది ప్రీ మధుమేహం లక్షణాలలో యాడ్ చేయబడిన ఇన్సులిన్ అధికమయ్యే సంకేతం అని వైద్య నిపుణులు జాగ్రత్తగా ఉండాలి అని తెలియజేస్తున్నారు..

## శరీరంలోని ఈ భాగాల్లో వాపు ఉంటే అస్సలు నిర్లక్ష్యం చేయకండి..

శరీరంలో ఎక్కడ వాపు ఉన్న దానిని తేలికగా తీసుకోకూడదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో వాపు అనేక వ్యాధులకు సంకేతం కావొచ్చని పేర్కొంటున్నారు.కొన్నిసార్లు వ్యక్తులు శరీరంలోని వాపు, మంటను తేలికగా తీసుకుంటారు. ఇది అలాంటి వారికి ప్రమాదంగా మారుతుంది. చేతులు, కాళ్ళలో వాపు, కళ్ళు వాపు, ముఖం వాపు తీవ్రమైన వ్యాధుల లక్షణాలు. అటువంటి పరిస్థితిలో, మీకు అలాంటి సమస్య ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు.వాస్తవానికి శరీరంలో వాపుకు అనేక కారణాలు ఉండవచ్చు. ఎముకలు, లేదా కండరాలలో నిరంతర నొప్పి, లేదా శరీరంలో ఏదైనా తీవ్రమైన వ్యాధి ఉంటే వాపు కనిపిస్తుంది. ఇంకా శరీరంలో వాపు రావడానికి ప్రధాన కారణాలలో ఒకటి రక్తం లేకపోవడం. చాలా సందర్భాలలో, శరీరంలో రక్తం లేకపోవడం వల్ల, అనేక భాగాలు వాపునకు గురవుతాయి. రక్తం లేకపోవడం వల్ల కళ్ళు, పాదాలలో కూడా వాపు కనిపిస్తుంది. శరీరంలో వాపు తీవ్రమైన వ్యాధులకు దారితీస్తుంది. కిడ్నీ సమస్యలు, థైరాయిడ్ వల్ల వాపు, ఒక్కోసారి థైరాయిడ్ అకస్మాత్తుగా తగ్గిపోవడం వల్ల శరీరంలో వాపు వస్తుంది. థైరాయిడ్ తక్కువగా ఉండటం కూడా వాపుకు ప్రధాన కారణం కావచ్చు. బలహీనమైన గుండె కారణంగా కొన్నిసార్లు వాపు కూడా వస్తుంది. కాలేయంలో ఎలాంటి సమస్య వచ్చినా శరీరంలో వాపు కనిపిస్తుంది. అటువంటి పరిస్థితిలో వాపును అస్సలు విస్మరించవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీ శరీరంలో ఎప్పుడైనా వాపు కనిపిస్తే.. కొన్ని ఇంటి నివారణ చిట్కాలు కూడా అవలంభించవచ్చు. అలాగని చెప్పులు లేకుండా నడవకూడదు. పడుకునే ముందు మీ పాదాలకు ఆవాల నూనె రాసి మసాజ్ చేసుకోని నిద్రపోండి. దీనివల్ల మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే శరీరంలో వాపు కనిపిస్తే.. అస్సలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మరువద్దు. తప్పనిసరిగా డాక్టర్ సలహాలు, సూచనలు పాటించాలి.

## వెల్లుల్లి నీరు ఆరోగ్యానికి ఎంత మంచిదంటే?

వెల్లుల్లిలోని ఔషధ గుణాలు ఇది అనేక వ్యాధుల నుంచి రక్షించి ఆరోగ్యంగా ఉంచడంలో చాలా బాగా సహాయపడతాయి. అయితే, వెల్లుల్లి నీటిని రెగ్యులర్‌గా తాగితే చాలా ఆరోగ్యంగా ఉండొచ్చని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. మనం ప్రతిరోజూ ఒక గ్లాసు వెల్లుల్లి నీటిని తాగడం వల్ల అనేక సమస్యలు దూరమవుతాయని.. ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతున్నారు.ఈ వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి అనేక వ్యాధులను దూరం చేస్తాయి. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ బి1, విటమిన్ సి, విటమిన్ బి6 వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇంకా ఆరోగ్యానికి మేలు చేసే మాంగనీస్, కాల్షియం, ఐరన్ కూడా ఉన్నాయి.

## క్యాన్సర్ పేషెంట్ల మానసిక వేదన ఎలా ఉంటుందో తెలుసా?



ఇంతకుముందు క్యాన్సర్ అంటే భయపడేవారు కాదు కానీ ఇప్పుడు క్యాన్సర్ అనే పదం సర్వసాధారణం. పిల్లల నుంచి పెద్దల వరకు ఏదో ఒక రకంగా క్యాన్సర్ బారిన పడుతున్నారు. వైద్య ప్రపంచంలో కూడా దీనికి చికిత్స అందుతోంది. ఏది ఏమైనప్పటికీ, క్యాన్సర్ రోగులకు జీవితం నరకమేనన్నది నిజం. కేన్సర్ రోగులను ఆదుకునే సంరక్షకుల జీవితాలు ఇక సుఖంగా లేవని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సంరక్షకుల మానసిక ఆరోగ్యంపై క్యాన్సర్ తీవ్రమైన ప్రభావాలను చూపుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. క్యాన్సర్ రోగుల సంరక్షకుల మానసిక క్షోభ తరచుగా నిర్లక్ష్యం చేయబడుతుందని అధ్యయనం కనుగొంది. కాబట్టి సంరక్షకుల గురించి అధ్యయనం ఏమి చెబుతుంది? సంరక్షకుని మానసిక ఆరోగ్యం క్యాన్సర్ రోగిపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? దానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇదిగో. క్యాన్సర్ రోగుల సంరక్షకుల జీవన నాణ్యతను తెలుసుకోవడానికి పాట్నాలోని ×××మీ లోని రేడియేషన్ ఆంకాలజీ విభాగం 2021లో ఒక అధ్యయనం నిర్వహించింది.దీని కోసం దేశంలోని మొత్తం 350 మంది క్యాన్సర్ సంరక్షకులను సంప్రదించారు. వీరిలో 264 మంది సంరక్షకులు తుది విశ్లేషణకు అర్హులు. ఎంపిక చేసిన 264 మంది సంరక్షకులకు మొత్తం 31 ప్రశ్నలు అడిగారు. ఈ ప్రశ్నలలో ఏడు సంరక్షకులపై భారం గురించి, 13 రోజువారీ దినచర్య సమస్యల గురించి, 8 మొత్తం పరిస్థితికి సానుకూలంగా ఎలా స్వీకరించాలనే దాని గురించి మరియు సంరక్షకుల ఆర్థిక సమస్యల గురించి 3 ప్రశ్నలు అడిగారు. ఇందులోని సర్వే క్యాన్సర్‌కు సంబంధించిన అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమైంది.ఈ విధంగా, నిర్వహించిన ఒక సర్వేలో, 54 శాతం మంది సంరక్షకులు క్యాన్సర్ రోగిని భారంగా భావించారు. భారం గురించి అడిగినప్పుడు 54 శాతం మంది ఈ విధంగా సమాధానమిచ్చారు. అలాగే, ఆర్థిక సమస్యల గురించి అడిగినప్పుడు, 55 శాతం మంది తమ ఆర్థిక పరిస్థితి కారణంగా క్యాన్సర్ రోగుల సంరక్షకులుగా పనిచేస్తున్నారని చెప్పారు.కేన్సర్ పేషెంట్ల సంరక్షణకు మంచి జీతం లభిస్తుందనే కారణంతో జనాలు ఈ పనికి వెళ్తున్నారని సర్వేలో తేలింది.



వివాహ సమయంలో అలంకరించిన పెళ్లి పందిరికి కట్టిన మామిడికాయ తోరణాల పచ్చదనంపలుచబడి ముందే నవ దంపతులు విడిపోవడానికి సిద్ధం అవుతున్నారు. సనాతన ధర్మం సూచించిన వివాహ బంధానికి నిర్వచనాలు వాయు వేగంగా మారుతున్నాయి. ఇద్దరు వ్యక్తుల మధ్య సామాజిక ఒప్పందంగా వివాహ బంధాన్ని పరిగణించడం జరుగుతోంది. తాళిని ఎగతాళి చేస్తూ విడాకులకు దారులు తెరుస్తున్నారు. విడాకులను సంక్లిష్ట సమస్యగా చూడకుండా, ఇద్దరి మధ్య నెలకొన్న సమస్యకు ఓ మంచి పరిష్కారంగా తీసుకోవడం జరుగుతున్నది. విడాకులు తీసుకొని పునర్వివాహం లేదా సింగిల్ పేరెంట్‌గా జీవించడం సర్వసాధారణం, ఫ్యాషన్ అవుతోంది.

విడాకులు ఓ ప్రపంచ సమస్య

ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజంలో విడాకులు ఒక ప్రధాన సమస్యగా నిలుస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా విడాకుల రేటు 1.80 (ప్రతి వెయ్యి మందిలో) ఉండగా, భారతంలో 1.0 ఉందని గమనించారు. మాల్దీవులు, బెలారస్, యూఎస్ఏ దేశాల్లో విడాకులు అధిక శాతం జరుగుతున్నాయి. తక్కువ విడాకులు నమోదు చేసుకున్న దేశాల జాబితాలో ఇండియా, మొజాంబిక్, కెన్యా, జింబాబ్వే, వియత్నాం, సౌత్ ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. ప్రతి వెయ్యి మందిలో 30 మంది భారతీయులు, 400 మంది అమెరికన్లు విడాకులు పొందుతున్నారు.

భారత్‌లో విడాకుల పర్వాలు

దినదినం దేశవ్యాప్తంగా విడాకుల రేటు క్రమంగా పెరుగుతోంది. విడాకులు అనేది ఒక వ్యక్తిగత సమస్యే అయినప్పటికీ దాని ప్రభావం సమాజ, కుటుంబ వ్యవస్థలపై అధికంగా పడుతున్నది. ప్రతి వెయ్యి మందిలో విడాకులు పొందిన వారి సంఖ్యను విడాకుల రేటుగా భావిస్తాం. గత రెండు దశాబ్దాల్లో విడాకుల రేటు రెట్టింపు కావడం సోచనీయం. ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు, కోల్‌కతా, లక్నో లాంటి మహానగరాల్లో దాదాపు వెయ్యి మందిలో 30 వరకు విడాకులు నమోదు అవుతున్నాయి. యూపీ, బీహార్, హర్యానా, రాజస్థాన్ లాంటి ఉత్తర భారత రాష్ట్రాల్లో విడాకుల రేటు తక్కువగా కనిపిస్తున్నది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు మహానగరాల్లో నివసించే దంపతుల్లో విడాకులు అధికంగా కనిపిస్తున్నాయి. చిన్న నగరాల్లో కూడా విడాకుల కేసులు అధికంగా కనిపించడం విచారకరం. 2021 – 22 ఏడాదిలో అత్యధికంగా మహారాష్ట్రలో 18.7 శాతం, ఎంపీలో 17.8 శాతం, కర్నాటకలో 11.7 శాతం, యూపీలో 8.8 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 8.2 శాతం, ఢిల్లీలో 7.7 శాతం, తమిళనాడులో 7.1 శాతం, తెలంగాణలో 6.7 శాతం విడాకులు నమోదు అయ్యాయి. విడాకులు పొందిన దంపతుల్లో 25 నుంచి 34 ఏండ్ల వయస్సు ఉన్న వారే అధికంగా (దాదాపు 35 శాతం) కనిపిస్తున్నారు. 18 – 24 ఏండ్ల లోపు దంపతులు 28 శాతం, 35 – 44 ఏండ్ల లోపు ఉన్న వారిలో 16 శాతం, 45 – 54 ఏండ్ల లోపు వారిలో 10 శాతం, 55 – 64 ఏండ్ల వారు 7 శాతం, 65 ఏండ్లు దాటిన వారు 5 శాతం విడాకులు పొందుతున్నారు. విడాకులు కోరుకున్న వారిలో పురుషులు 56.2 శాతం, మహిళలు 43.8 శాతం ఉంటున్నారు. భారతంలో విడాకులు పొందడానికి సాధారణంగా కనీసం 6 మాసాల నుంచి 20 ఏండ్లు, అమెరికాలో 2 ఏండ్లు, ఐరోపాలో 6 ఏండ్ల సమయం పడుతుంది.

భిన్నత్వంలో ఏకత్వానికి చిరునామా భవ్య భారతం. సువిశాల భారతంలో దాదాపు 09 ప్రధాన మతాలు, దాదాపు 3,000లకు పైగా కులాలు, 25,000న వరకు ఉప కులాలు, ఐదు ప్రధాన జాతులు ఉన్నాయి. దేశ ప్రజల సంస్కృతులు, వారసత్వ సంపదలు, పండుగలు, ఆచార వ్యవహారాలు విభిన్నంగా ఉంటాయి. విడాకులకు కారణాలుగా ఇరువురికి మధ్య సమాచార లోపం, ఆర్థిక చిక్కులు, వివాహేతర సంబంధాలు, ప్రేమ కొరవడడం, పాశ్చాత్య సంస్కృతి, లైంగిక సామర్థ్యం లోపించడం, భావోద్వేగ (అహం) సమస్యలు, అపనమ్మకాలు, విలువల్లో వ్యత్యాసం, నిరుత్సాహం, అభద్రత, వరకట్న వేధింపులు, స్వతంత్రతను కోరుకోవడం, అసంబద్ధ పని సంస్కృతి, మద్యం/పొగాకు దురలవాట్లు, మానసిక నిరాశ/ఒత్తిడి/చెడు, కుల మతాంతర పెళ్లిళ్లు లాంటివి ప్రధానంగా గమనించబడ్డాయి. పురుషాధిక్య భారత సమాజంలో విద్యాధిక మహిళలు మంచి ఉద్యోగాలు చేస్తూ స్వతంత్ర భావాలతో పాటు జీవనశైలిని సహితం కోరుకుంటున్నారు. వర్కింగ్ ఉమెన్‌గా తన కాళ్ల పైన తాను నిలబడడంతో కుటుంబ సభ్యుల, భర్తల మాటలను వినకుండా విభేధాల అగాధాలను పెంచుకుంటూ తాళి తెగేదాకా లాగుతున్నారని తేలింది. ఉన్నత విద్యార్హతలు పెరిగిన కొలది విడాకుల రేటు కూడా పెరుగుతున్నది.

విడాకులు ఇకపై వైఫల్యం కాదని, సిగ్గు మాలిన చర్య కానే కాదని నేటి సమాజం భావిస్తున్నది. విడాకులు పొందిన మహిళలు కూడా తమ జీవితాలను తిరిగి కొత్తగా ప్రారంభించడం, స్వతంత్రంగా సమాజం ఎదురుగా నిలబడి గౌరవం పొందడం చూస్తున్నాం. నాటి వివాహ వ్యవస్థల విలువలు మారుతున్నాయి, ప్రేమలు పలుచబడుతున్నాయి, సర్థుకు పోవడం మరిచి పోతున్నారు. సంసార నౌక సజావుగా ముందుకు సాగడానికి సర్దుకు పోవడమనే కందెన ఉపయోగపడాలి. ఆలుమగలు ఆకర్షణీయ వేతనాలను కలిగి ఉండడంతో విడాకుల రేటు పెరుగుతోందని, ఇలా బలహీన సంబంధాలు కలిగిన దంపతులు కలిసి ఉండడం కన్న విడిపోవడమే ఉత్తమమని, విడాకులు తీసుకొని స్వతంత్రంగా నివసిస్తున్నారని వాదించే వారు కూడా ఉన్నారు. నిత్య గొడవలతో కలిసి ఉండడం కన్న విడాకులు పొంది స్వతంత్రంగా, ప్రశాంతంగా బతకడం ఉత్తమమని నేటి డిజిటల్ సమాజం కోరుకుంటున్నది. పురుషాధిక్య సమాజంలో ఉద్యోగ మహిళలు గృహ హింస, అణచివేత, బానిస బతుకు లాంటి సంకెళ్ళను ఛేదించుకొని నేటి వనితలు విడాకులను ఆశ్రయించడం కూడా సముచితంగానే కనిపిస్తున్నది. విడాకులు పొందిన మహిళలను చిన్న చూపు చూసే నాటి సమాజం నుంచి నేడు విడాకులు పొందిన మహిళలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో జీవనాలను గడపడం సమాజం చేత అంగీకరించబడుతున్నది.

ఆలుమగల మధ్య ప్రేమ, నమ్మకం, సర్థుకుపోవడం, భద్రత, సంభోగ సుఖం, పరిమిత స్వేచ్ఛ కలిగి ఉండడం, దినసరి సమస్యలను తెలివిగా పరిష్కరించుకోవడం, పరస్పర గౌరవం, కుటుంబ విలువలకు పట్టం కట్టడం, ఇష్టంగా కష్ట పడుతూ కుటుంబాన్ని పోషించడం/పెంచడం, తాళి ఒక దారం/తాడు కాదని, అది విడదీయరాని రెండు మనసుల కలయిక అని తెలుసుకొని, తాళిని ఎగతాళి చేయకుండా సంసారాన్ని సంతోషాల కోవెలగా మార్చుకుందాం. విడాకుల భావనలకు విడాకులు ఇచ్చేద్దాం.

## ఆ మూడు రోగాలు.. ప్రాణాలు తీసేస్తున్నాయి

అలవాట్లు మనిషిని పట్టిస్తాయి. అంతే కాదు బంధిస్తాయి. బానిసను కూడా చేస్తాయి. అవి చెడు వ్యసనాలు కావొచ్చు. ఆహారపు అలవాట్లు కూడా కావొచ్చు. కరోనా తర్వాత మానవ జీవితంలో పెను మార్పులు సంభవించాయి.అవి జీవన విధానంలో కావొచ్చు, ఆహారపు అలవాట్లలో కావొచ్చు. సరైన ఆహారాలు తీసుకోకుంటే మనిషి అనారోగ్యానికి గురవుతారని మనందరికీ తెలిసినా ఎందుకో వాటిపై అశ్రద్ధ వహిస్తూ వస్తాం. ప్రపంచ వ్యాప్తంగా ఆహారపు అలవాట్లు, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి అని మీకు తెలుసా.. తెలియాలంటే దీనిని చదివేయండి. స్టే హెల్తీ, ఈట్ హెల్తీ మూవ్ అనే సంస్థ ఈ అంశాలపై ఓ సర్వే నిర్వహించింది. ఇందులో మనుషుల మరణానికి గల కారణాలను వివరించింది.అత్యధికంగా ప్రాణాలు కోల్పోతున్న వారిలో హైపర్ టెన్షన్ బాధితులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. దాదాపు దీనివల్ల 40శాతం మంది తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారంట. మరోవైపు ఒబిసిటీ వల్ల 20శాతం మంది చనిపోతే.. డయాబిటిస్ వల్ల 15 శాతం మంది మృత్యువాత పడుతున్నారు.మరోవైపు సిగిరెట్ తాగకండి జీవితంలోరన్ అవుట్ కావొద్దని సినిమా కి ముందు రాహుల్ ద్రావిడ్ ప్రకటన పదే పదే చూపిస్తున్నా దానిని బేఖతారు చేస్తూ కొంతమంది ధూమపానం చేస్తూనే ఉన్నారు. దీని వల్ల 15శాతం మంది రన్ అవుట్ అంటే చనిపోతున్నారు. ఎటువంటి రిస్క్ ఫ్యాక్టర్ తెలియకుండా చనిపోయే వర్గం కూడా ఉన్నారు. ఇందులో కూడా హైపర్ టెన్షన్ వల్ల 53శాతం కాగా ఒబిసిటీ 37శాతం, డయాబిటిస్ 9శాతం, గుండెనొప్పుల వల్ల 26శాతం మంది మృత్యువాత పడుతున్నారని తెలిపింది. మరోవైపు క్యాన్సర్ వల్ల 22శాతం మంది మరణిస్తే రిస్క్ ఫ్యాక్టర్ క్యాన్సర్ చావుకు 100 శాతం కారణం అవుతోంది. అదే సందర్భంలో గుండెపోటు వల్ల ఆరుశాతం మంది మరణిస్తే ఇది కూడా హైపర్ టెన్షన్ వల్లనే వస్తోందని తెలిపింది.

## ఈ పండ్లు తింటే కంటిచూపు రెట్టింపు అవుతుంది

ఈ పండ్లు తింటే కంటిచూపు రెట్టింపు అవుతుంది?కంటి ఆరోగ్యానికి మంచి చేసే పండ్లలో సిట్రస్ పండ్లు బాగా ఉపయోగపడతాయి. నిమ్మ, నారింజ, బత్తాయి, ద్రాక్షపండ్లు వంటి పుల్లని పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.ఇది కంటిలోని రక్తనాళాల ఆరోగ్యాన్ని బాగా బలపరుస్తుంది.ఇది వయస్సు–సంబంధిత దృష్టి లోపాలను ఈజీగా నివారిస్తుంది. అలాగే కంటిశుక్లాలకు కూడా సహాయపడుతుంది.ఇంకా ఆప్రికాట్లలో విటమిన్ ఎ, సి, ఇ సహా కెరోటినాయిడ్స్ చాలా పుష్కలంగా ఉంటాయి. వీటిలో బీటా కెరోటిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రాత్రి దృష్టిని మెరుగుపరచడం ఇంకా చీకట్లో దృశ్యాలను చూడగల కళ్ళ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.కంటి రెటీనాను దెబ్బతీసే నీలం, అతినీలలోహిత కిరణాల నుంచి రక్షించడంలో ఆప్రికాట్లలోని పోషకాలు చాలా బాగా సహాయపడతాయి.బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీస్, క్రాన్‌బెర్రీస్ ఇంకా బ్లాక్‌బెర్రీస్ మొదలైన బెర్రీ పండ్లు కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా గొప్ప పండ్లు. బెర్రీలలోని యాంటీఆక్సిడెంట్లు లో బీపీ, కళ్లు పొడిబారడం, దృష్టి లోపాలు ఇంకా మచ్చల క్షీణతను నివారించడంలో సహాయపడతాయి.అరటిపండ్లు కూడా కంటి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. అరటి పండులో పొటాషియం అనే పోషకం చాలా సమృద్ధిగా లభిస్తుంది. ఇది కంటి ఆరోగ్యానికి బాగా మేలు చేస్తుంది. తరచూ పొడి బారిన కళ్ళకు ఈ మూలకం చాలా అవసరం. మంచి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం రోజూవారీ ఆహారంలో ఖచ్చితంగా అరటిపండును తీసుకోవాలి.ఇంకా అలాగే బొప్పాయి కూడా కంటికి మేలు చేస్తుంది. ఇందులో లుటీన్ ఇంకా జియాక్సంతిన్ అనే యాంటీఆక్సిడెంట్ వంటి కీలక పోషకాలు లభిస్తాయి.. పైగా ఇవి సహజమైన సన్‌బ్లాక్‌గా పనిచేస్తాయి. ఇది రెటీనాలోకి వచ్చే అదనపు కాంతిని గ్రహించడంలో చాలా బాగా సహాయపడుతుంది. బ్లూ లైట్ నుండి కంటిని రక్షించడంలో కూడా ఇవి చాలా బాగా సహాయపడతాయి.కాబట్టి ఖచ్చితంగా ఈ పండ్లు తినండి. మీ కంటి ఆరోగ్యాన్ని

## స్నానానికి వేడి నీరు మంచిదేనా

ఎండా కాలం, వర్షా కాలంలో ఎలా ఉన్నా కానీ.. శీతా కాలంలో మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా చర్మం పరంగా, ఆరోగ్యం పరంగా ఖచ్చితంగా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.లేదంటే చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.ఇక సాధారణంగా కొంత మంది చన్నీటితో స్నానం చేస్తారు. మరి కొంత మంది అయితే వేడి నీటితో చేస్తారు. ఎందుకంటే స్నానం చేస్తే మంచి రిలాక్సేషన్ దొరకుతుంది. చిరాకు పోయి.. మనసుకి చాలా హాయిగా ఉంటుంది. అయితే చన్నీటి స్నానం మంచిదా? వేడి నీటి స్నానం చేయడం మంచిదా? అనే డౌట్ చాలా మందిలో కూడా ఉంటుంది. మరి ఏ నీటి స్నానం వల్ల లాభాలు ఉన్నాయి? ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఇక శీతా కాలంలో చన్నీటితో స్నానం చేయడం వల్ల బాడీలో వాతవ అనేది బాగా పెరుగుతుంది. దీని వల్ల నొప్పులు, కండరాల నొప్పులు, చర్మం పొడి బారడం ఇంకా బలహీనమైన జీవక్రియ వంటి సమస్యలు ఎక్కువగా ఎదురవుతాయి. ఇంకా అంతే కాకుండా శరీరం నొప్పులు తీరవు. కానీ ఒకవేళ క్రమం తప్పకుండా చన్నీటితో స్నానం చేసే వారైతే మాత్రం.. శీతా కాలంలో కూడా చన్నీటి స్నానం చేయడం చాలా మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది మన శరీరంలో ఎలాంటి భంగం కలిగించదు. ఇంకా అంతే కాకుండా చన్నీటి స్నానం చేయడం వల్ల బ్లడ్ సర్క్యులేషన్ పెరుగుతంది. తెల్ల రక్తకణాలు అధిక శాతం ఇంకా జీవ క్రియ రేటు ఎక్కువగా ఉంటాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

వింటర్ సీజన్ లో వేడి నీటితో స్నానం చెయ్యడం శరీర వాతాన్ని తగ్గిస్తుంది. ఇంకా అలాగే కండరాల నొప్పులు, ఒత్తిడి తగ్గుతుంది. మనసుకు, శరీరానికి చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఇంకా అంతే కాకుండా వేడి నీళ్లు చేసేటప్పుడు వచ్చే పొగను పీల్చడం ద్వారా జలుబు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. ఇంకా చలి తీవ్రతను కూడా తగ్గిస్తుంది.చలికాలంలో చన్నీటి స్నానం చేయడం వల్ల వాతాన్ని పెంచడమే కాకుండా చలి కూడా పెరుగుతుంది. కాబట్టి శరీరం వేడిని కాపాడుకోవడానికి ఖచ్చితంగా చాలా కష్ట పడాలి. చలి కాలంలో బాహ్య ప్రపంచం అనేది చల్లగా ఉంటుంది. అప్పుడు శరీరం అంతర్గత వాతావరణాన్ని వెచ్చగా ఉంచడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి మీరు శీతాకాలంలో వేడి నీటితో స్నానం చేయడం వల్ల ఖచ్చితంగా మంచి ప్రయోజనాలు ఉంటాయి. వేడి నీటి స్నానంతో చలి కారణంగా వణుకు తగ్గడమే కాకుండా ఒత్తిడి, కండరాల నొప్పులు ఇంకా సీజనల్ గా వచ్చే వ్యాధులనూ దూరం చేసుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

## ఇంగువతో కూడా బరువు తగ్గొచ్చు..

ప్రస్తుతం చాలా మంది అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నవారే ఉన్నారు. బిజీ లైఫ్ కారణంగా సరైన సమయానికి తినక పోవడం, గంటలకు గంటలు ఒకే చోట కూర్చోవడం, జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఈజీగా వెయిట్ పెరిగి పోతున్నారు.బరువు పెరగడం వల్ల శరీరంపై చాలా నష్టాలు పడే అవకాశాలు ఉన్నాయి. డయాబెటీస్, రక్త పోటు, జీర్ణ సమస్యలు, గుండె పోటు వంటి పలు సమస్యలు ఎదురవుతాయి. బరువు తగ్గాలి అంటే శరీరంలో పేరుకు పోయిన కొవ్వును కరిగించాలి. వెయిట్ లాస్ కోసం మందులు కాకుండా.. వ్యాయామం, సరైన ఆహారం తీసుకుంటే ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్ట వచ్చు. తినే ఆహారమే శరీర బరువును నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గటానికి చాలా మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అలాంటి వారు ఇంట్లో ఉండే ఇంగును మర్చి పోతారు. బరువును తగ్గించడంలో ఇంగువ చాలా బాగా ఉపయోగ పడుతుంది. ఇంగువ నీళ్లను తాగడం వల్ల త్వరగా బరువు తగ్గొచ్చు. బరువు తగ్గాలి అనేకునే వారు ఇంగువ నీళ్లను తాగడం అలవాటు చేసుకోవాలి. ఇంగువ అనేది ఇప్పుడు అందరి ఇళ్లలో కూడా ఉంటుంది. మరి ఇంగువతో శరీర బరువును ఎలా తగ్గించు కోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. ఇంగువను ఒక గ్లాస్ గోరు వెచ్చటి నీటిలో కలుపుకుని తాగితే.. బరువును తగ్గించుకోవచ్చు. ఇంగువలో యాంటీ ఒబేసిటీ గుణాలు ఉంటాయి. ఇవి వెయిట్ లాస్ అయ్యేందుకు హెల్ప్ చేస్తాయి. ప్రతి రోజూ ఇలా ఒక గ్లాస్ ఇంగువ నీటిని తాగితే.. సింపుల్ గా బరువు తగ్గొచ్చు. ఇంగువ నీటితో అధిక బరువునే కాకుండా.. తల నొప్పిని కూడా తగ్గించు కోవచ్చు. అంతే కాకుండా పీరియడ్స్ లో వచ్చే నొప్పి కూడా ఇంగువ నీళ్లు బాగా ఉపయోగ పడతాయి.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.